16 నుంచి అమృత్ ఉద్యాన్ సందర్శన



2


# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - ఆదివారం 3 ఆగస్టు 2025 | సంపుటి: 9 | సంచిక: 216 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


## ఆమె ఓ మెషీన్‌గన్

వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీపై ట్రంప్ ప్రశంసలు



2



# వచ్చే ఎన్నికల్లో మోడీని ఓడగొడ్తం

### 2029లో ఎన్డీయేకు 150 సీట్లకు మించనివ్వం

- దేశ స్వాతంత్ర్యం కోసం పుట్టిన పార్టీ కాంగ్రెస్.. పదవుల కోసం పుట్టింది బీజేపీ
- ప్రధాని పదవిని త్యాగం చేసిన రాహుల్‌పై విమర్శలా?
- బీసీ రిజర్వేషన్ చట్టం కోసం రాహుల్ వెంట నడుద్దాం
- ఈ విషయంలో తెలంగాణ దేశానికే మోడల్‌గా ఉంది
- ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ వార్షిక న్యాయ సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి

## ప్రపంచంతో పోటీ పడాలె

యువత డ్రగ్స్‌కు దూరం కావాలె

దాని కోసమే స్పోర్ట్స్ పాలసీని తెచ్చినం

రాష్ట్ర క్రీడా విధాన ఆవిష్కరణ సభలో సీఎం రేవంత్

2

**ఢిల్లీ, ఆగస్టు 2:** దేశ స్వాతంత్ర్యం సాధించడం కోసమే ప్రారంభమైన పార్టీ కాంగ్రెస్ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్ లో జరిగిన కాంగ్రెస్ వార్షిక న్యాయ సదస్సులో మాట్లాడిన ఆయన.. ప్రస్తుతం ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఇతర అన్ని రాజకీయ పార్టీలు దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాతే ప్రారంభమయ్యాయి. బీజేపీ, బీఆర్ఎస్, జేడీ (యూ), బీజేడీ, ఆర్జేడీ.. ఇవన్నీ కూడా స్వాతంత్ర్యానంతరం ఏర్పడిన పార్టీలే. కానీ, కాంగ్రెస్ పార్టీ మాత్రం దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడానికి ప్రారంభమైన పార్టీ అనేది ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలన్నారు. ఈ దేశానికి స్వాతంత్ర్యం అందించిన పార్టీ కాంగ్రెస్. ఈ దేశానికి రాజ్యాంగాన్ని ఇచ్చిన పార్టీ కాంగ్రెస్. ఈ దేశంలో దళితులు, ఆదివాసులకు రిజర్వేషన్లు కల్పించింది కూడా కాంగ్రెస్సే. ఈ దేశంలో సామాజిక న్యాయం కోసం కషి చేస్తున్నది కూడా కాంగ్రెస్ పార్టీయే. ఇది ఇతర రాజకీయ పార్టీలలా కాదు. ఇతర రాజకీయ పార్టీలు ఎన్నికలొస్తే పోటీ చేయడం, గెలిస్తే పదవిలో కూర్చోవడం, ఓడిపోతే ఇంట్లో కూర్చోవడం అలవాటైపోయింది. బీజేపీ నుంచి మొదలుకొని చాలా విపక్ష పార్టీలు ఇలాగే వ్యవహరిస్తున్నాయి. ఓడిపోయాక ప్రజల మధ్యకు రావడమే లేదని ఆయన విమర్శించారు. కానీ కాంగ్రెస్ పార్టీ మాత్రం

...మిగతా 2లో

## ట్రంప్ మాటల్లో నిజమే లేదు

- పదేపదే అబద్ధాలు చెప్తున్న ట్రంప్
- ఆయనది ఓర్వలేని తనం
- భారత ప్రభుత్వ వర్గాలు

भारत सरकार GOVERNMENT OF INDIA

सत्यमेव जयते

2

ట్రంప్ కామెంట్లకు మోడీ కౌంటర్..

### మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్న భారత్

మనోళ్లు తయారు చేసిన వస్తువులనే కొనాలన్న ప్రధాని

## లోకేశ్ అలాంటి వ్యాఖ్యలు చేయొద్దు

పదేండ్ల పాలనలో ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేదు

బీఆర్ఎస్ ప్రభుత్వం మోయలేనన్ని అప్పులు మాత్రం చేసింది

ఉప ముఖ్యమంత్రి భట్టి



2

## బీసీల హక్కులను కాంగ్రెస్ కాలరాస్తోంది

బీజేపీ ఓబీసీ మోర్చా మహాధర్నాలో రామచందర్రావు



**హైదరాబాద్, ఆగస్టు 2:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో కానీ బీసీ నేతను ముఖ్యమంత్రి చేశారా అని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్రావు కాంగ్రెస్ పార్టీని ప్రశ్నించారు. నగరంలోని ఇందిరాపార్క్ వద్ద బీజేపీ ఓబీసీ మోర్చా మహాధర్నాలో ఆయన పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ బీసీల పేరుతో రాజకీయం చేయాలని చూస్తోందని.. బీసీలకు ఎక్కడ ప్రాధాన్యమిచ్చిందని నిలదీశారు. తొమ్మిది మంది కార్పొరేషన్ ఛైర్మన్లను నియమిస్తే ఒక్క బీసీ నేతకు మాత్రమే అవకాశమిచ్చారని విమర్శించారు. క్యాబినెట్లో కేవలం ముగ్గురు బీసీ మంత్రులు మాత్రమే ఉన్నారన్నారు. బీసీల పట్ల కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే.. 42 శాతం రిజర్వేషన్లు కేవలం బీసీలకు మాత్రమే ఇవ్వాలని, ఇతర మతాల వారిని కలపొద్దని డిమాండ్ చేశారు. బీసీల హక్కులను ఎంఐఎం పార్టీ హరిస్తోందని, కాంగ్రెస్ కాలరాస్తోందని

...మిగతా 2లో



## కార్పొరేట్ స్థాయిలో సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలు

నాలుగు జిల్లాల్లో 9 ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ భవనాల నిర్మాణం

స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ సమీక్షలో మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, ఆగస్టు 2:** తెలంగాణలో సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలను పునర్వ్యవస్థీకరిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్రెడ్డి వెల్లడించారు. కార్పొరేట్ స్థాయిలో శాశ్వత భవనాలను నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. నాలుగు జిల్లాల్లో 9 ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ భవనాలు నిర్మించనున్నట్లు చెప్పారు. త్వరలో గచ్చిబౌలిలో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే స్లాట్ బుకింగ్ విధానాన్ని తీసుకొచ్చి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్న స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ.. ప్రజలకు మరింత సమర్థంగా సేవలందించేందుకే మరో అడుగు ముందుకు వేస్తున్నట్లు వెల్లడించారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులతో సచివాలయంలో మంత్రి సమీక్ష నిర్వహించారు. 'ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, పరిపాలనకు ఇబ్బంది లేకుండా సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల పునర్వ్యవస్థీకరణ, కొత్త భవనాల నిర్మాణం ఉండాలి. అంతిమంగా ప్రజల సంతృప్తే ప్రధానం అనే అంశాన్ని అధికారులు దృష్టిలో పెట్టుకోవాలి. ప్రస్తుతం రాష్ట్రంలో 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా వాటిలో 37 మాత్రమే సొంత భవనాల్లో ఉన్నాయి. మిగిలినవన్నీ

...మిగతా 2లో

## జెన్‌కో ఉద్యోగులకు 5 శాతం అలవెన్స్

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం.. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కీలక నిర్ణయాలు తీసుకుంటుంది. సామాన్య ప్రజలతో పాటుగా ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి కూడా అనేక కీలక నిర్ణయాలు తీసుకుంటున్న విషయం తెలిసిందే. తెలంగాణ రాష్ట్రంలోని జెన్ కో థర్మల్,హైడల్ కేంద్రాల ఉద్యోగులకు 5 శాతం జనరేషన్ అలవెన్సును వర్తింపజేస్తూ సీఎండీ ఎస్.హరీశ్ ఉత్తర్వులు జారీ చేశారు. ట్రాన్స్‌కో లోని సీబీడీ, ఎస్ఎంజీ, ఎంఆర్టీ విభాగాల్లో పనిచేస్తున్న ఆర్టిజన్లకు ప్రత్యేక అలవెన్సుల కింద ఒకే సారి గంపగుత్తగా నెలకు రూ. 6 వేలు,

...మిగతా 2లో

మంత్రి కొండా సురేఖకు

## బిగ్ షాక్

క్రిమినల్ కేసు నమోదుకు నాంపల్లి కోర్టు ఆదేశం

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** మంత్రి కొండా సురేఖకు నాంపల్లి కోర్టు షాక్ ఇచ్చింది. మంత్రిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆదేశించింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు దాఖలు చేసిన పరువు నష్టం కేసులో కోర్టు ఆదేశాలు ఇచ్చింది. గత కొద్ది రోజుల క్రితం మంత్రి కొండా సురేఖ, ఫోన్ ట్యాపింగ్ కేసు, డ్రగ్స్ వ్యవహారం, నటి సమంత విడాకుల అంశంలో కేటీఆర్‌పై ఆరోపణలు చేశారు. ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో పెద్ద దుమారాన్నే లేపాయి. తనపై చేసిన ఆరోపణలు నిరాధారమైనవని, తన పరువుకు భంగం కలిగించేలా ఉన్నాయని భావించిన కేటీఆర్, కొండా సురేఖపై నాంపల్లి కోర్టులో పరువు నష్టం దావా

...మిగతా 2లో

## ఓటరు జాబితాలో నా పేరే లేదు

వెల్లడించిన తేజస్వీ యాదవ్

తోసిపుచ్చిన ఎన్నికల సంఘం



**పాట్నా, ఆగస్టు 2:** బిహార్ శాసనసభ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా ముసాయిదాను ఎన్నికల సంఘం శుక్రవారం ప్రచురించిన సంగతి తెలిసిందే. దీనిపై విపక్షాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. తాజాగా ఆర్జేడీ నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ స్పందిస్తూ.. ఈ ముసాయిదా జాబితాలో తన పేరే లేదని

...మిగతా 2లో

## కాంగ్రెస్ పాదయాత్రకు జన నీరాజనం



12

## 70 కాదు కనీసం 80 గంటలు పనిచేయాలె

వారానికి 80 అనేది కనీస స్థాయి పని గంటలు మాత్రమే

ఏఐ సంస్థ ఏప్రిల్ వ్యవస్థాపకురాలు నేహా సురేశ్ కామెంట్స్

వాదోపవాదాలకు దారి తీసిన ప్రతిపాదన



### పని గంటల పంచాతి

**న్యూయార్క్, ఆగస్టు 2:** పనిగంటలపై ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి చేసిన వ్యాఖ్యలపై నాటి నుంచి వివిధ స్థాయిల్లో దేశవ్యాప్తంగా చర్చలు జరుగుతోన్న విషయం పాఠకులకు విదితమే. ఇప్పుడు శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత యువ వ్యాపారవేత్త కూడా నారాయణమూర్తి వంటి

...మిగతా 2లో

అత్యాచారం కేసు..

## ప్రజ్వల్ రేవణ్ణకు జీవిత ఖైదు

రూ. పది లక్షల జరిమానా • ఎక్కెక్కి ఏడ్చిన దోషి..

**బెంగళూరు, ఆగస్టు 2:** ఇంట్లో పనిమనిషిపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడిన కేసులో హాసన మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు జీవిత ఖైదు పడింది. దీంతోపాటు రూ.10లక్షల జరిమానా విధిస్తూ బెంగళూరులోని ప్రజాప్రతినిధుల ప్రత్యేక న్యాయస్థానం శిక్ష ఖరారు చేసింది. బాధితురాలికి రూ.7లక్షల

...మిగతా 2లో



## భారత ఆర్థికవ్యవస్థ డైనమిక్

అది డెడ్ ఎకానమీ కాదు.. ట్రంప్ చెప్పింది తప్పు అంటున్న ఏఐ ప్లాట్‌ఫామ్‌లు

**ఢిల్లీ, ఆగస్టు 2:** ప్రస్తుత సాంకేతిక యుగంలో ఓపెన్ ఏఐ, చాట్ జీపీటీ వంటి వాటికి ప్రత్యేక ఆదరణ ఉంది. ఎలాంటి ప్రశ్నలకైనా ఈ కృత్రిమ మేధ ప్లాట్‌ఫామ్‌లు సమాధానం చెప్పగలవు. ఈ క్రమంలోనే భారత ఆర్థిక వ్యవస్థ పతనమైందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల తీవ్ర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఇదే ప్రశ్నను పలు ఏఐ ప్లాట్‌ఫామ్‌లను అడగ్గా..

...మిగతా 2లో



# ఆమె ఓ మెషీన్‌గన్

- **వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీపై ట్రంప్ ప్రశంసలు**

**వాషింగ్టన్, ఆగస్టు 2:** వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రశంసలు కురిపించారు. న్యూస్‌మాక్స్‌లో రాబ్ ఫిన్నెర్టీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ.. అమెరికాకు అధ్యక్షుడిగా సేవలు అందించిన అందరు అధ్యక్షుల్లో తనకు మాత్రమే అద్భుతమైన, ఉత్తమ ప్రెస్ సెక్రటరీ ఉందని అన్నారు. కరోలిన్ లీవిట్ మెషీన్‌గన్‌లా పనిచేస్తూ.. తన విధులను సమర్థమంతంగా నిర్వర్తిస్తోందన్నారు. అందం, హుందాతనంతో ప్రజల్లో ఓ స్టార్‌గా మారిపోయిందని పేర్కొన్నారు. కరోలిన్ మాట్లాడేటప్పుడు ఆమె పెదాల కదలిక చాలా అందంగా ఉంటుందని పొగిడారు. అదే ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. అమెరికా మాజీ అధ్యక్షుడు ఒబామాపై ట్రంప్ విమర్శలు గుప్పించారు. 2016 ఎన్నికల్లో తాను విజయం సాధించిన తర్వాత తన పాలనను నియంత్రించేందుకు ఒబామా సన్నిహిత వర్గాలు అసత్య ప్రచారం చేశాయని మండిపడ్డారు. ఎన్నికల్లో రష్యా జోక్యం చేసుకుందంటూ తప్పుడు వాదన తెచ్చారని ఆరోపించారు. దీనికి ఆయన తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. మరోవైపు కరోలిన్ లీవిట్ కూడా అమెరికా అధ్యక్షుడిపై ప్రశంసలు గుప్పించారు. ట్రంప్ ప్రపంచంలోనే అత్యంత ప్రభావవంతమైన నేత అని కొనియాడారు. ఆయన భారత్- పాక్ మధ్య జరిగిన ఘర్షణతో సహా ప్రపంచవ్యాప్తంగా థాయ్‌లాండ్-కంబోడియా, ఇజ్రాయెల్-ఇరాన్, ఈజిప్ట్- ఇథియోపియా, రువాండా- కాంగో డెమోక్రాటిక్ రిపబ్లిక్ వంటి అనేక యుద్ధాలను ముగించారన్నారు. రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయెల్ హమాస్ మధ్య జరుగుతున్న యుద్ధాన్ని ఆపడానికి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఇందుకుగాను ఆయనకు నోబెల్ శాంతి పురస్కారాన్ని అందించాలని కోరారు. గత కొంతకాలంగా ట్రంప్ నోబెల్ శాంతి బహుమతి తనకు వస్తుందని ఆశగా ఉన్నారు. నోబెల్ శాంతి బహుమతికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేరును ఇజ్రాయెల్, పాకిస్థాన్ ప్రతిపాదించాయి. తాను ఎన్ని యుద్ధాలు ఆపినా తనకు నోబెల్ శాంతి బహుమతి రాదేమోనని ఆయన పలుమార్లు నైరాశ్యం వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో కరోలిన్ లీవిట్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# 16 నుంచి 'అమృత్ ఉద్యాన్' సందర్శన

**ఢిల్లీ, ఆగస్టు 2:** రాష్ట్రపతి భవన్‌లోని అమృత్ ఉద్యాన్ (మొఘల్ గార్డెన్స్)ను ప్రజల సందర్శనార్థం ఈ నెల 16 నుంచి సెప్టెంబర్ 14 వరకు ప్రవేశం కల్పిస్తున్నట్లు రాష్ట్రపతి భవన్ అధికారిక వర్గాలు శనివారం ఓ ప్రకటనలో వెల్లడించాయి. ఉద్యానవనంలో ప్రవేశానికి ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సందర్శకులకు అనుమతి ఇవ్వనున్నారు. నిర్వహణ నిమిత్తం అన్ని సోమవారాలు సెలవు ఉంటుందని రాష్ట్రపతి కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఉద్యానవనంలో బాలవాటిక, హెర్బల్ గార్డెన్ , బోన్సాయ్ గార్డెన్ ,సెంట్రల్ లాన్, సర్క్యులర్ గార్డెన్, లాంగ్ గార్డెన్ వంటివి సందర్శకులను ఆకర్షించనున్నాయి. అమృత్ ఉద్యాన్ లోని ప్రతి మొక్కకు ఉన్న క్యూఆర్ కోడ్ సహాయంతో ఆ వృక్ష జాతి గురించి తెలుసుకోవచ్చు. ఆగస్టు 29న జాతీయ క్రీడల దినోత్సవం, సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని క్రీడాకారులకు, ఉపాధ్యాయులకు ప్రత్యేక ప్రవేశ సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

# ట్రంప్ మాటల్లో నిజమే లేదు

**ఢిల్లీ, ఆగస్టు 2:** రష్యా నుంచి చమురు దిగుమతులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఓర్వలేనితనాన్ని ప్రదర్శిస్తున్నారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం తన స్పష్టమైన వైఖరిని వెల్లడించినప్పటికీ.. రష్యా చమురును భారత్ కొనుగోలు చేయదని ట్రంప్ మరోసారి వ్యాఖ్యలు చేశారు. వీటికి కూడా కౌంటర్ వచ్చింది.''ఇకపై రష్యా ఆయిల్‌ను భారత ప్రభుత్వం కొనుగోలు చేయదన్న విషయం నావరకు వచ్చింది. అది నిజమా..?కాదా..? అనేది నాకు తెలియదు. అది మంచి నిర్ణయమే అయితే ఏం జరుగుతుందో చూద్దాం'' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. దీనిపై ప్రభుత్వ వర్గాల నుంచి దీటైన స్పందన వచ్చింది. ''భారత చమురు సంస్థలు రష్యా సరఫరాదారుల నుంచి కొనుగోళ్లు కొనసాగిస్తున్నాయి. ధర, రవాణా, ఇతర ఆర్థిక అంశాల ఆధారాలు ఇక్కడ కీలకంగా ఉంటాయి. భారత్ 85 శాతం ఇంధనం దిగుమతి చేసుకుంటోంది. సవాళ్లతో కూడిన పరిస్థితుల్లో మూడో అతిపెద్ద వినియోదారుగా ఉన్న భారత్.. అంతర్జాతీయ నిబంధనలకు పూర్తిగా కట్టుబడి.. అందుబాటు ధరల్లో లభ్యమయ్యే చమురు కొనుగోలును కొనసాగిస్తుంది. దేశ ఇంధన నిర్ణయాలు జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా ఉంటాయి. అదే సమయంలో ఆ కొనుగోళ్లు అంతర్జాతీయ ఇంధన స్థిరత్వానికి, సమతుల్యతకు కూడా సానుకూలంగా దోహదం చేస్తున్నాయి'' అని స్పష్టం చేశాయి. రష్యా నుంచి భారత్ చమురు కొనడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసిన ట్రంప్ ఆ రెండు దేశాలవి పతనమైన ఆర్థిక వ్యవస్థలని విమర్శించారు. మరోవైపు భారత్ చమురు కొనడం వల్లే ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధాన్ని కొనసాగించగలుగుతోందని అమెరికా విదేశాంగశాఖ మంత్రి మార్కో రుబియో పేర్కొన్నారు. ఆంక్షల వల్ల అక్కడ చమురు చౌకగా లభిస్తోందని, దురదృష్టవశాత్తూ అదే యుద్ధంలో రష్యా మనుగడకు ఉపయోగపడుతోందన్నారు.

# ప్రజ్వల్ రేవణ్ణకు జీవిత ఖైదు

(మొదటి పేజీ తరువాయి)

పరిహారం ఇవ్వాలని ఆదేశించింది. ఇటీవల విచారణను పూర్తి చేసిన న్యాయమూర్తి సంతోశ్ గజానన హెగ్డే.. రేవణ్ణను దోషిగా తేల్చిన విషయం తెలిసిందే. అంతకుముందు ఇదే కేసులో తనకు తక్కువ శిక్ష వేయాలంటూ న్యాయమూర్తిని మాజీ ఎంపీ వేడుకున్నాడు. ఆ సమయంలో అతడు బిగ్గరగా ఏడ్చాడు. ఆగస్టు 1న తీర్పు ప్రకటించిన తర్వాత కూడా ప్రజ్వల్ కన్నీరుమున్నీరుగా విలపించాడు. న్యాయస్థానం నుంచి బయటకు వచ్చిన అనంతరమూ వెక్కివెక్కి ఏడ్చాడు. కేఆర్ నగరకు చెందిన మహిళ 2024 ఏప్రిల్ 28న హొళెనరసీపుర ఠాణాలో ప్రజ్వల్ రేవణ్ణపై ఫిర్యాదు చేయడంతో ఆయనపై అత్యాచారం కేసు నమోదు చేసింది. గన్నిగడ ఫాంహౌస్‌లో తనపై అత్యాచారం జరిగిందని బాధితురాలు (47) తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం మరికొన్ని అత్యాచార కేసులు ప్రజ్వల్‌పై నమోదయ్యాయి. ఈ కేసు విచారణలో భాగంగా 14 నెలలుగా ప్రజ్వల్ కారాగారంలో విచారణ ఖైదీగా ఉండగా తాజాగా జీవిత ఖైదు శిక్ష ఖరారైంది.

# బీసీల హక్కులను కాంగ్రెస్ కాలరాస్తోంది

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీసీలు పోరాడాల్సిన అవసరముందన్నారు.

**రేవంత్ తప్పుడు ప్రచారం చేస్తున్నరు**

**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**

బీసీ జనాభా సేకరణను కాంగ్రెస్ గతంలో ఎందుకు చేయలేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రశ్నించారు. బీసీలను మోసం చేసేందుకు కాంగ్రెస్ ఇంకా ప్రయత్నిస్తూనే ఉందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అనేక విధాలుగా తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ బీసీలను పీఎం, సీఎంలను చేసిందా? అని ప్రశ్నించారు. నగరంలోని ఇందిరాపార్కు వద్ద బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓబీసీ మోర్చా మహాధర్నాలో కిషన్ రెడ్డి మాట్లాడారు. ''బీసీలకు జనాభా సేకరణ తర్వాతే సామాజిక న్యాయం జరుగుతుంది. ఢిల్లీలో అనేక రకాలుగా సీఎం రేవంత్ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. బీసీల గురించి మాట్లాడే హక్కు కాంగ్రెస్ కు లేదు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాల్సిందే'' అని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు.

# ఓటరు జాబితాలో నా పేరే లేదు

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపించారు. పాట్నాలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

''నా ఈపీఐసీ నంబరుతో ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో చెక్ చేశా. ఈ ముసాయిదా జాబితాలో నా పేరు కన్పించలేదు. ఇక నేను ఎన్నికల్లో ఎలా పోటీ చేయాలి? స్వయంగా బూత్ లెవల్ అధికారి నావద్దకు వచ్చి ఫామ్ తీసుకెళ్లారు. అయినా నా పేరు జాబితాలో లేదు'' అని తేజస్వీ వెల్లడించారు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ అనంతరం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి దాదాపు 20వేల నుంచి 30వేల వరకు ఓటర్లను తొలగించారని ఆర్జేడీ నేత ఆరోపించారు. మొత్తంగా రాష్ట్రంలో దాదాపు 65 లక్షల ఓటర్లను తొలగించారని పేర్కొన్నారు.

అయితే, తేజస్వీయాదవ్ చేసిన ఆరోపణలను కేంద్ర ఎన్నికల సంఘం ఖండించింది. ముసాయిదా జాబితాలో ఆయన పేరు ఉందని పేర్కొంది. అందుకు సంబంధించిన కాపీని కూడా విడుదల చేసింది. ఆర్జేడీ నేత బహుశా తన పాత ఈపీఐసీ నంబరుతో చెక్ చేసుకుని ఉంటారని, అందుకే ఆయన పేరు జాబితాలో కన్పించకపోయి ఉండొచ్చని ఈసీ తెలిపింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పూర్తవటంతో ఈసీ ఈ ముసాయిదా జాబితాను రూపొందించింది. జాబితా నుంచి 65 లక్షల మందిని తొలగించడంతో ఓటర్ల సంఖ్య 7.93 కోట్ల నుంచి 7.28 కోట్లకు తగ్గింది. దీనిపై అభ్యంతరాలు తెలిపేందుకు సెప్టెంబరు 1 వరకు ఈసీ గడువు కల్పించింది.

# వచ్చే ఎన్నికల్లో మోడీని ఓడగొడ్తం





(మొదటి పేజీ తరువాయి)

నిత్యం ప్రజల మధ్య ఉండి, ప్రజల కోసం పని చేస్తోందన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ నేతత్వంలోని బీజేపీ ప్రభుత్వం రిజర్వేషన్లు రద్దు చేయాలని ప్రయత్నిస్తోంది. గత 11 ఏళ్లుగా సామాజిక న్యాయం గురించి కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం ఆలోచించలేదు. అటువంటి సమయంలో డాక్టర్ అభిషేక్ మను సింఘ్వీ గారి నేతత్వంలో, దేశానికి ముందువైపు దారి చూపించేలా, సామాజిక న్యాయం కోసం మేము కార్యాచరణతో ముందుకు సాగేందుకు ప్రయత్నిస్తున్నామని సీఎం బీజేపీపై విమర్శలు ఎక్కుపెట్టారు.

కొందరు బీజేపీ నాయకులు 'కాంగ్రెస్ పార్టీ చేసిందేమిటి?' అని తరచూ ప్రశ్నిస్తుంటారు. ఆలాంటి వారికి నేను చెప్పేదేమంటే.. కాంగ్రెస్ పార్టీ పోరాటం ద్వారానే 41 కోట్ల భారతీయుల స్వాతంత్ర్యం సిద్ధించింది. దేశం ఒకప్పుడు ఉగ్రవాద ప్రమాదాల్లో చిక్కినప్పుడు, పక్కనున్న పాకిస్తాన్ నుండి ముప్పు వచ్చినప్పుడు, ఇందిరా గాంధీ ధైర్యంగా యుద్ధాన్ని ప్రకటించారు. పాకిస్తాన్‌ను ఓడించి, ఆ దేశాన్ని రెండు భాగాలుగా విడదీసి, ఆ యుద్ధాన్ని జయించి, కాళీమాత గౌరవాన్ని నిలబెట్టారు. దేశం ప్రమాదంలో ఉన్నప్పుడు మహాత్మా గాంధీ గారు ప్రాణత్యాగం చేసి ఈ దేశాన్ని రక్షించారు. అదే విధంగా ఉగ్రవాదాన్ని ఎదిరించి దేశాన్ని కాపాడిన వారు శ్రీమతి ఇందిరాగాంధీ గారు. మూడోసారి ఉగ్రవాదుల చేతిలో దేశం ప్రమాదంలో ఉన్నప్పుడు, రాజీవ్ గాంధీ గారు తన ప్రాణాలను త్యాగం చేసి, దేశాన్ని రక్షించారు. ఇవన్నీ మాపై విమర్శలు చేసే బీజేపీ నాయకులకు ఇవన్నీ తెలియక పోవడం సిగ్గు చేటన్నారు. అంతేకాదు, ఉత్తరప్రదేశ్ లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రోజు, ప్రధాని పదవిని చేపట్టాలని అందరూ కోరినప్పుడు శ్రీమతి సోనియా గాంధీ ఆ పదవిని తిరస్కరించారు. తర్వాత రాష్ట్రపతి పదవిని చేపట్టే అవకాశం వచ్చినప్పటికీ, శ్రీమతి సోనియా గాంధీ దాన్నీ తిరస్కరించారు. ప్రధాని పదవిని త్యాగం చేసి ఆర్థిక నిపుణుడు డాక్టర్ మన్మోహన్ సింగ్‌ను భారత ప్రధాని చేయడం ద్వారా ప్రపంచంలోనే శక్తివంతమైన దేశంగా భారత్ ఎదగడంలో సహకారం అందించారని రేవంత్ తెలిపారు. మా అగ్ర నేత రాహుల్ గాంధీ గారి గురించి బీజేపీ నాయకులు ఎన్నో మాటలు మాట్లాడుతున్నారు. కానీ, ఆయన చేసిన త్యాగం వాళ్లకు అర్థం కాదు. ఎందుకంటే వారు పదవుల కోసమే రాజకీయాల్లోకి వచ్చారు. వాళ్లకు పార్టీ విలువలు తెలియవు. రాహుల్ గాంధీ కావాలంటే 2009 లోనే కేంద్ర మంత్రి అయి ఉండేవారు.

కావాలంటే ప్రధాని కూడా అయి ఉండేవారు. కానీ, ఆయన ఆ పదవులకు దూరంగా ఉన్నారు. ఆ అవకాశాన్ని పార్టీ పెద్దలకి ఇచ్చి, తాను మాత్రం కేవలం ఒక కార్యకర్తగా ప్రజల కోసం పనిచేస్తున్నారు. సంవత్సరాలుగా రాహుల్ గాంధీ గారు దేశంలోని పేదల కోసం, వెనుకబడినవారి కోసం, దళితుల కోసం, ఆదివాసుల కోసం, ఒబీసీల కోసం, సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడుతున్నారు. ఇక మరోవైపు చూస్తే.. నరేంద్ర మోడీ ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి ఈ రోజు వరకూ, బీజేపీ నేతలు, ఆర్‌ఎస్‌ఎస్ కుటుంబం కూడా పదవి నుంచి మోడీని తప్పించడానికి ప్రయత్నాలు జరిగాయి. అయితే, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మోడీని రాహుల్ గద్దె దించనున్నారు.

సంఘ్ చేయలేకపోయిన పనిని, వాజ్‌పేయి చేయలేకపోయిన పనిని, రాహుల్ చేయనున్నారు. ఓబీసీలకు సామాజిక న్యాయం అందించడానికి, ఈ దేశంలో జనగణన (కుల గణన) చేపట్టే రోజులు వస్తున్నాయి. బీసీలకు వారి జనాభా నిష్పత్తి మేరకు రిజర్వేషన్లు కల్పించేలా కొత్త చట్టాన్ని రూపొందించడానికి, రాహుల్ నాయకత్వంలో దేశం ముందుకు సాగుతుంది. ఈ ఉద్యమంలో భాగంగా భారతదేశానికి తెలంగాణ మోడల్‌గా మారింది. ఈ దేశంలోని రాజ్యాంగాన్ని కాపాడాలనుకునే ప్రతి ఒక్కరు, ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా చూసేవారు, ఈ వేదికపై ఉన్న ప్రతి ఒక్కరు... అందరం రాహుల్ గాంధీ గారి వెంట నడవాలని రేవంత్ రెడ్డి సూచించారు.

# మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్న భారత్

**వారణాసి, ఆగస్టు 2:** భారత్ ఆర్థిక వ్యవస్థను ఉద్దేశిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 'డెడ్ ఎకానమీ' అన్న వ్యాఖ్యలపై ప్రధాని మోడీ పరోక్షంగా స్పందించారు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా ఎదిగే దిశగా భారత్ పరుగులు పెడుతోందని మోడీ తెలిపారు. అంతేకాదు.. ట్రంప్ టారిఫ్ల వేళ స్వదేశీ ఉత్పత్తులను పెంచాలంటూ పిలుపునిచ్చారు. ఉత్తరప్రదేశ్ పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ వారణాసిలో నిర్వహించిన ర్యాలీలో మాట్లాడారు. ''ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితి నెలకొంది. అన్ని దేశాలు తమ తమ సొంత ప్రయోజనాల పైనే ఎక్కువగా దృష్టిపెడుతున్నాయి. భారత్ కూడా అతిత్వరలోనే మూడో అతిపెద్ద ఆర్థికశక్తిగా మారనుంది. అందువల్ల ఇప్పుడు మన ఆర్థిక ప్రయోజనాలపై మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోంది. రాజకీయ పార్టీలు కూడా విభేదాలను పక్కనబెట్టి 'స్వదేశీ' ఉత్పత్తుల విప్లవానికి నడుంబిగించాలి. కేవలం భారతీయులు తయారుచేసిన వస్తువులను మాత్రమే కొనుగోలు చేయాలి'' అని మోడీ పిలుపునిచ్చారు.

# లోకేశ్ అలాంటి వ్యాఖ్యలు చేయొద్దు

**హైదరాబాద్, ఆగస్టు 2:** గత ప్రభుత్వం చేసిన అప్పులకు ఈ ప్రభుత్వం వడ్డీలు కడుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. పదేండ్లలో రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం తి ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేదన్నారు. కనీసం గతంలో కాంగ్రెస్ శంకుస్థాపన చేసిన ప్రాజెక్టులను కూడా ఆ పార్టీ పూర్తి చేయలేకపోయిందని ఎద్దేవా చేశారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడిన ఆయన.. గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కృష్ణా నదిపై భారత రాష్ట్ర సమితి ఒక్క ప్రాజెక్టు కూడా ఎందుకు కట్టలేదు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదు. ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. తెలంగాణ నిర్మించే ప్రాజెక్టుల నిర్మాణాలు పూర్తయిన తర్వాత బనకచర్ల కట్టుకోవచ్చు. ప్రజలను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు ఏపీ మంత్రులు మాట్లాడకూడదు. తెలంగాణకు ద్రోహం చేసింది.. భారత రాష్ట్ర సమితి. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఢిల్లీ వెళ్లారు కాబట్టే బనకచర్ల ప్రాజెక్టు ఆగింది. ఏపీ మంత్రి లోకేశ్ తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు చేయకూడదు. 2 లక్షల ఎకరాలు మునిగిపోకుండా పోలవరం కట్టుకోవచ్చు. ముంపు గ్రామాల ప్రజల తరపున పోరాడేందుకు మేం సిద్ధంగా ఉన్నామని భట్టి తెలిపారు.

# 70 కాదు కనీసం 80 గంటలు పనిచేయాలె

(మొదటి పేజీ తరువాయి)

వాదనే వినిపించారు. ఆమె ఏప్రిల్ అనే ఏఐ సంస్థ స్థాపకురాలు నేహా సురేశ్. తన సహ వ్యవస్థాపకుడు ఆకాశ్ పనిచేస్తోన్న వీడియోను ఆమె నెట్ లో షేర్ చేశారు. చిన్నపాటి ఆఫీసులో రెండువేర్వేరు డెస్కుల్లో ఆకాశ్, నేహా తమ రోజూవారీ పని ఎలా నడుస్తుందో ఆ వీడియోలో చూపించారు. వారు పూర్తిగా పనిలో నిమగ్నమై, మధ్యమధ్యలో చిన్న బ్రేకులు తీసుకోవడం కనిపించింది. ఈ దృశ్యాలతో పాటు ఆమె తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. ''మీ కలను సాకారం చేసుకోవడానికి రోజుకు 14 గంటలు వెచ్చించకపోతే.. మీరు దానిని సాధించుకోలేరు. 9-5 పని గంటలతో మీరు ఈ ప్రపంచాన్ని మార్చే ఉత్పత్తిని తయారు చేయలేరు. వారానికి 80 గంటలు అనేది తీవ్రమైనది కాదు. అవి కనీస స్థాయి పనిగంటలు మాత్రమే'' అని నేహా చేసిన వ్యాఖ్యలపై తీవ్ర వాదోపవాదాలు జరుగుతున్నాయి. కొందరు ఆమె నిబద్ధతను మెచ్చుకున్నారు. మరికొందరు మాత్రం ఇలాంటి జీవనశైలి అందరికి సరిపోతుందా..?అని ప్రశ్నించారు. ప్రపంచాన్ని మార్చే ఉత్పత్తులను ఈ 9-5, 80 పని గంటలతో మాత్రమే కాకుండా ఇంకా ఇతర మార్గాల్లో కూడా రూపొందించవచ్చు'' అని కామెంట్ చేశారు. గతంలో నారాయణమూర్తి మాట్లాడుతూ.. ప్రపంచ దేశాలతో పోలిస్తే భారత్ లో ఉత్పాదకత తక్కువన్నారు. అందుకే దేశ యువత మరిన్ని గంటలు అధికంగా శ్రమించాలన్నారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత జపాన్, జర్మనీ వంటి దేశాలు ఎలాగైతే కష్టపడ్డాయో.. మనమూ అలా శ్రమించాలని అన్నారు.అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ పడాలంటే భారత్ లోని యువత వారానికి 70 గంటల పాటు పనిచేయాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. అలాగే వారానికి 90 గంటల పాటు పనిచేయాలని, ఆదివారం సెలవునూ వదిలేయాలని ఎల్ అండ్ టీ ఛైర్మన్ ఎస్.ఎన్. సుబ్రహ్మణ్యం చేసిన వ్యాఖ్యలు దుమారాన్ని లేపాయి. ''అభివృద్ధి చెందిన దేశంగా ఎదిగే క్రమంలో లక్ష్యాలను చేరాలంటే అసాధారణ కృషి అవసరం. ఈ విస్తృత లక్ష్యాన్నే ఛైర్మన్ వ్యాఖ్యలు ప్రతిబింబిస్తున్నాయి'' అని అప్పట్లో సంస్థ వివరణ ఇచ్చి వివాదం సమసిపోవడానికి ప్రయత్నించింది.

# జెన్‌కో ఉద్యోగులకు 5 శాతం అలవెన్స్

(మొదటి పేజీ తరువాయి)

8, 10 వేల రూపాయల అలవెన్స్ ఇవ్వనున్నారు. జెన్కో ప్రకటించిన అలవెన్స్.. కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ (కేటీపీఎస్)-ఏడో దశ, భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (బీటీపీఎస్)లలో పనిచేసే ఉద్యోగులకు మాత్రమే వర్తిస్తుంది. ఈ ఏడాది అనగా 2025, ఏప్రిల్ 1వ తేదీ నుంచే ఈ అలవెన్సు అమల్లోకి రానుందని అధికారులు ప్రకటించారు. ఈ నిర్ణయం వల్ల ఉద్యోగులకు ఆర్థికంగా ఊరట లభించనుంది. ఇదిలా ఉంటే తాజాగా ఎన్నికల సంఘం బూత్ లెవల్ ఆఫీసర్ల వేతనాన్ని రెట్టింపు చేస్తూ ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. ఇలా ఉద్యోగులకు ఒకే రోజు రెండు శుభవార్తలు వినడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సంఘం, జెన్కోకు ఆయా శాఖల ఉద్యోగులు ధన్యవాదాలు తెలుపుతున్నారు.

# మంత్రి కొండా సురేఖకు బిగ్ షాక్

(మొదటి పేజీ తరువాయి)



దాఖలు చేస్తూ.. ఆయన కోర్టును ఆశ్రయించారు. సెక్షన్ 356 కింద పరిగణనలోకి తీసుకున్న నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టు, ప్రాథమిక సాక్ష్యాలను పరిశీలించిన నేపథ్యంలో కొండా సురేఖపై ఆగస్టు 21లోగా క్రిమినల్ కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించింది. ఈ తీర్పు తెలంగాణ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రాజకీయ నాయకులు పరువు నష్టం దావాలను ఎదుర్కోవడం కొత్తేమీ కానప్పటికీ.. క్రిమినల్ కేసు నమోదుకు ఆదేశించడం అరుదైన పరిణామమే అని చెప్తున్నారు.

**స్పందించిన కొండా సురేఖ..**

అయితే, తనపై కేసు, నోటీసులు విషయంలో మంత్రి కొండా సురేఖ స్పందించారు. కోర్టు ఆదేశాలపై తనకు ఇంకా ఎలాంటి సమాచారం అందలేదని.. నోటీసులు అందిన తర్వాత స్పందిస్తానని ఆమె వెల్లడించారు.

# ప్రపంచంతో పోటీ పడాలె

**హైదరాబాద్, ఆగస్టు 2:** ప్రపంచంతో పోటీ పడాలనే ఉద్దేశంతోనే రాష్ట్రంలో కొత్త స్పోర్ట్స్ పాలసీని తీసుకొస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. క్రీడా విధానం లేకపోవడం వల్ల పట్టణ ప్రాంతాల్లోని యువత పెడదోవ పడుతున్నారని, క్రీడలను ప్రోత్సహించక పోవడం వల్లే యువత డ్రగ్స్ తీసుకుంటున్నారని సీఎం పేర్కొన్నారు. చదువుల్లోనే కాదు.. క్రీడల్లోనూ యువత రాణించాల్సిన అవసరం ఉందన్నారు. హెచ్ఐసీసీలో జరిగిన తెలంగాణ స్పోర్ట్స్ కాంక్లేవ్ లో 'తెలంగాణ స్పోర్ట్స్ పాలసీ'ని సీఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. దేశంలో నూతన విధానాన్ని ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రపంచంతో పోటీపడే మనం.. క్రీడల్లో వెనకబడి ఉండడం బాగాలేదన్నారు. భారత్ కు బలమైన క్రీడా వేదిక కావాలని.. అందులో తెలంగాణ ప్రధానంగా ఉండాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

# కార్పొరేట్ స్థాయిలో సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలు

(మొదటి పేజీ తరువాయి)

అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఈ పరిస్థితిని మార్చేందుకు అన్ని సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలను కార్పొరేట్ స్థాయిలో ఆధునిక సౌకర్యాలతో దశలవారీగా నిర్మించాలని భావిస్తున్నాం. మొదటి విడతలో ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో 4 లేదా 5 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను భవిష్యత్తు అవసరాలను అనుగుణంగా ఒకే చోట ఇంటిగ్రేట్ చేసేలా భవనాన్ని నిర్మించాలని నిర్ణయించాం. ఆయా జిల్లాల కలెక్టర్లతో సమన్వయం చేసుకొని ఇందుకు అవసరమైన భూమిని గుర్తించాలి. ఇంటిగ్రేటెడ్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల వల్ల పనితీరు మెరుగుపడడమే కాకుండా పర్యవేక్షణ సులభమవుతుంది. అవినీతిని కూడా తగ్గించవచ్చు' అని పొంగులేటి చెప్పారు.

# భారత ఆర్థికవ్యవస్థ డైనమిక్

(మొదటి పేజీ తరువాయి)

అవి చెప్పిన సమాధానాలు అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాయి. భారత్‌ది డెడ్ ఎకానమీయా? అని ఐదు ప్రధాన అమెరికన్ ఏఐ ప్లాట్‌ఫామ్‌లను ప్రశ్నించగా.. వాటి సమాధానాలు ట్రంప్ వ్యాఖ్యలకు విరుద్ధంగా ఉన్నాయి. అవి ఏం చెప్పాయంటే.. 'భారత ఆర్థికవ్యవస్థ పతనం కాలేదు. అది డైనమిక్. ఎంతో ప్రతిష్ఠాత్మకమైనది' అని చాట్ జీపీటీ పేర్కొంది. 'లేదు. భారత్‌ది డెడ్ ఎకానమీ కాదు. ప్రపంచవ్యాప్తంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో ఒకటి'- గ్రోక్ ఏఐ. 'భారత ఆర్థిక వ్యవస్థ బలంగా వృద్ధి చెందుతుంది' - జెమిని. ఇక, మెటా ఏఐ, కోపైలట్ ఏఐలు కూడా ఇలాంటి సమాధానాలే ఇచ్చాయి.

# ప్రజల జీవన ప్రమాణాలు మారాలే

- **ఆరోగ్యం పట్ల క్రమశిక్షణ ఉండాలి**
- **మితమైన ఆహారంతోనే అమితమైన ఆరోగ్యం**
- **ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే అభివృద్ధి : హరీశ్‌రావు**

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** కరోనా.. ప్రజల జీవితాల్లో అనేక మార్పులు తీసుకొచ్చిందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆరోగ్యం పట్ల క్రమశిక్షణ ఉండాలని కరోనా ప్రపంచానికి నేర్పించిందని తెలిపారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని విపంచి కళా నిలయంలో జరిగిన మహిళా యోగా పోటీల కార్యక్రమానికి హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. అభివృద్ధి అంటే నాలుగు కాలేజీలు, నాలుగు రోడ్లు, నాలుగు స్టేడియాలు కట్టడం కాదని.. ప్రజల జీవన ప్రమాణాలు మారాలని అన్నారు. ఆరోగ్య సిద్ధిపేటే..అభివృద్ధి సిద్ధిపేట అని వ్యాఖ్యానించారు. ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే అది అభివృద్ధి అని తెలిపారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండటం కూడా అభివృద్ధిలో భాగమవ్వాలని కోరారు. ఆరోగ్యమే మహా భాగ్యమని పెద్దలు అన్నారని.. లక్షలు ఖర్చుపెట్టి హాస్పిటల్లో నయం చేసుకునే కన్నా స్వీయ క్రమశిక్షణతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. పిల్లలు ఫిజికల్ గేమ్స్ ఆడటం మానేసి.. ఆన్‌లైన్ గేమ్స్ మొదలు పెట్టారని హరీశ్‌రావు అన్నారు. ఇవ్వాళ తల్లులు కూడా పిల్లలకు స్మార్ట్ ఫోన్ ఇస్తున్నారని.. పిల్లలకు అన్నం తినిపించడం ఈజీ అయ్యింది కానీ అది మంచిది కాదని హితవుపలికారు.

# కొత్త రేషన్ కార్డుల కోసం పేదల నిరీక్షణ




## పేదల ఆశలను నెరవేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వం

## ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

**తుర్కయంజాల్ ఆగస్టు 2 ( మనం న్యూస్ ):** ప్రతి నిరుపేద కుటుంబానికి ఆహార భద్రత కల్పించాలన్న సంకల్పంతో ప్రజా ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరిగింది. ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. శనివారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని జేఎంఆర్ ఫంక్షన్ హాల్ లో అబ్దుల్లాపూర్మెట్ మండలం తాసిల్దార్ సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలో రాగన్నగూడ, మన్నెగూడ, తుర్కయంజాల్, ఇంజాపూర్, తొర్రూర్, మునగనూర్, అన్ని వార్డులకు అర్హులైన లబ్ధిదారులకు కమిషనర్ అమరేందర్ రెడ్డి, ఎమ్మార్వో సుదర్శన్ రెడ్డి తో, కలిసి ఎమ్మెల్యే చేతుల మీదుగా రేషన్ కార్డుల ప్రోసీడింగ్ కాపీలను అందించడం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా నిర్దేశించిన ప్రజా ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులను జారీ చేయడం జరిగిందని తెలిపారు. ప్రతి పేదవాడు రేషన్ కార్డు ద్వారా సన్నబియ్యం తీసుకుని కడుపునిండా అన్నం తినాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దొడ్డు బియ్యాన్ని నిషేధించి పేదవారికి సన్న బియ్యం పథకాన్ని శ్రీకారం చుట్టాడు. ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు వచ్చే విధంగా చూస్తామని మున్సిపల్ పరిధిలో వార్డ్ ఆఫీసర్లు ఇంటింటికి వెళ్లి అర్హులైన వారికి రేషన్ కార్డులు పంపిణీ చేయాలన్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీలో 100 కోట్లతో, సిసి రోడ్లు, వరద కాలువల పనులు, డ్రైనేజీలు, నిర్మాణ పనులు ముమ్మరంగా చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందులు ఉన్న ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. 500 కు సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రెండు లక్షల రుణమాఫీ, దేశంలో ఎక్కడ ఏ ప్రభుత్వం చేయని విధంగా తెలంగాణ రాష్ట్రంలో అమలు చేసినట్లు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ గుండ్లపల్లి హరిత ధనరాజ్ గౌడ్ టి పి సి సి రాష్ట్ర కార్యదర్శి కొత్త కుర్మా శివకుమార్, టి పి సి సి సభ్యులు కాకుమాను సునీల్, కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షురాలు కొత్త కుర్మా మంగమ్మ శివకుమార్, మాజీ కౌన్సిలర్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కోసికె ఐలయ్య, మర్రి మాధవి మహేందర్ రెడ్డి, రేవల్ల హరిత యాదగిరి, మేతరి అనురాధ దర్శన్, కంబాలపల్లి ధనరాజ్, నక్క శివలింగం గౌడ్, బండారి బాలరాజ్, కుంట ఉదయశ్రీ గోపాల్ రెడ్డి, నాయకులు సామ భీం రెడ్డి, కొంతం వెంకట్ రెడ్డి (జానీ ), ఓర్సు శ్రీనివాస్, బొక్క వంశిధర్ రెడ్డి, డాక్టర్ రాగ్యా నాయక్, మున్సిపాలిటీ అధికారులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్‌కు

# వినతి పత్రం అందజేత

**తుర్కయంజాల్, ఆగస్టు 2( మనం న్యూస్):** ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి చొరవతో తెలంగాణ ఉద్యమకారుల బృందం మరియు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కొంతం యాదిరెడ్డి శుక్రవారం కలిసి జనహిత పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ కు వినతి పత్రం అందజేశారు. యాది రెడ్డి మాట్లాడుతూ, ఎమ్మెల్యే ఉద్యమకారుల బృందానికి దగ్గరుండి మీనాక్షి నటరాజన్ కు వారు స్వయంగా పరిచయం చేసి ఉద్యమకారుల సమస్యను తెలియజేశారు. మాకు ఎంతగానో సహకరించి ఉద్యమకారుల పట్ల సానుకూలంగా ఉన్న నియోజకవర్గం ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు జెనిగా విష్ణువర్ధన్, పెద్ద అంబర్పేట్ మున్సిపల్ అధ్యక్షులు అందెకర్ బాబూలాల్, జ్ఞానటి మహిపాల్, ఉద్యమకారులు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలను సందర్శించిన మాజీఎమ్మెల్సీ నర్సిరెడ్డి




**రంగారెడ్డి, ఆగస్టు 2 (మనం న్యూస్):** బహదూర్పుర మండలంలో పాఠశాలలను మాజీఎమ్మెల్సీ నర్సిరెడ్డి శనివారం తెలంగాణ పౌరస్పందన వేదిక ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలుర పాఠశాల కసారట , దారుల్ షిఫా ప్రభుత్వ అందుల పాఠశాలను సందర్శించడం జరిగింది. పాఠశాలలో సమస్యలను తెలుసు కున్నారు. నర్సిరెడ్డి తో పాటు పౌర స్పందన వేదిక సభ్యులు రాధేశ్యామ్ , ప్రభుత్వ అందుల పాఠశాల ప్రధానోపాధ్యాయులు మందడి వెంకట్ రెడ్డి, ఉపాధ్యాయులు జావేద్ అహ్మద్ , రవి కాంత్, శాంతమ్మ పాల్గొనడం జరిగింది.

## ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్య సదుపాయాలు

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




**మంచిర్యాల ఆగస్టు 2( మనం ప్రతినిధి):** జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రజల కోసం మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించి సేవలు అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శనివారం జిల్లాలోని మందమర్రి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వార్డులు, మందుల నిల్వలు, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వర్షాకాలం అయినందున అంటువ్యాధుల వ్యాప్తిని నివారించేందుకు పాటించవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. వార్డులు, ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధులలో సమయపాలన పాటించాలని, ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజలకు వైద్య సేవలు అందించాలని తెలిపారు. మండల తహశిల్దార్ సతీష్కుమార్ తో కలిసి మండల కేంద్రంలోని కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయం, ఆదర్శ పాఠశాలను సందర్శించి వంటశాల, మూత్రశాలలు, తరగతి గదులు, హాజరు పట్టికలు, పరిసరాలను పరిశీలించారు. ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యాబోధన అందిస్తుందని తెలిపారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు గల ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. 10వ తరగతి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించి వివిధ సబ్జెక్టులలో ప్రశ్నలు అడిగి వారి పఠనా సామర్థ్యాలను తెలుసుకున్నారు. అనంతరం మండల తహశిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూభారతి రెవెన్యూ సదస్సులలో అందిన భూ సమస్యల సంబంధిత దరఖాస్తులను రికార్డులతో సరి చూసి క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వివిధ రకాల ధృవపత్రాల మంజూరు కొరకు అందిన దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి నిర్ణీత గడువులోగా జారీ చేయాలని తెలిపారు. అధికారులు, ఉద్యోగులు విధుల పట్ల సమయపాలన పాటించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## తీన్మార్ మల్లన్నని కలిసిన బాధిత రైతులు



**కడ్తాల్, ఆగస్టు 2 ( మనం, న్యూస్ ) :** కడ్తాల్ పట్టణం సమీపం నుంచి వెళ్తున్న 765 కేవి విద్యుత్ లైన్ ఏర్పాటుతో జరుగుతున్న నష్టం గురుంచి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్సీ, తీన్మార్ మల్లన్నని శనివారం రైతులు కలిసి న్యాయం చేసే బాధ్యత తీసుకోవాలని కోరారు. కరెంట్ లైన్ వల్ల నష్ట పోతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ యువ జన సంఘాల ఐక్య వేదిక అద్యక్షులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘువేందర్, బిసి సంఘం కడ్తాల్ మండల అధ్యక్షులు పిప్పల్ల వెంకటేష్, కడ్తాల్ మాజీ ఉప సర్పంచ్ కడారి రామకృష్ణ, రావుల కుమార్ గౌడ్, గూడూరు పెంటారెడ్డి, కందికంటి కేశవులు గౌడ్, కందికంటి శ్రీరాములు గౌడ్, గంట శ్రీనివాస్, శివశంకర్, గుదా పర్వతాలు యాదవ్, గుదా రాములు యాదవ్, గూడూరు శివరాం రెడ్డి, జంబు ల అభిలాష్ రెడ్డి, కండేకర్ శ్రీను, గోరేటి కృష్ణ యాదవ్, కలే వెంకటేష్, మహేష్, కృతిక మహేష్ యాదవ్, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శ



**కడ్తాల్, ఆగస్టు 2 ( మనం, న్యూస్) :** రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం రావిచెడ్ గ్రామానికి చెందిన కృష్ణయ్య గౌడ్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శనివారం రావిచెడ్ కు చేరుకొని కృష్ణయ్య గౌడ్ మృతదేహానికి నివాళి అర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. రూ. 5వేలు ఆర్థిక సాయం అందజేశారు. అదే విదంగా బ్లాక్ కాంగ్రెస్ నాయకులు యాట నర్సింహా, డిసిసి అధికార ప్రతినిధి. శ్రీనివాస్ రెడ్డి రూ. 6వేలు ఆర్థికసాయం చేశారు. అనంతరం గ్రామ కాంగ్రెస్ నాయకులు పరామర్శించి కుటుంబ సభ్యులకు మనోధైర్యం నింపారు. కార్యక్రమంలో సింగల్ విండో డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జనార్ధన్ గౌడ్, పారేశా, రమేష్ గౌడ్, రూపేందర్ గౌడ్, రామచంద్ర గౌడ్, రాజు, కుమ్మరి యాదయ్య, శర్మంద, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమ పేరుతో మోసం చేసిన నర్రా సాయిలును వెంటనే అరెస్ట్ చేయాలి

### ఎంఆర్పీయస్ కామారెడ్డి జిల్లా ఇంచార్జి మంతని సామ్యేల్ మాదిగ



**బాన్సువాడ, ఆగస్టు 02 ( మనం న్యూస్ ):** బాన్సువాడ నియోజకవర్గం బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన నల్లజేరు జ్యోతిని ప్రేమ పేరుతో మోసం చేసిన అదే గ్రామానికి చెందిన నర్రా సాయిలు అనే నాయకున్ని వెంటనే అరెస్ట్ చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్పీయస్) కామారెడ్డి జిల్లా ఇంచార్జి మంతని సామ్యేల్ డిమాండ్ చేశారు. బీర్కూర్ మండల కేంద్రంలోని నల్లజేరు జ్యోతి ఇంటికి శనివారం వెళ్లి ఆమెకు తమ మద్దత్తును తెలిపారు. ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ., నల్లజేరు జ్యోతిని తెలిసీ తెలియని వయసులో అంటే కేవలం పదిహేను, పదహారు ఏళ్ల వయసులో ప్రేమ పేరుతో మోసం చేసి, పదహారు ఏళ్ల తరువాత ఒక బాబు ఉండగా వదిలించుకోవాలని చూస్తున్న ఆ మూర్ఖుడిని వదిలేది లేదన్నారు. బాధితురాలు జ్యోతిని కులం పేరుతో దూశించి పది రోజులైనా వారిపై తీసుకోకపోవడం అన్యాయమని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైన నలుగురిని వెంటనే అరెస్ట్ చేసి, రిమాండ్ కు తరలించాలని అయన డిమాండ్ చేశారు. జ్యోతికి న్యాయం జరిగే వరకు ఎంఆర్పీయస్ ఆమెకు అండగా ఉండి, పోరాటం చేస్తుందని అయన పేర్కొన్నారు. నర్రా సాయిలుపై కేవలం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు, గృహ హింస కేసు మాత్రమే నమోదయ్యాయని, అదనంగా ఫోక్సో కేసు, హత్యాయత్నం కేసులు సైతం నమోదు చేయాలని అయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పీయస్ నాయకులు పెద్దారం గంగారాం, మెక్క శివరాజ్, బొజ్జ సాయిలు తదితరులు ఉన్నారు.

## మంత్రుల సభా ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే



**గోదావరిఖని/అంతర్గాం, ఆగస్టు 2 (మనం న్యూస్):** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గ శాసనసభ్యుబడు ఎంఎస్ రాజ్ ఠాకూర్ శనివారం అంతర్గాం మండలంలోని టిటిఎస్ పరిధిలో జరుగనున్న ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంబంధించిన గోలివాడ హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమం ఆగస్ట్ 03 (ఆదివారం) జరిగనుండగా, రాష్ట్ర ప్రభుత్వం నుంచి పలువురు ప్రముఖ మంత్రులు ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నారు. ఈ సందర్భంగా హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలించడానికి రాజ్ ఠాకూర్ తో పాటు పలువురు ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఇంజినీరింగ్ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి తుమ్మల నాగేశ్వర రావు, దుద్దిల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారులు హారకాల వేణుగోపాలరావు హాజరు అవుతారని, ఎత్తిపోతల పథకం ప్రాంతీయ వ్యవసాయ విస్తరణకు కీలకమైన పథకమని, ఇది రామగుండం పరిధిలోని రైతులకు సాగునీటి భద్రత కల్పించనుందని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పేర్కొన్నారు. ఈ పథకం ప్రారంభోత్సవం రాష్ట్ర అభివృద్ధి దిశగా ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. హెలిప్యాడ్ ఏర్పాట్లు, భద్రతా చర్యలు, వాహన పార్కింగ్, ప్రజా ఏర్పాట్లపై అధికారులకు తగిన సూచనలు చేశారు. ఈ పరిశీలనలో జిల్లా కలెక్టర్, పోలీసు శాఖ అధికారులు, ఇంజినీరింగ్, రవాణా, రెవెన్యూ శాఖల ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, గ్రామ సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డి ఎమ్మెల్యేని కలిసిన టీఎన్జీవోస్ కామారెడ్డి జిల్లా శాఖ బృందం



**ఎల్లారెడ్డి, ఆగస్టు 02 ( మనం న్యూస్ ):** జిల్లా ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవోస్ కామారెడ్డి జిల్లా శాఖ అధ్యక్షులు నరాల వెంకట్ రెడ్డి అధ్యక్షతన వారి యొక్క బృందం కామారెడ్డి జిల్లా కేంద్రంకు విచ్చేసిన సందర్భంగా ఎమ్మెల్యే మదన్ మోహన్ రావుని మర్యాదపూర్వకంగా కలిసి టిఎన్జీవోస్ కామారెడ్డి జిల్లా పక్షాన శాలువాతో సత్కరించి పూల మొక్కను అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కామారెడ్డి జిల్లాలో వివిధ శాఖలలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిం చగా, ఉద్యోగులు ఎదుర్కొంటున్నటువంటి సమ స్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, వాటి యొక్క పరిష్కారానికి కృషి చేస్తానని మదన్ మోహన్ రావు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నరాల వెంకట్ రెడ్డి, కార్యదర్శి ఎం నాగరాజు,కోశాధికారి ఎం దేవరాజు, అర్బన్ తాలూకా అధ్యక్షులు కే శ్రీనివాస్ రెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.

## మాట నిలబెట్టుకున్న రేవంత్ సర్కార్

### నేతన్నల రూ.లక్ష లోపు రుణ మాఫీ

### 2,380 మంది ఖాతాల్లో రూ.19.24 కోట్లు జమ



**హైదరాబాద్, మనం ప్రతినిధి :** తెలంగాణ ప్రభుత్వం తాను ఇచ్చిన హామీని నిలబెట్టుకుంది. యాదాద్రి జిల్లాలోని 2,380 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.19.24 కోట్ల సొమ్మును జమ చేసింది. 2017 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు వీరు తీసుకున్న రూ.లక్ష లోపు రుణాలను మాఫీ చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా రుణమాఫీ చేసింది. తర్వాత మళ్లీ లోన్ తీసుకున్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల వేళ ఇచ్చిన హామీలన్నింటిని నెరవేరుస్తూ వస్తోంది. ఇప్పటికే మొదటి విడత ఇందిరమ్మ ఇళ్లు మంజూరు, రైతు భరోసా, రైతు రుణమాఫీ, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, కొత్త రేషన్ కార్డుల పంపిణీ వంటి హామీలన్నింటిని నెరవేరుస్తూ వస్తుంది. ఈక్రమంలో తాజాగా రేవంత్ రెడ్డి మరో హామీని నెరవేర్చారు. 2,380 మంది ఖాతాల్లో 19 కోట్ల రూపాయలకు పైగా జమ చేశారు. లోన్ తీసుకున్న వారిలో కొందరు నేతన్నలు తిరిగి చెల్లించారు. వారు కూడా ఈ జాబితాలో ఉన్నారని అధికారులు తెలిపారు.

## ప్రభుత్వ ఉద్యోగులకు ఊహించని బహుమతి

- ఎన్నికల సంఘం కీలక ప్రకటన..
- ఎన్నికల సంఘంలో పనిచేసే ఉద్యోగులకు శుభవార్త..
- ఇకనుంచి వారి జీతాలు డబుల్
- బీఎల్ఓ జీతాలను రెట్టింపు చేస్తూ ఎలక్షన్ కమిషన్ కీలక నిర్ణయం
- ఈసీ అధికారిక ప్రకటన చేసింది. ఈ నిర్ణయంతో ఉద్యోగుల ఆనందానికి అవధుల్లేవు.



**హైదరాబాద్, మనం ప్రతినిధి :** గత కొన్ని రోజులుగా తెలంగాణలోని ప్రభుత్వ ఉద్యోగులు వరుస శుభవార్తలు వింటున్నారు. కొన్నాళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లకు సర్కార్ ఆమోదం తెలిపింది. పలు శాఖల్లో ఉద్యోగులకు పదోన్నతుల లభించాయి. అలానే ఉద్యోగులకు బకాయి ఉన్న డీఏ చెల్లింపులకు కూడా ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఉద్యోగులంతా ఫుల్లు ఖుషీలో ఉన్నారు. ఈ క్రమంలో మరో కీలక ప్రకటన వెలువడింది. ఆ ఉద్యోగుల జీతాలు రెట్టింపు చేస్తూ.. ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఎన్నికల సంఘం ఉద్యోగులకు శుభవార్త చెప్పింది. ఎలక్షన్స్‌లో భాగస్వామ్యం అయ్యే బూత్ లెవల్ ఆఫీసర్ల వేతనాన్ని రెట్టింపు చేసింది. దీనికి సంబంధించి ఎన్నికల సంఘం ఎక్స్ వేదికగా పోస్ట్ చేసింది. బీఎల్ఓలు, ఇతర సిబ్బంది చాలా శ్రమించారని.. అందుకే వారి వేతనాలు రెట్టింపు చేస్తూ నిర్ణయం తీసుకుంటున్నట్లు ప్రకటించింది. ఈమేరకు ఈసీ ఎక్స్‌లో పోస్ట్ చేసింది. 'పారదర్శకమైన ఓటర్ల జాబితాలు ప్రజాస్వామ్యానికి పునాది. దీనికోసం ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు (ఈఆర్ఓలు), అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు (ఏఈఆర్ఓలు), బూత్ లెవర్ ఆఫీసర్ల సూపర్వైజర్లు, బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్ఓ)లు చాలా కష్టపడి పనిచేశారు.. చేస్తున్నారు. నిష్పాక్షికమైన, పారదర్శకమైన ఓటర్ల జాబితాల తయారీలో వీరంతా కీలక పాత్ర పోషిస్తారు. అందువల్ల ఎన్నికల సంఘం వారి వేతనాలకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది' అని చెప్పుకొచ్చింది. 'బీఎల్ఓల వార్షిక వేతనాన్ని రెట్టింపు చేయాలని ఎన్నికల కమిషన్ నిర్ణయించింది. ఓటర్ల జాబితాల తయారీ, సవరణలో పాల్గొన్న బీఎల్ఓల సూపర్వైజర్ల వేతనాన్ని కూడా పెంచాలని నిర్ణయించింది. వేతనాల పెంపుకు సంబంధించి 2015 చివరిసారిగా నిర్ణయం తీసుకున్నారు. మళ్లీ పదేళ్ల తర్వాత.. అనగా ఇప్పుడు వారి వేతనాలు పెంపుకు ఆదేశాలు జారీ చేశాము. అలానే తొలిసారి ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలకు కూడా గౌరవ వేతనం అందిస్తామని' ఎన్నికల సంఘం జారీ చేసిన ప్రకటనలో పేర్కొంది. తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కోసం రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ ఎన్నికల కోసం ఈసీ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. బ్యాలెట్లో నోటా ముద్రణ, ఒక అభ్యర్థి ఒక్క పదవికే పోటీ చేయడంతో పాటు కుటుంబ సభ్యులందరికి ఒకే చోటు ఓటు వేసే అవకాశం కల్పించనున్నారు. దీంతో పాటుగా.. ఓటర్ జాబితాలో అనేక మార్పులు చేశారు. చనిపోయిన వారి పేర్లు తొలగించడమే కాక కొత్తగా ఓటర్లను చేర్చి నూతన జాబితాను రూపొందించారు. అలానే ఈసారి ఎంపీటీసీ పోలింగ్ కోసం పింక్.. అలానే జడ్పీటీసీ ఎలక్షన్ కోసం తెలుపు రంగు బ్యాలెట్ పేపర్లను ఎన్నికల అధికారులు సిద్ధం చేస్తున్నారు.



## నేననుకోను ..!

నేననుకోను అట్లా
గతం లోనికి పరుగెత్తాలని
గతం అవగతమే కదా!
మంచో- చెడో,తెలిసీ తెలియని
అనుభవైక నైవేద్యమే
గతం ఓ గ'మ్మత్తు'!
నీవు గతం లోకి వెళ్లినా
ఘనీభవించిన గతం
ద్రవించి నీకు జోల పాడదు!
గతానికి కొత్తగా, భవిష్యత్తుకు
వారధిగా, ప్రస్తుతం
పరుగెత్తే గత వారసత్వం!
ప్రస్తుతానికి గతం
ఎండ మావులంత తీపి
పరుగెత్తి నెమరేసుకోవడమే!
బ్రతుకు సినిమా రివైండ్ చేసుకొని
జ్ఞాపకాల అనుభూతి ఆకర్షణలో
మునిగి తేరుకోవడమే!
కలల స్వర్గం నుండి తేరుకుని
ఈ లోకం వచ్చిన క్షణం నుండి
ఎప్పటి తిప్పలు షరా మామూలే!

**- పల్లోళ్ళ బక్కారెడ్డి**
9705315250



## నాకు నేనే!

నాకు నేనే భిన్నం అనుకునేవాడిని
నా బాధలు, నా భయాలు,
నా ఆత్మన్యూనతాభావాలు -
నా గుండె గోడల మధ్య ఊగిసలాడే ఊసులు;
ఎవరూ వినరని, అర్థం చేసుకోరని నమ్మేవాడిని.

రాత్రి చీకట్లతో మాటలాడే నేను,
గాలి చప్పుడు విన్నా వణికే నేను,
ఈ ప్రపంచం అంతా నిద్రలో ఉండగా -
నా దుఃఖం మాత్రమే మేల్కొంటుందని
భీతిల్లేవాడిని.

కానీ -
ప్రతి గదిలోని మూలల్లో
తమ నీడలతో మాట్లాడుతున్న ముఖాల్ని
చూశాను.

వారి నిశ్శబ్ద నవ్వుల్లో
తడిగా దాచిన కన్నీరు,
నిశ్శబ్దంలోకి మెల్లగా జారటం చూశాను.
ప్రతి చూపు వెనుక -
ఒక పగుళ్లు పట్టిన గోడల నగరం ఉందని
గ్రహించాను.

ఒంటరితనం ఆవహించిన మనుషులంతా -
తమ కళ్ళ వెనుక దాచుకున్న బాధనంతా
తీరని వెదలోకి నెట్టేస్తారని తెలుసుకున్నాను.

**- బాలాజీ పోతుల**
8179283830

# దళిత ఉద్యమ శిఖరం కత్తి పద్మారావు

కత్తి పద్మారావు ఆంధ్రప్రదేశ్‌లో దళిత ఉద్యమానికి దిశానిర్దేశం చేసిన ప్రముఖ నాయకుడు, తెలుగు కవి, హేతువాది, సామాజిక కార్యకర్త. ఆయన ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ స్థాపకుడు మరియు దళిత సాహిత్యంలో కీలక వ్యక్తిగా గుర్తింపు కలిగినవారు. కత్తి పద్మారావు తన కవిత్వం, సామాజిక ఉద్యమాలు,రచనల ద్వారా దళితుల ఆత్మగౌరవం, సామాజిక న్యాయం, కుల వ్యవస్థ నిర్మూలన కోసం అవిశ్రాంతంగా కృషి చేశారు.

కత్తి పద్మారావు 1953 జులై 27న ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా బాపట్ల మండలంలోని ఈతేరు గ్రామంలో దళిత మాల కుటుంబంలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు మాణిక్యమ్మ, సుబ్బయ్య. ఇద్దరూ వ్యవసాయ కార్మికులు. సంవత్సరంలో ఆరు నెలలు వారు ఈతేరులో వ్యవసాయ కూలీలుగా, మిగిలిన ఆరు నెలలు చీరాలలోని ఇండియన్ లీఫ్ టొబాకో డిపో (ఐఎల్టీడీ)లో కార్మికులుగా పనిచేసేవారు. ఈ నేపథ్యంలో పెరిగిన పద్మారావు, దళిత సమాజం ఎదుర్కొనే సామాజిక, ఆర్థిక సవాళ్లను దగ్గరగా చూశారు. ఆయన సాహిత్యం, సమాజశాస్త్రం, మతం, తత్వశాస్త్రం,మహిళా అధ్యయనాలపై లోతైన అవగాహన కలిగి ఉన్నారు. ఈ విద్యాపరమైన నేపథ్యం ఆయన రచనలు ఉద్యమాలకు బలమైన పునాదిని అందించింది.

1985లో ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాలో జరిగిన కారంచేడు ఊచకోత దళిత ఉద్యమ చరిత్రలో ఒక దుర్ఘటనగా నిలిచింది. ఈ సంఘటనలో కమ్మ జాతి వారు మాదిగ దళితులపై దాడి చేసి, హత్యలు,దౌర్జన్యాలకు పాల్పడ్డారు. ఈ ఘటన దళిత సమాజంలో ఆగ్రహాన్ని రేకెత్తించింది. కత్తి పద్మారావు ఈ సందర్భంలో ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభను స్థాపించి, దళితుల ఆత్మగౌరవ పోరాటానికి నాయకత్వం వహించారు. ఈ సంస్థ దళితులతో పాటు ఆదివాసీలు మరియు వెనుకబడిన తరగతుల హక్కుల కోసం పోరాటం చేసింది. కారంచేడు ఉద్యమం దళిత సమాజంలో చైతన్యాన్ని తీసుకొచ్చింది.కుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఒక బలమైన ఉద్యమంగా రూపొందింది. ఈ ఉద్యమం ఫలితంగా 1989లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం ఆమోదించడంలో కత్తి పద్మారావు కీలక పాత్ర పోషించారు. ఈ చట్టం దళితులు మరియు ఆదివాసీలపై జరిగే దౌర్జన్యాలను నిరోధించడంలో ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. చుండూరు ఊచకోత (1991) ఘటనను గ్రామీణ స్థాయి నుండి ఢిల్లీ వరకు ఈ సమస్యను ఉద్యమ స్థాయిలో తీసుకెళ్లారు. ఈ ఉద్యమం దళితుల హక్కుల కోసం జాతీయ స్థాయిలో చర్చను రేకెత్తించింది.

డా. కత్తి పద్మారావు ఒక ప్రముఖ తెలుగు కవి, రచయితగా కూడా గుర్తింపు పొందారు. ఆయన రచనలు దళిత సాహిత్యంలో కొత్త దిశను చూపాయి. ఆయన రచించిన 93 పుస్తకాలు ముద్రితమయ్యాయి, ఇందులో కవితా సంపుటులు, సమాజశాస్త్రం, మతం, తత్వశాస్త్రం,మహిళా అధ్యయనాలపై రచనలు ఉన్నాయి. ఆయన ప్రముఖ కవితా సంపుటి 'జైలుగంటలు' దళిత ఉద్యమ స్ఫూర్తిని, ఆత్మగౌరవాన్ని, మరియు కుల వ్యవస్థపై తిరుగుబాటును ప్రతిబింబిస్తుంది. ఆయన కవిత్వం దళిత సమాజంలోని అణచివేత, అసమానతలు,ఆత్మగౌరవ పోరాటాన్ని తీవ్రంగా వ్యక్తీకరిస్తుంది. 'కట్టెల మోపు' వంటి రచనలు దళితుల గుండె ఘోషను ప్రతిధ్వనించాయి. ఆయన కవిత్వంలో బుద్ధుడు మరియు అంబేద్కర్ ఆదర్శా లు ప్రముఖంగా కనిపిస్తాయి, మరియు ఇవి దళిత యువతకు స్ఫూర్తిని అందించాయి. దళిత ఉద్యమం చారిత్రకంగా అసమానతలు, అస్పృశ్యత, కుల ఆధిపత్యం వంటి సామాజిక అన్యాయాలకు వ్యతిరేకంగా జరిగింది. గౌతమ బుద్ధుడి కాలం నుంచి ఆధునిక భారతదేశంలో డా. బాబాసాహెబ్ అంబేద్కర్, జ్యోతిబాపూలే, భాగ్యరెడ్డి వర్మ వంటి నాయకుల వరకు ఈ ఉద్యమం వివిధ రూపాల్లో కొనసాగింది. రాజకీయాలు ఈ ఉద్య మంలో కీలకమైనవి. 1980ల తర్వాత, దళిత ఉద్యమం రాజకీయ అంశాలపై ఎక్కువ దృష్టి పెట్టింది. సమాన రాజకీయ ప్రాతినిధ్యం, అధికారంలో భాగస్వామ్యం కోసం పోరా డింది. ఆంధ్రప్రదేశ్లో దళిత మహాసభ ఈ



రాజకీయ చైతన్యాన్ని ముందుకు తీసుకెళ్లింది. రాజకీయ సిద్ధాంతావేత్తగా డా. కత్తి పద్మారావు కృషి లోకానికి తెలియనిది కాదు. దళిత ఉద్యమకారుడుగా, దళిత దార్శనికుడుగా, మహా కవిగా, మహా వక్తగా నాలుగు దశాబ్దా లుగా చేసిన కృషి అనితర సాధ్యం.

కత్తి పద్మారావు ఆంధ్రప్రదేశ్‌లో దళిత ఉద్యమానికి ప్రముఖ నాయకుడు. 1985లో కారంచేడు మారణకాండ (Karamchedu Massacre) తర్వాత ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ స్థాపక ప్రధాన కార్యదర్శిగా ఆయన దళితులపై కుల దాడులకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని నడిపించారు. ఆయన ప్రభావం దేశవ్యాప్తంగా దళిత ఉద్యమాలపై చూపెట్టింది. దీని ద్వారా జాతీయస్థాయిలో రాజకీయ నాయకులు సన్నిహితులయ్యారు. పరస్పరం ప్రభావితులయ్యారు. అనేక అంశాలలో సమన్వయం సాధించారు. అలా సన్నిహితులైన వారిలో మాజీ ప్రధాని వి.పి.సింగ్, బిఎస్పి నాయకుడు కాన్షిరాం, రామ్ విలాస్ పాశ్వాన్, మాయావతి, శరద్ పవార్, వెలుమలై, భూటా సింగ్, బుద్ధిష్ట్ ధర్మవీర్, రామ్ మదన్, మల్లు రవి, కొప్పుల రాజు, ఉండ్రు రాజశేఖర్, గీతారెడ్డి తదితరులు.

డా. కత్తి పద్మారావు కారంచేడు ఉద్యమాల అనుభవాలతో ప్రజలకు ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీ అవసరమని భావించారు. 1988లో పేద ప్రజల పార్టీ ( Poor people's Party & PPP) అనే రాజకీయ పార్టీ ఏర్పాటు చేశారు. 1989లో వైస్ ప్రన్సిపాల్ ఉద్యోగానికి రాజీనామా చేసి బీఎస్పీ పార్టీలో జాయిన్ అయ్యారు. కాన్షిరాంతో కలసి జాతీయ స్థాయిలో మూడు ప్రత్యామ్నాయ రాజకీయ మహాసభలు నిర్వహించారు. కాన్షిరాం 21 పర్యటనలు ఉంటే అందులో 17 పర్యటన లలో డా. కత్తి పద్మారావు ఆయనతో పాటు ప్రయాణిస్తూ సభలలో పాల్గొనేవారు. 1998లో ప్రపంచ దళిత మహాసభలు మలేసియాలో జరిగాయి. కాన్షిరాంతో పాటు కత్తి పద్మారావు పాల్గొని కుల, మత, లింగ, జాతి వివక్షకు గురవుతూ అణగదొక్కబడు తున్న వారంతా వారంతా దళితులే అని తీర్మానించారు. మలేసియా పర్యటన నుంచి వచ్చి లక్నోలో బౌద్ధ అంతర్జాతీయ విమానాశ్రయం పెట్టి ప్రపంచంలోని బౌద్ధులందరికి ఉత్తరప్రదేశ్ లక్నో సాంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దాలని ప్రత్యామ్నాయ సంస్కృతి నిర్మాణం చేపట్టాలని ప్రణాళికలు రూపొందించారు. లక్నోలో డా.బాబాసాహెబ్ అంబే డ్కర్ పార్క్ నిర్మాణం అలా చేపట్టిందే.

ప్రత్యామ్నాయ సంస్కృతి వ్యక్తిత్వాల నిర్మాణంలో తమిళనాడులో పెరియార్ రామస్వామి చేసిన ఉద్యమాలను, నిర్మాణాలను కాన్షిరాంతో కలసి లక్నోలో పెరియార్ రామస్వామి పేరిట ప్రత్యామ్నాయ రాజకీయ, సాంస్క ృతిక మహాసభలు నిర్వహించారు. ఈ మహా సభలు దేశవ్యాప్తంగా ప్రజలను ఆకర్షించాయి. ఒక విధంగా చెప్పాలంటే పెరియార్ రామస్వామి ద్రావిడ ఉద్యమాన్ని ఉత్తర భారతదేశానికి పరిచయం చేసిన వ్యక్తి కత్తి పద్మారావు అని చెప్పుకోవాలి. మాయావతి ముఖ్యమంత్రి హోదాలో ఈ మహా సభలకు దేశవ్యాప్తంగా తరలివచ్చిన రచయితలకు, కళాకారులకు, సాహితీవేత్తలకు ప్రభుత్వ లాంఛనాలతో సకల సౌకర్యాలు ఏర్పాటు చేసి పురస్కారాలు అందచేశారు. దేశంలోనే మొట్టమొదటి సారి దళిత, వెనకబడిన తరగతుల కళాకారులకు, సాహితీవేత్తలకు అంత పెద్ద గౌరవం దక్కడం. ప్రత్యక్ష రాజకీయాలలో డా.కత్తి పద్మారావు 1994లో బీఎస్పీ తరుపున బాపట్లలో పోటీచేసి 23వేలకు పైగా ఓట్లు సాధించారు. 2009లో చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ ఏర్పాటు చేసినప్పుడు ప్రత్యమ్నాయ రాజకీయలకు వేదికగా మలచడానికి కత్తి పద్మారావు ఆ పార్టీలో చేరారు. వాటి ప్రణాళికలను రూపొందించిచారు. ఆంద్రప్రదేశ్ రాష్ట్రం తెలంగాణ-ఆంధ్రప్రదేశ్‌గా విడిపోయిన తరువాత నూతన రాష్ట్రంలో నవ్యాంధ్ర పార్టీ నిర్మాణం చేసి ప్రత్యామ్నాయ రాజకీయలకు సిద్ధాంత భూమికను అందిస్తున్నారు. ఆంధ్ర ప్రదేశ్ లో 150 అడుగుల డా.బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహం నిర్మించాలని అనేక ప్రాంతాల్లో పర్యటించి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జగన్మోహన్ రెడ్డి విజయవాడ PWDగ్రౌండ్‌లో నిర్మించిన డా.బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహం కత్తి పద్మారావు కృషి అని చెప్పక తప్పదు.

డా. కత్తి పద్మారావు దళితులకు జ్ఞానంపట్ల, జ్ఞానయుగం పట్ల ఆసక్తిని అవగాహనను పెంచుతున్నారు. యువత రాజకీయ లలో కూడా ప్రవేశించాలని, అనేక మార్గదర్శకాలు సైద్ధాంతిక రచనలు అందిస్తున్నారు. అందులో భాగంగా 'భారతరాజకీయాలు-కులాధిపత్య రాజకీయం ప్రత్యామ్నాయ వ్యక్తిత్వాలు' అనే ఈ గ్రంధాన్ని వెలువరించారు. సమాజాన్నిముందుకు నడపాలనుకునే దార్శనికులు, చరిత్రకారులు, సామాజిక విప్లవకారులు, చరిత్రను, సామాజిక శాస్త్రాలను, సంస్కృతిని అధ్యయనం చేసి పునర్ వ్యాఖ్యానిస్తారు. బుద్ధుడు, నాగార్జునుడు, కబీర్, గురురవిదాస్, వేమన, హెగెల్, మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, మావో, మహాత్మా జ్యోతిరావు పూలే, డా.బాబాసాహెబ్ అంబేడ్కర్, రాహుల్ సాంకృత్యాయన్, దేవీ ప్రసాద్ చటోపాధ్యాయ, డి. డి కోశాంబి, వివేకానందుడు మొదలైన వాళ్ళు తమ కాలంనాటికి వెలువడి ప్రాచుర్యంలో ఉన్న తత్వశాస్త్రాల్ని అధ్యయనం చేసి పునర్ వ్యాఖ్యానిస్తూ, పునర్ నిర్మిస్తూ ముందుకు సాగినవారే. ఈ కోవలో మన కాలంనాటి తత్వవేత్త డా. కత్తి పద్మారావు. డా.బాబాసాహెబ్ అంబేడ్కర్ బోధించిన విధంగా కులాంతర వివాహం చేసుకున్నారు, తన వారసులకు కూడా కులాంతర వివాహాన్ని చేశారు. కత్తి పద్మారావు ఒక తత్వవేత్త గా ఆలోచిస్తారు, డా.బాబాసాహెబ్ అంబేడ్కర్ వారసుడిగా ఆచరణ రూపాలు తీసుకుంటారు.రక్తపు జ్వాలాలతో ఎగిసి పడుతున్న సమాజన్ని బుద్ధుడి-అంబేడ్కర్ శాంతి మార్గంలో నడిపించి, బాధితుల వద్దకే కోర్టును తీసుకువచ్చిన నాయకుడిని సత్కరించటం బాధ్యత మహనీయుల మార్గాన్ని అనుసరించడం పే-బ్యాక్ టు సొసైటీ గా 19 అక్టోబర్ 2019న ఒంగోలులో శ్రీమతి రమాభాయి అంబేడ్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కత్తి పద్మారావును వేలాదిమంది సమక్షంలో 'దళిత ఉద్యమశిఖరం' అనే బిరుదుతో సత్కరించారు.

**- వెంకట్. బల్లికురవ**
9652680802

# ప్రభుత్వ బడుల్లో భాషాభివృద్ధి వాతావరణం...



చదివే సామర్థ్యం కలిగిన విద్యార్థులకు చదవడం అలవాటుగా మారితే వారిలో విషయ పరిజ్ఞానం,విచక్షణా శక్తి, ఉత్తమ వైఖరులు, సహన శీలత వంటి మంచి లక్షణాలు పెంపొందుతాయి. చదవడం అలవాటుగా చేయడానికి పాఠశాల మూల కేంద్రం కనుక రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేస్తున్నది. రూమ్ టు రీడ్ సంస్థ వారి సౌజన్యంతో రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (SCERT)ప్రభుత్వ బడుల్లో పుస్తకాల చెంతకు పిల్లలు చేరేటట్లు భాషాభివృద్ధి వాతావరణం కల్పించడానికి కృషి చేస్తున్నది. పిల్లల్లో మౌలిక భాష సామర్థ్యాలను పెంపొందించడానికి అమలు పరుస్తున్న ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంలో భాగంగా పఠన సామర్థ్యాన్ని పెంచడానికి విద్యార్థులను స్వతంత్ర పాఠకులుగా మార్చడానికి రాష్ట్ర విద్యా శాఖ సత్ఫలితాలు ఇచ్చే విధంగా ప్రయత్నం ప్రారం భించినది. ప్రస్తుత సమాజంలో విస్తరిస్తున్న ప్రపంచీకరణ నేపథ్యంలో అరచేతిలో ఇమిడి పోతున్న చరవాణి బాల్యాన్ని పుస్తకానికి దూరం చేస్తున్నది. ఇలాంటి విపత్కర పరిస్థితి నుండి విద్యార్థులను బయటకు లాగి పఠన కార్యక్రమంలో పిల్లలు మరింత ఉత్సాహంగా పాల్గొనేలా ప్రభుత్వ బడుల్లో గ్రంథాలయాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చిన విద్యాశాఖ అందుబాటులో ఉన్న నాణ్యమైన బాల సాహిత్యమును పిల్లలకు చేరువ చేయడానికి ప్రణాళిక రూపొందించి క్షేత్రస్థాయిలో అమలుపరుస్తున్నది. ప్రతి పాఠశాలలో ప్రతి తరగతికి గ్రంథాలయం పిరియడ్‌ను అందుబాటులోకి తెచ్చి పుస్తకాలు చదువేలా అనువైన వాతావరణాన్ని కల్పిస్తున్నారు. అలాగే పిల్లలు ఖాళీ సమయాల్లో పఠనం చేసేలా పుస్తకాలను ఇంటికి తీసుకెళ్లి చదివే విధంగా ఉపాధ్యాయులు ప్రోత్సహిస్తున్నారు. విభిన్నంగా గ్రంథాలయ నిర్వహణ చేయడం వల్ల విద్యార్థులలో నైతిక విలువలు పెరిగి సమాజంలో మంచి పౌరులుగా ఎదిగే అవకాశం ఉంది. అలాగే విద్యార్థులు ఉపాధ్యాయులతో కూడిన గ్రంథాలయ నిర్వహణ కమిటీని ఏర్పాటు చేయడం, పఠన విధి విధానాలు రూపొందించడం, అందుబాటులో నాణ్యమైన బాలసాహిత్యాన్ని ఉంచడం వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో పఠన సంస్కృతి ప్రతిబింబించేలా ప్రోత్సాహక



వాతావరణ చోటుచేసుకోనుంది. పిల్లలకు బొమ్మలతో, అక్షరాలతో, పదాలతో చార్టులతో, కవితలతో మరియు ఇతర ముద్రిత సామాగ్రితో సృజనాత్మకంగా అభ్యాసనాన్ని పెంపొందించే ముద్రిత సమృద్ధి వాతావరణం కల్పించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.

**రూమ్ టు రీడ్ వారి సహకారం. ..**

ప్రభుత్వ పాఠశాలలో అనేక వినూత్న కార్యక్రమాలు అమలు కోసం విద్యార్థులలో అభ్యసన ఫలితాలు సాధన కోసం అనేక స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి తమ కార్యచరణ ప్రణాళికలు అమలు పరుస్తున్నాయి. అందులో భాగంగా ప్రభుత్వ బడుల్లో స్నేహపూర్వక గ్రంథాలయాల ఏర్పాటుకు అలాగే అనేక రకాల బాల సాహిత్యమును విద్యార్థుల దరికి చేర్చడానికి రూమ్ టూ రీడ్ అనే స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర విద్య పరిశోధన సంస్థకు తోడ్పాటును అందిస్తున్నది. విద్యార్థుల చదివే స్థాయికి అనుగుణంగా GROWBY పుస్తక స్థాయిలను చదువు రాని పిల్లవాడి నుండి దారాళంగా చదివే పిల్లవాడి స్థాయి వరకు పుస్తకాలను అందజేస్తున్నది.

అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పుస్తకాలు అందజేసినది. అంతర జాతీయ పఠన సిఫార్సు సంఘం ప్రకారం ఒక తరగతి గదిలోని ఒక్కొక్క చిన్నారి ఏడు వైవిధ్య మైన శీర్షికల చొప్పున చదివే విధంగా రాష్ట్ర ప్రభుత్వం మరియు రూమ్ టూ వీడు సంస్థ కృషి చేస్తున్నది. 'ఒక మంచి పుస్తకం వంద మంది మిత్రులతో సమానం' అని అబ్దుల్ కలాం చెప్పినట్లు చదువు -ఆనందించు- అభివృద్ధి చెందు. అనే నినాదంతో ప్రభుత్వ బడుల్లో అభ్య సన వాతావరణం వృద్ధి చెందాలని పిల్లలందరూ పుస్తక ప్రపంచంలో విహరించాలని ఆకాంక్షిద్దాం.

**- అంకం నరేష్**
6301650324

## ఒకవేళ నేను...

ఒకవేళ నేను...
ఒక హృదయాన్ని
పగిలిపోకుండా ఆపగలిగితే
వ్యర్థంగా కాకుండా నేను
అర్థవంతంగా జీవించినట్లే సుమా!

ఒకవేళ నేను...
ఒక వేదనామయజీవితాన్ని
సుఖవంతంగా మార్చగలిగినా,
లేదా ఒక బాధను చల్లార్చగలిగినా,
లేదా మూర్ఛిల్లుతూన్న ఒక రాబిన్ పక్షిని
మళ్ళీ దాని గూడులోకి చేర్చగలిగితే...
వ్యర్థంగా కాకుండా నేను
అర్థవంతంగా జీవించినట్లే సుమా!!!
అమెరికాలో కనిపించే ఎరుపురంగు చిన్నపక్షి.

**ఆంగ్లమూలం** **స్వేచ్ఛాకవితానువాదం**
**ఎమిలీ డికిన్సన్** **'రఘువర్మ'**

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు
manamlekhalu@gmail.com
మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.
- ఎడిటర్

# జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య

భారతీయులు సగర్వంగా, సగౌరవంగా తలెత్తి వందనం చేసే, భారత సార్వభౌమాధికారానికి ప్రతీక అయిన త్రివర్ణ పతాక రూపకర్త పింగళి వెంకయ్య. స్వాతంత్ర్య సమరయోధునిగా, వ్యవసాయ, భూగర్భ ఖనిజ శాస్త్రవేత్తగా, జపనీస్ భాషా బోధకునిగా, చిత్రకారునిగా, వివిధ దేశాల పర్యాటకునిగా, బహుముఖ ప్రజ్ఞ కలిగిన వెంకయ్యను భారతీయులంతా గుర్తు చేసుకోవాల్సిన సందర్భం అనివార్యం. 1878 ఆగస్టు 2న కృష్ణాజిల్లా పెద్ద కళ్ళేపల్లెలో జన్మించిన వెంకయ్య, భట్లపెనుమర్రిలో విద్యాభ్యాసం ముగించుకొని తన19వ ఏట ముంబై వెళ్లి సైన్యంలో చేరారు.

మద్రాసులో ప్లేగు ఇన్‌స్పెక్టరు శిక్షణ పూర్తి చేసి, కొంతకాలం బళ్లారిలో ప్లేగ్ ఇన్‌స్పెక్టరుగా పని చేసారు. శ్రీలంక వెళ్ళి కొలంబోలోని సిటీ కాలేజీలో పొలిటికల్ ఎకనమిక్స్ ప్రత్యేక విషయంగా చదివి కేంబ్రిడ్జ్ సీనియర్ పరీక్షలో ఉత్తీర్ణుడయ్యారు. లాహోర్‌లోనిడి.ఎ.వి.కాలేజీలో సంస్కృతం, ఉర్దూ, జపాన్ భాషల్లో మంచి పాండిత్యం సంపాదించారు. జపాన్‌భాషలో అనర్గళంగా మాట్లాడే వెంకయ్యను 'జపాన్ వెంకయ్య' అని పిలిచే వారు.

1899-1902 మధ్య డచ్ సైన్యానికి వ్యతిరేకంగా, దక్షిణాఫ్రికాలో బోయర్ యుద్ధంలో పాల్గొన్నారు. అక్కడే ఆయనకు స్వాతంత్రోద్యమ నిర్దేశకులు, భావిభారత జాతిపిత మహాత్మా గాంధీతో పరిచయం ఏర్పడింది. దక్షిణాఫ్రికాలో ఉండగా మహాత్మా గాంధీని కలిశారు. గాంధీతో వెంకయ్యకు ఏర్పడిన ఈ సాన్నిహిత్యం అర్ధశతాబ్దం పాటు నిలిచింది. భూగర్భ ఖనిజ శాస్త్రవేత్తగా మైకా, వజ్రాలపై ఆయన విస్తృత పరిశోధనలు జరిపారు. స్వదేశం వస్తూ అరేబియా, ఆఫ్ఘనిస్థాన్‌లు చూచి వచ్చారు. గాంధీజీ పరిచయం అయిన నాటి నుండి జాతీయ జెండా ఎలా ఉండాలనే సమస్యనే తన అభిమాన విషయంగా పెట్టుకొని, దాని గురించి దేశంలో ప్రచారం ప్రారంభించారు. 1913 నుండి ప్రతి కాంగ్రెస్ సమావేశానికి హాజరై, నాయకులందరితోనూ జాతీయ పతాక రూపకల్పన గురించి చర్చలు జరిపారు. 1916లో 'భారత దేశానికి ఒక జాతీయ పతాకం' అనే ఆంగ్ల గ్రంథాన్ని రచించారు.

1916 లో 'నీడ్ ఫర్ నేషనల్ ఫ్లాగ్' పేరున 30 నమూనాలతో జాతీయ పుస్తక రచన గావించారు. ఈ గ్రంథానికి అప్పటి వైస్రాయ్ కార్యనిర్వాహక సభ్యుడైన కేంద్రమంత్రి సర్ బి.ఎన్.శర్మ ఉత్తేజకరమైన పీఠిక రాశారు. 1916లో లక్నోలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో వెంకయ్య తయారు చేసిన జాతీయ జెండానే ఎగుర వేశారు. 1919లో జలంధర్ వాస్తవ్యులైన 'లాలా హన్స్ రాజ్' మన జాతీయ పతాకంపై రాట్నం చిహ్నముంటే బాగుంటుందని సూచించగా గాంధీజీ దాన్ని అంగీకరించారు. 1921లో అఖిల భారత కాంగ్రెస్ సమావేశాలు బెజవాడలో జరిగాయి. గాంధీజీ వెంకయ్యను ఆ సమావేశానికి పిలిపించి కాషాయం, ఆకుపచ్చ రంగులు కలిగి, మధ్య రాట్నంగల ఒక జెండాను చిత్రించమని కోరారు. మహాత్ముడు సూచించిన ప్రకారంగానే జెండాను సమకూర్చాడు వెంకయ్య. అనంతరం వచ్చిన ఆలోచనల మేరకు, సత్యం, అహింసలకు ప్రత్యక్ష నిదర్శనమైన, తెలుపు రంగు కూడా ఉండాలని గాంధీజీ అభిప్రాయ పడగా, వెంకయ్య ఆ జెండాలో అదనంగా తెలుపు రంగును చేర్చి, నేటి త్రివర్ణ పతాకాన్ని దేశానికి ప్రసాదించారు.

'మడత పెడితే పిడికెడే కానీ, కోటానుకోట్ల భారతీయుల ప్రియవస్త్రం'గా గాంధీజీచే వెంకయ్య




రూపకల్పన చేసిన జాతీయ పతాకం ప్రశంసా పాత్రమైంది.

1947, జూలై 22 వ తేదీన భారత రాజ్యాంగ సభలో నెహ్రూ జాతీయ జెండా గురించి ఒక తీర్మానం చేస్తూ, మునుపటి త్రివర్ణ జెండాలోని రాట్నాన్ని తీసేసి, దాని స్థానంలో అశోకుని ధర్మ చక్రాన్ని చిహ్నంగా ఇమిడ్చారు. చిహ్నం మార్పు తప్పితే పింగళి వెంకయ్య రూపొందించిన జెండాకు నేటి జెండాకు తేడా ఏమీ లేదు. అశోకుని ధర్మ చక్రం మన పూర్వ సంస్క ృతికి సంకేతం.

పింగళి వెంకయ్య 1906 నుంచి 1922 వరకు భారత జాతీయోద్యమం లోని వివిధ ఘట్టాలలో పాల్గొన్నారు. వందేమాతరం, హోమ్రూల్ ఉద్యమం, ఆంధ్రోద్యమం లాంటి ప్రసిద్ధ ఉద్యమాలలో ప్రధాన పాత్రధారిగా ఉన్నారు. భారతదేశానికి తిరిగి వచ్చిన తర్వాత ఆయన బెంగుళూరు, మద్రాసులలో 'రైల్వే గార్డు'గా పనిచేశారు. ఆ తరువాత కొంత కాలం బళ్లారిలో 'ప్లేగు అధికారి'గా ప్రభుత్వ ఉద్యోగం చేశారు. వెంకయ్యలో ఉన్న దేశభక్తి ఆయనను ఎంతో కాలము ఉద్యోగం చేయనివ్వలేదు.

1906 నుండి 1922 వరకు జాతీయోద్యమాలతో పాటు మునగాల పరగణా నడిగూడెంలో జమీందారు రాజా బహదూర్ నాయని రంగారావు కోరిక మేరకు, నడిగూడెంలో నివాసముండి, పత్తి మొక్కలలోని వేలు రకముల పరిశోధనలో వినియోగించారు. నడిగూడెంలో వ్యవసాయ క్షేత్రాన్ని నిర్మించాడు. ఈ పరిశోధనలలో 'కంబోడియా పత్తి' అను ఒక ప్రత్యేక రకమైన పత్తి మీద విశేష కృషి చేశారు. ఆయన కృషిని ఆనాటి బ్రిటీషు ప్రభుత్వం కూడా గుర్తించడముతో ఆయనకు 'పత్తి వెంకయ్య' అని పేరు వచ్చింది.

తరువాత నెల్లూరు చేరి, 1924 నుండి 1944 వరకు అక్కడే ఉంటూ మైకా (అభ్రకం) గురించి పరిశోధన చేశారు. వజ్రకరూరు, హంపిలలో ఖనిజాలు, వజ్రాలు గురించి విశేషంగా పరిశోధనలు జరిపి ప్రపంచానికి తెలియని వజ్రపు తల్లిరాయి అనే గ్రంథం రాసి 1955లో దాన్ని ప్రచురించారు. దేశానికి స్వాతంత్ర్యం లభించిన తరువాత ప్రభుత్వం వెంకయ్యను ఖనిజ పరిశోధక శాఖ సలహాదారుగా నియమించింది. ఆ పదవిలో ఆయన 1960 వరకు పనిచేసారు.

అయితే వెంకయ్య జీవిత చరమాంకం దయనీయ స్థితిలో ముగిసింది.1960 లో భారత ప్రభుత్వం భూగర్భ ఖనిజాలు సంస్థ సలహాదారునిగా వెంకయ్యకు ఇచ్చే గౌరవ వేతనాన్ని సైతం నిలిపి వేసింది. వృద్ధాప్యంలో ఆర్థిక బాధలు ఆయనను చుట్టు ముట్టాయి. మిలటరీలో పని చేసినందుకు విజయవాడ చిట్టినగరులో ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో, ఆయన గుడిసె వేసుకొని దారిద్ర్య జీవితాన్ని గడపవలసి వచ్చింది. జీవితాంతం దేశం కొరకు, స్వాతంత్ర్యం కొరకు పోరాడిన వెంకయ్య చివరి రోజుల్లో తిండికి కూడా మొహం వాచి, నానా అగచాట్లు పడినట్లు 'త్రివేణి' సంపాదకులు డా. భావరాజు నరసింహారావు పేర్కొన్నారు. అంతిమదశలో విజయవాడలో డా. కె.ఎల్. రావు,డా.టి.వి.ఎస్.చలపతిరావు, కాట్రగడ్డ శ్రీనివాసరావు మున్నగు పెద్దలు 1963 జనవరి 15న వెంకయ్యను సత్కరించి, కొంత నిధిని అందించారు. కన్నుమూసే ముందు ఆయన చివరి కోరికను వెల్లడిస్తూ ' నా అంత్య దశ సమీపించింది. నేను చనిపోయిన తర్వాత త్రివర్ణ పతాకాన్ని నా భౌతిక కాయంపై కప్పండి. శ్మశానానికి చేరిన తర్వాత ఆ పతాకం తీసి అక్కడ ఉన్న రావి చెట్టుకు కట్టండి. ఇది నా తుది కోరిక' అన్నారు.

ఆత్మాభిమానానికి మారుపేరైన వెంకయ్య, కడు పేదరికాన్ని అనుభవిస్తూ, 1963 జూలై 4న విజయవాడలో తుది శ్వాస వదిలారు. 1964లో జూలైలో నాటి ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి, వెంకయ్య చిత్రపటాన్ని ఆవిష్కరించినా, విజయవాడ గాంధీ హాల్ నందు విగ్రహావిష్కరణ జరిగినా, భారతీయులు ఆచంద్ర తారార్కం గుర్తుంచుకోవలసిన పింగళి వెంకయ్యకు రావలసిన గౌరవం రాకపోవడం నిజంగా బాధాకరం. గత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హైదరాబాదులో ట్యాంక్ బండ్‌పై ఆయన కాంస్య విగ్రహాన్ని ప్రతిష్ఠింపజేసి ఆయన దర్శన భాగ్యం ప్రజలకు లభింపజేసి కొంతలో కొంతైనా ప్రజలకు గుర్తుండేలా చేసింది.

**- రామ కిష్టయ్య సంగనభట్ల**
9440595494



## ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య

**వేములవాడ, ఆగస్టు 2(మనం న్యూస్):** వేములవాడ మహాత్మా జ్యోతిబా పూలే బాలికల పాఠశాలలో 'అన్ అకాడమీ' ఆన్లైన్ తరగతులను రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉన్నదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖను స్వయంగా చేపట్టి, బడుగు వర్గాల విద్యార్థుల కోసం అనేక వినూత్న కార్యక్రమాలు చేపట్టారని పేర్కొన్నారు. జిల్లాలో ఐఐటీ ఫౌండేషన్, నీట్, జేఈఈ శిక్షణలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని తెలిపారు. నాణ్యమైన భోజనంతో పాటు విద్యను అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, విద్యార్థులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతిష్ఠాత్మక సంస్థల నుంచి మెంటర్లు, ఉపాధ్యాయులు బోధన అందిస్తారని తెలిపారు. రెసిడెన్షియల్ పాఠశాలలన్నింటికీ తరగతులు విస్తరించనున్నాయని తెలిపారు.

# పేదల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వ పాలన

- వీ హబ్ ఉప కేంద్రం పెద్దపల్లి జిల్లాలో ఏర్పాటు
- మహిళల కోసం మంథని సమీపంలో ప్రత్యేక పారిశ్రామిక పార్క్ ఏర్పాటుకు కృషి
- ప్రతి కుటుంబానికి నెలకు సగటున 1200 రూపాయల విలువ గల సన్నబియ్యం ఉచితంగా అందిస్తున్నాం
- మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు





**పెద్దపల్లి/ మంథని, ఆగస్టు 02(మనం ప్రతినిధి):** పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్రంలో ప్రభుత్వ పాలన సాగుతోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసన సభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు కోరారు. శనివారం మంథని ప్రాంతంలో రాష్ట్ర మంత్రి వర్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షతో కలిసి ఆర్.ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన నూతన రేషన్ కార్డుల పంపిణీ, మహిళా శక్తి సంబరాలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, అర్హులైన పేద ప్రజలకు రేషన్ కార్డుల జారీ చేయాలని ప్రతిపక్షంలో అనేక సందర్భాలలో ధర్నాలు చేసినప్పటికీ గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అర్హులకు నూతన రేషన్ కార్డులతో పాటు 50 నుంచి 60 రూపాయల విలువ చేసే సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని అన్నారు.

రేషన్ ద్వారా దొడ్డు బియ్యం సరఫరా చేయడం ద్వారా రీసైక్లింగ్ గుర్రై అక్రమార్కులు మాత్రమే బాగుపడ్డారని, నేడు సన్న బియ్యం సరఫరా పేద ప్రజలకు ఉపయోగ పడుతుందన్నారు. ప్రతి కుటుం బానికి సగటున నెలకు రూ.1200ల విలువ గల బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. రేషన్ డీలర్లు బియ్యం పంపిణీ కార్యక్రమం సక్రమంగా చేయాలని అన్నారు. పేద ప్రజలకు నాణ్యమైన విద్య అందించడం కోసం పెద్ద ఎత్తున ఆదర్శ పాఠశాలలను మన హయాంలో ఏర్పాటు చేశామని మంత్రి గుర్తు చేశారు. వేములవాడ రాజన్న, కాళేశ్వరం ముక్తేశ్వర స్వామి, సమక్క సారలమ్మ జాతర వెళ్లడానికి, రాష్ట్రంలో ఎక్కడికైనా మహిళలు ఉచితంగా ప్రయాణం చేసేందుకు ఆర్టీసీ బస్సుల్లో ప్రభుత్వం సౌకర్యం కల్పించిందని అన్నారు. ఆర్టీసీ బస్సులు ఉచితంగా ప్రయాణించే మహిళలకు ఇప్పటి వరకు 200 కోట్ల పైగా జీరో టికెట్లు జారీ చేసి 6680 కోట్ల రూపాయలు మహిళల తరఫున ప్రభుత్వం చెల్లించిందని అన్నారు. పేద ప్రజల కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా సరఫరా చేస్తున్నామని అన్నారు. మహిళలకు వడ్డీ లేని రుణాల పథకం డబ్బులను గత ప్రభుత్వం జమ చేయ లేదని మంత్రి విమర్శించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల కార్యక్రమం మళ్ళీ ప్రారంభించామని అన్నారు. మహిళలు వ్యాపార రంగంలో అభివృద్ధి చెందేందుకు ప్రత్యేకంగా ఇండస్ట్రియల్ పార్క్ మహిళల కోసం ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. మహిళలకు వ్యాపార నైపుణ్యాలలో శిక్షణ అందించేందుకు వీ-హబ్ ఉప కేంద్రం పెద్దపెల్లి జిల్లాలో ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద డైయిరీ, పౌల్ట్రీ ఫార్మ్ ఏర్పాటు చేసుకునేందుకు ప్రణాళికలు తయారు చేయాలని అన్నారు. మహిళలకు మంథని లో కుట్టు మిషన్ శిక్షణ అందిస్తున్నామని, రాబోయే కాలంలో కొన్ని కంపెనీలను ఇక్కడ ఏర్పాటు ప్రతిపాదనలు ఆలోచిస్తున్నామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వస్తువుల కల్పన పనులను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టామని అన్నారు. రైతు సోదరులకు ఒకే సంవత్సరంలో 21 వేల కోట్ల రూపాయల ఖర్చు చేసి 2 లక్షల రుణ మాఫీ పూర్తి చేశామని అన్నారు. 9 రోజుల వ్యవధిలో 9 వేల కోట్ల రైతు భరోసా సొమ్ము విడుదల చేశామని అన్నారు. ఆరోగ్య శ్రీ పరిమితి 10 లక్షలకు పెంచామని, మొదటి సంవత్సరంలో 60 వేల నిరుద్యోగ యువతకు ప్రభుత్వ నియామక పత్రాలు పంపిణీ చేశామని అన్నారు. ప్రైవేట్ రంగంలో యువతకు ఉపాధి కల్పించాలని గతంలో ఎన్నడు లేని విధంగా భారీ ఎత్తున పెట్టుబడులను ఆకర్షించడం జరిగిందని అన్నారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నామని అన్నారు. మంథని నియోజకవర్గ పరిధిలో మొదటి దశలో 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామని అన్నారు. చివరి లబ్ధిదారుడి వరకు ఇల్లు చేరేలా ఇందిరమ్మ ఇండ్ల పథకం కొనసాగుతుందని, ప్రతి సంవత్సరం నూతనంగా ఇండ్లు మంజూరు చేస్తామని ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని మంత్రి తెలిపారు. ఇండ్ల స్థలాలు లేని నిరు పేదలకు ప్రభుత్వ భూములను కేటాయించి ఇందిరమ్మ ఇండ్లు కట్టించే సంకల్పం చేస్తున్నామని అన్నారు. అడవి సోమనపల్లి లో 200 కోట్లు ఖర్చు చేసి కార్పొరేట్ స్థాయికి దీటుగా ఉండేలా ఇండియా సమీకృత గురుకుల పాఠశాల నిర్మాణం చేస్తున్నామని అన్నారు. గురుకులాల్లో చదివే పిల్లలకు 40 శాతం డైట్ చార్జీలు పెంచామని అన్నారు.

### అన్ని రంగాలలో మహిళలకు ప్రాధాన్యత: కలెక్టర్

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ గత 20 నెలల కాలంలో ప్రభుత్వం అన్ని రంగాలలో మహిళలకు ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. ప్రభుత్వం మహిళలకు అందించిన ప్రాధాన్యత పై సంబరాలు చేసుకుంటూ భవిష్యత్తులో మహిళల అభ్యున్నతికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవడానికి మహిళా శక్తి సంబరాలు జరుపుకుంటున్నామని అన్నారు. జిల్లాలో నూతనంగా మంజూరు చేసిన రేషన్ కార్డుల ద్వారా 25 వేల పైగా ప్రజలకు లబ్ధి పొందనున్నారని తెలిపారు. రేషన్ కార్డు జారీ నిరంతర ప్రక్రియ గా కొనసాగుతుందని, ప్రజలు నేరుగా ప్రజా పాలన కేంద్రాలు, మీ సేవా సెంటర్ల ద్వారా దరఖాస్తు చేసుకుంటే విచారించి అర్హులకు రేషన్ కార్డులు జారీ చేస్తామని అన్నారు. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు రామగిరి, మంథని, ముత్తారం, కమాన్ పూర్ మండలాలకు చెందిన 2389 స్వశక్తి మహిళా సంఘాలకు 2 కోట్ల 37 లక్షల వడ్డీ రాయితీ చెక్కు, సహజంగా మరణించిన 17 మంది సంఘ సభ్యులకు 14 లక్షల 66 వేల 344 రూపాయల లోన్ బీమా చెక్కు, ప్రమాదవశాత్తు మరణించిన ఒక మహిళా సంఘ సభ్యురాలి కుటుంబానికి 10 లక్షల రూపాయల ప్రమాద బీమా చెక్కు, 385 శివశక్తి మహిళా సంఘాలకు 30 కోట్ల రూపాయల బ్యాంకు లింకేజీ రుణాల చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. క్రిస్టియన్ కార్పొరేషన్ ద్వారా మూడు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. అంతకు ముందు మంథని పట్టణంలో పెట్రోల్ బంక్ ఏరియా, పెద్దపల్లి రోడ్డు, గోదావరిఖని రోడ్డులో 6 కోట్ల 70 లక్షల రూపాయలతో నెలకొల్పిన సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను, రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలో 2 కోట్ల 60 లక్షల రూపాయల నిధులతో కల్వచర్ల నుంచి లోంక కేశారం వరకు నిర్మించిన సిసి రోడ్డును మంత్రి ప్రారంభించారు. మంథని ఎంపీడీవో కార్యాలయం వద్ద మంథని పట్టణంలో 20 కోట్ల 50 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించే 410 ఇందిరమ్మ ఇండ్ల పైలాన్, 7 గ్రామాలలో కోటి 40 లక్షలతో నిర్మించే గ్రామపంచాయతీ భవనాలకు, ఎక్లాస్పూర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2 కోట్ల 70 లక్షలతో నూతనంగా నిర్మించబోతున్న బాయ్స్ హాస్టల్ భవనానికి మంత్రి శ్రీధర్ బాబు శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సింగరేణి సిఎస్ఆర్ నిధుల కింద పదో తరగతి విద్యార్థులకు ఉపయోగపడే క్యూఆర్ కోడ్ పుస్తకాలు పంపిణీ చేసారు. అటవీశాఖ మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వనమహోత్సవం కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.వేణు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నన్నయ గౌడ్, ఆర్.డి.ఓ. సురేష్, తహసిల్దార్, ఎంపిడిఓ, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- మున్సిపల్ కమిషనర్ టి.రమేష్





**సుల్తానాబాద్ ఆగస్టు 2(మనం న్యూస్):** సుల్తానాబాద్ మున్సిపల్ కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు సుల్తానాబాద్ కమిషనర్ రమేష్ తెలిపారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు, వాటర్ సప్లై సిబ్బందికి, బిల్ కలెక్టర్లకి, ఆర్పిలకు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, స్వచ్ఛత పై తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ప్రజలందరి యోగక్షేమాలు చూసే మున్సిపల్ కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే మున్సిపాలిటీ పరిశుభ్రంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని మున్సిపల్ కార్యాలయంలో వైద్య సేవలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ అలీమొద్దీన్, ఏఈ రాజ్ కుమార్, వార్డు ఆఫీసర్స్, వైద్య సిబ్బంది డాక్టర్ ఉదయ్ కుమార్, డాక్టర్ సింధుజ, ఎల్‌టి శ్రీనివాస్, స్వప్న, హెచ్‌వి ఎలెజబెత్, ఏఎన్ఎం సరస్వతి, వినోద, ఆశాలు మరియమ్మ, రమ, స్వప్న, రమ శానిటరీ ఇన్స్పెక్టర్ నాగరాజు మున్సిపల్ సిబ్బంది శ్రావణ్ కుమార్, రాజ్ కుమార్, వినోద్ పాల్గొన్నారు.

## సిటీ పోలీస్ యాక్ట్ అమలు

- జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్



**జగిత్యాల, ఆగస్టు 02 (మనం ప్రతినిధి):** జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని ఆగస్టు నెల రోజుల (ఆగస్టు 1వ తేదీ నుంచి 31) పాటు జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. నెల రోజుల పాటు పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగులు, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని ఎస్.పి. సూచించారు, జిల్లా ప్రజలు పోలీసు వారికి ఇట్టి విషయంలో సహకరించాలని శాంతిభద్రతల పరిరక్షణ కు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని సూచించారు.

# 144 మంది అర్హులకు ఇండ్ల పట్టాలు

- సొంతింటి కలను నెరవేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వం
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**వేములవాడ, ఆగస్టు 2(మనం న్యూస్):** వేములవాడ పట్టణంలో శనివారం ఎస్ఆర్ఆర్ గార్డెన్‌లో జరిగిన ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని 144 మంది అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత ప్రభుత్వ హయాంలో నిరుపయోగంగా మారిన ఇండ్లను మళ్ళీ పేదలకు అందజేస్తున్నామని, దీని వల్ల సొంతింటి కల నెరవేరుతోందన్నారు. బస్ డిపో పక్కన ఉన్న స్థలంలో 12 బ్లాకుల్లో జీ+2 మోడల్లో 144 ఇండ్లను నిర్మించాం. మొత్తం రూ.7.63 కోట్ల ప్రాజెక్టులో ఇప్పటివరకు రూ.2 కోట్లు ఖర్చు అయ్యాయన్నారు. మిగతా నిధులతో త్వరలోనే పనులు పూర్తి చేస్తామని వివరించారు.ఈ ఇండ్లను ఇవ్వండి అని అప్పట్లో ఎన్నో సార్లు ధర్నాలు, డిమాండ్లు చేశాం. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అదే ఇండ్లను పేదలకు ఇస్తున్నామని ఇది నిజమైన ప్రజాప్రభుత్వం పని అని అన్నారు. రాజన్న ఆలయం అభివృద్ధికి గత ప్రభుత్వం ఏ ఒక్క రూపాయి ఇవ్వలేదని, ఏడేళ్ల బడ్జెట్ ప్రవేశపెట్టినా ఒక్క నిధి కేటాయించలేద న్నారు. కానీ మేమే అధికారంలోకి వచ్చాక రూ.150 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని రాజన్న ఆలయం కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని వ్యాఖ్యానించారు. వేములవాడ పట్టణంలోని మూలవాగులో మురుగు నీరు వెళ్లకుండా చర్యలు తీసుకుంటున్నామని, 28 వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తున్నామని చెప్పారు. 47 కోట్లతో రోడ్డు విస్తరణ చేపట్టామని, నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించామని వివరించారు.పట్టణంలో ఇంకా దాదాపు 2వేల మందికి ఇళ్లు అవసరమున్నాయని. ఈ విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిల దృష్టికి తీసుకెళ్తానని. వారి సహకారంతో స్థలాన్ని కేటాయించి, మరిన్ని ఇండ్లను నిర్మిస్తామని తెలిపారు. ఉచిత ఆర్టీసీ ప్రయాణంతో ఇప్పటికే 200 కోట్ల ప్రయాణాలు పూర్తయ్యాయని,రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రుణ మాఫీ, రేషన్ కార్డుల పంపిణీ, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇల్లు వంటి పథకాలతో ప్రజలు మమ్మల్ని ఆశీర్వదిస్తున్నారని పేర్కొన్నారు.మీ ఆశీర్వాదాలతోనే గెలిచాను. మీ సమస్యలన్నింటికీ సమాధానం ఇస్తాను. మీ బిడ్డగా, మీవాడిగా ముందుకెళ్తానని అన్నారు.మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్,గృహ నిర్మాణ శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్,మున్సిపల్ కమిషనర్ అన్వేష్, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ కార్డు.. పేదల జీవన ప్రమాణానికి ప్రధానం

- అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించేలా ప్రభుత్వం కృషి
- నూతనంగా మంజూరైన తెల్ల రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ
- రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**జగిత్యాల ఆగస్టు 02(మనం ప్రతినిధి):** రాష్ట్ర వ్యాప్తంగా జూలై 25 నుండి ఆగస్టు 10 వరకు నూతనంగా మంజూరైన రేషన్ కార్డుల పంపిణీ మండల కేంద్రాల్లో కొనసాగుతుందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. శనివారం ఎండపల్లి, వెల్గటూర్ మండలలకు సంబంధించిన కొత్త తెల్ల రేషన్ కార్డులను, కళ్యాణ లక్ష్మి చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేసే కార్యక్రమంలో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరై లబ్దిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమ కోసం పాటు పడుతుందని, వారి అభివృద్ధికి కృషి చేస్తుందని తెలిపారు. రేషన్ కార్డు అనేది నిరంతర ప్రక్రియ అని వాటిలో మార్పులు-చేర్పులు చేసుకునే అవకాశం ఉంటుందని అన్నారు. మనిషికి 6 కిలోల చొప్పున సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. కొత్తగా రేషన్ కార్డు పొందిన వారికి రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాలకు దరఖాస్తు చేసుకునేందుకు తాజాగా అవకాశం కల్పించిందని తెలిపారు. రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ అని, కార్డు రాని వారు మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. రేషన్ కార్డులు లేక పథకాలకు దూరంగా ఉన్న వారికి ఇప్పుడు ప్రభుత్వ నిర్ణయంతో ప్రయోజనాలు దక్కనున్నాయని, రేషన్ కార్డులు రానివారు ఇప్పుడు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని, ప్రభుత్వం వెంటనే వారి దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి రేషన్ కార్డులను మంజూరు చేస్తుందని తెలిపారు. ప్రస్తుతం కొత్త కార్డు రాని వారు ఇబ్బందులు పడాల్సిన పని లేదని, రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్, ఐసీడీఎస్ ధర్మపురి సీడీపీఓ వాణిశ్రీ, సూపర్ వైజర్లు, అంగన్వాడి టీచర్లు, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రోమోర్ దుకాణంలో ఆకస్మిక తనిఖీ



- నాణ్యతలేని ఎరువులు, మందులు విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు
- జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్

**జగిత్యాల ఆగస్టు 02(మనం ప్రతినిధి):** రైతులకు ఎరువులు విత్తనాలు నాణ్యతమైనవి అందించాలి. కానీ, నాణ్యతలేని ఎరువులు మందులు విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటాం అని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో మన గ్రోమోర్ దుకాణంలో ఎరువుల సరఫరాపై జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల విక్రయాలకు సంబంధించిన రికార్డులను కలెక్టర్ పరిశీలించారు. ఎరువుల దుకాణం ముందు సూచిక బోర్డు తప్పనిసరి ఉంచాలని, సూచిక బోర్డుపై ఎరువులు మందులు, విత్తనాలు ధరల పట్టికలో ధరలు రాయాలని, రైతులకు సరైన ధరలకు అమ్మాలని సూచించారు. అదే విధంగా రైతులకు ఎరువులు విత్తనాలు నాణ్యతమైనవి అందించాలని, కాలం చెల్లిన (ఎక్స్ పైర్) మందులను రైతులకు అమ్మ రాదని పేర్కొన్నారు. ఎరువులు, స్ప్రే మందులు సరైన ధరలకు అమ్మాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం, జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులతో ఒక ఎకరానికి ఎంత ఎరువులు వేస్తున్నారని రైతులను అడిగి తెలుసుకున్నారు. నాణ్యత మైన మందులు ఇస్తున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. దుకాణదారు యజమానులకు రైతులకు నాణ్యతలేని ఎరువులు మందులు విత్తనాలు అమ్మినట్లయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తూనికలలో జిల్లా వ్యవసాయ అధికారి వి.భాస్కర్, మండల అధికారి ఏవో వినీల, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో వన మహోత్సవం



- మొక్కలు నాటిన మంత్రి వివేక్ వెంకటస్వామి

**మందమర్రి, ఆగస్టు 2(మనం న్యూస్):** మందమర్రి పట్టణ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మందమర్రి స్థానిక శ్రీవెంకటేశ్వర టెంపుల్ ఆవరణలో శనివారం నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్మిక గనుల శాఖ మంత్రి చెన్నూరు శాసన సభ్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి హాజరై వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటారు. మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ యూత్ కాంగ్రెస్ నిర్వహించిన ఈ వన మహోత్సవం చాలా మంచి కార్యక్రమం అని, పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని, ప్రస్తుత కాలంలో వాతావరణ కాలుష్యం చాలా పెరిగిపోయింది. కాబట్టి మొక్కలు నాటడం వల్ల వాతావరణ కాలుష్యాన్ని చాలా వరకు వాతావరణ కాలుష్యాన్ని అరికట్టవచ్చన్నారు. రాబోయే తరాలకు మంచి వాతావరణం అందించాలంటే ప్రతి ఒక్కరు తమ వంతుగా మొక్కలు నాటాలని, నాటిన మొక్కలను రక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. నాటిన ప్రతి మొక్కను రక్షించినప్పుడే వన సంరక్షణ జరుగుతుందని కనుక ప్రతి ఒక్కరు నాటిన మొక్కను రక్షించే విధంగా చూడాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పట్టణ యూత్ కాంగ్రెస్, పట్టణ, ఎన్ఎస్‌యూఐ నాయకులు, మహిళా నాయకురాలు ఐఎన్టీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్ సవరణ, నూతన కార్డు కోసం ప్రత్యేక క్యాంపు

- పత్రికా ప్రకటన విడుదల చేసిన జిల్లా కలెక్టర్



**పెద్దపల్లి, ఆగస్టు 02(మనం ప్రతినిధి):** ఆగస్టు 5 నుంచి 8 వరకు కలెక్టరేట్ ఆవరణ లో ఆధార్ సవరణ మరియు నూతన ఆధార్ కార్డు కోసం ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీ కోయ శ్రీ హర్ష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక క్యాంపులో నూతన ఆధార్ కార్డు ఎన్ రోల్ మెంట్ ఉచితంగా జరుగుతుందని అన్నారు. బయోమెట్రిక్ అప్ డేషన్ (ఫింగర్ ప్రింట్,ఐరిస్, ఫోటో) చేయడానికి 100 రూపాయల రుసుం మరియు డేమోగ్రాఫిక్ అప్ డేషన్ బయోమెట్రిక్ అప్ డేట్ తో కలిసి చేస్తే ఉచితంగా ఉంటుందని, ప్రత్యేకంగా డేమోగ్రాఫిక్ అప్ డేషన్(అడ్రస్,మొబైల్ నెంబర్, డేట్ ఆఫ్ బర్త్, పేరు...) 50 రూపాయల రుసుము చెల్లించాలని కలెక్టర్ తెలిపారు. నూతనంగా ఆధార్ కార్డు పొందేందుకు కావాల్సిన ధృవ పత్రములు మీసేవ ద్వారా అడ్రస్ తో జారీ చేయబడిన బర్త్ సర్టిఫికెట్ , తల్లి లేదా తండ్రి అప్ డేట్ చేసిన ఆధార్ కార్డు మరియు ఆధార్ కార్డులో అడ్రస్ మార్పు కోసం ఓటర్ ఐడి లేదా పాస్ పోర్ట్ లేదా నివాస సర్టిఫికెట్, బ్యాంకు పుస్తకం/ పోస్టల్ బుక్ తో సహా అటెస్టెడ్ దరఖాస్తు ఫారం ఉండాలని, ఆధార్ కార్డు లో పేరు అక్షరాల సవరణ,పొరపాట్ల సవరణకు ఓటర్ ఐడి లేదా పాస్ పోర్ట్ లేదా పాన్ కార్డు లేదా ఎస్.ఎస్.సి మార్కుల మెమో లేదా డ్రైవింగ్ లైసెన్స్ లేదా మైనర్ ఐతే బర్త్ సర్టిఫికెట్ ఉండాలని, పెళ్లి తర్వాత పేరు మార్పు కోసం సబ్ రిజిస్టర్ జారీ చేసిన మ్యారేజ్ సర్టిఫికెట్ , పెళ్లి ఫోటో, ఇతర గుర్తింపు కార్డులు ఉండాలని, పూర్తిగా పేరు మార్పు కోసం గెజిట్ చేసి ఉండాలని,ఆధార్ కార్డు లో డేట్ అఫ్ బర్త్ కరెక్షన్ కోసం బర్త్ సర్టిఫికెట్ , 21 సంవత్సరాల పైబడిన వారికి ఫోటో తో కూడిన మార్కుల మెమో లేదా ఇండియన్ పాస్ పోర్ట్ ఉండాలని అన్నారు. ఆధార్ కార్డులో సవరణలు లేదా కొత్త ఆధార్ కార్డు దరఖాస్తు కొరకు తమ ఒరిజినల్ ధ్రువ పత్రములు తప్పని సరిగా తీసుకొని రావాలని, కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసే ఆధార్ సవరణ మరియు నూతన ఆధార్ కార్డును ప్రజలు, ఉద్యోగులు వినియోగించుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# మనం ప్రత్యేక కథనంపై ప్రముఖుల ఆసక్తి



**సంగారెడ్డి, ఆగస్టు 2(మనం ప్రతినిధి):** తెలంగాణ కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన జనహిత పాదయాత్రలో భాగంగా కాంగ్రెస్ పార్టీ నేతల సంచారం, జన సందోహం, భారీగా తరలి వస్తున్న జన అభిమానంపై మనం దిన పత్రిక ప్రత్యేక కథనాల్ని ప్రచురిస్తున్నది. అయితే, ఆయా కథనాల్ని మంత్రి దామోదర రాజనర్సింహా, మిగతా ప్రముఖ నేతలు ఎంతో ఆసక్తిగా శనివారం సంగారెడ్డి, నిజామాబాద్‌లలో నిర్వహించిన పాదయాత్రలో చదివారు. కాగా, ఆగస్టు ఒకటి, రెండో తేదీలలో ప్రచురితమైన మనం పత్రిక ప్రత్యేక కథనాన్ని శనివారం నాడు మంత్రి దామోదర్ రాజనర్సింహా, సీడీఆర్ ట్రస్ట్ చైర్మన్ త్రిషా రెడ్డి, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యుడు సురేష్ శేఖర్ లు ఎంతో అభిమానంతో వారి ఫొటోలను చూసుకుంటూ మనం అందించిన ప్రత్యేక కథనాల్ని చదివారు.





# విద్యార్థి దశలోని నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి



- ఏఐసీసీ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్

**సంగారెడ్డి, ఆగస్టు 2(మనం ప్రతినిధి):** సంగారెడ్డి జిల్లాలో చేపట్టిన జనహిత పాదయాత్ర కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి జిల్లా ఆందోల్ నియోజకవర్గం లో జోగిపేట లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఏఐసీసీ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజ్యం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌తో కలిసి కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం, విద్యార్థినీ విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు.

అక్కడి విద్యార్థులను ఆమె నేరుగా వారి అభిప్రా యాలను అడిగి తెలుసుకున్నారు. కొంతమంది విద్యార్థులు ఇంజనీర్ డాక్టర్ లాయర్ కలెక్టర్లు అవుతామని చెప్పడంతో ఇక్కడున్న ఏ ఒక్క విద్యార్థులు కూడా రాజకీయాల్లోకి ఎందుకు రాకూడదని వారిని ప్రశ్నించారు. విద్యార్థులు విద్యార్థి దశలోని రాజకీయ లక్షణాలను అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు.

# కాంగ్రెస్ నాయకులను విమర్శిస్తే సహించం

- కాంగ్రెస్ నాయకుడు అత్తు ఇమామ్

**సిద్దిపేట, ఆగస్టు 02(మనం ప్రతినిధి):** కాంగ్రెస్ నాయకులను విమర్శిస్తే సహించేది లేదని కాంగ్రెస్ నాయకుడు అత్తు ఇమామ్ అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో అవినీతి రాజ్యమేలిందని, ఒక వైపు బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లే బహిరంగంగా విమర్శిస్తుంటే అవినీతి ఎక్కడ జరిగిందో ఆలోచించడం మాని పదే పదే కాంగ్రెస్ నాయకులపై విమర్శలు చేస్తుండడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పార్టీలకు అతీతంగా అన్ని వార్డులకు నిధులను మంజూరు చేసిందని, అవసరమైన మరిన్ని నిధులను జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకట్ స్వామి సహకారంతో తీసుకువచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. మున్సిపల్‌కు వచ్చిన నిధులను కాంగ్రెస్ కౌన్సిలర్లు ఉన్న వార్డులకు కేటాయించకుండా వివక్ష చేస్తున్నారని తీరు మార్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్యాదరి మధు, గయజుద్దీన్, అర్షద్, బాబా పాల్గొన్నారు.

# డ్రగ్స్ మహమ్మారిని తరిమికొడుదాం

- మత్తుతో జీవితాలు చిత్తు
- ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన
- సిద్దిపేట వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్




**సిద్దిపేట అర్బన్, ఆగస్టు 02(మనం న్యూస్):** యువత భవిష్యత్తును నాశనం చేసే, సమాజాన్ని తప్పుదోవ పట్టించే డ్రగ్స్ మహమ్మారిని తరిమికొడుదామని సిద్దిపేట వన్ టౌన్ ఇన్ స్పెక్టర్ వాసుదేవరావు, ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. శనివారం సిద్దిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు డ్రగ్స్, గంజాయి, ఇతర మత్తు పదార్థాల గురించి, ట్రాఫిక్ నిబంధనల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని, చదువుకోవడం ద్వారా అనేక ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. చెడు వ్యసనాలకు బానిస కావద్దని, వీటి ద్వారా భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు.

ముందుగా ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని అందుకు అనుగుణంగా చదువుతూ ముందుకు సాగాలన్నారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ మాదక ద్రవ్యాల నిర్మూలనలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా రోడ్డుపై వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా నిర్దిష్ట వేగంతోనే వెళ్లాలని, రోడ్డు ప్రమాదాలకు కారణం, కావద్దని సూచించారు. తల్లిదండ్రులు మైనర్ పిల్లలకు వాహనాలు ఇచ్చినట్లయితే, వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ, అధ్యాపకులు విజయ భాస్కర్, ఫాతిమ, ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని ఉద్యోగాలిచ్చింది?



- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మేరుగు మహేష్

**సిద్దిపేట, ఆగస్టు 02(మనం ప్రతినిధి):** జాబ్ క్యాలెండర్ విడుదల చేసి క్రమం తప్పకుండా ఉద్యోగాలిస్తామని గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కార్ ఇప్పటి వరకు ఎన్ని ఉద్యోగాలిచ్చిందో శ్వేతపత్రం విడుదల చేయాలని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మేరుగు మహేష్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మేరుగు మహేష్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఉద్యోగాల భర్తీ అంటూ నిరుద్యోగుల్లో ఆశలు పెంచి గద్దెనెక్కాక ఉద్యోగాల భర్తీ అనే మాటే మర్చిపోయారని ఆరోపించారు.

ఇచ్చిన మాట ప్రకారం జాబ్ క్యాలెండర్ విడుదల చేయకుండా నిరుద్యోగులను వంచించినందుకు గాను ఆదివారం నుండి నిరుద్యోగులతో కలిసి ప్రభుత్వానికి పిండ ప్రదాన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ అగ్రనేత, రాహుల్ మొదలుకొని సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్సీ కోదండరామ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ లు నిరుద్యోగులను వంచిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో టిఆర్ఎస్.వి. జిల్లా అధ్యక్షులు రెడ్డి యాదగిరి, ఆయా మండలాల అధ్యక్షులు గుజ్జ రాజు, నరేష్, కమల్, ఖాను చందర్, శ్రీకాంత్ తదితరుల పాల్గొన్నారు.




- కరోనా అనేక మార్పులు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు

# మిత ఆహారం.. అమితమైన ఆరోగ్యం

**సిద్దిపేట, ఆగస్టు 02(మనం ప్రతినిధి):** అభివృద్ధి అంటే నాలుగు రోడ్లు, స్టేడియాలు, కాలేజీలు నిర్మించడమమే కాదని, ప్రజల జీవన ప్రమాణాలు మారినప్పుడే అసలైన అభివృద్ధి అని బలంగా నమ్ముతానని రాష్ట్ర మాజీ, మంత్రి, సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని విపంచి కళా నిలయంలో జరిగిన మహిళా యోగ పోటీల కార్యక్రమంలో హరీష్ రావు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల అత్యంత క్రమశిక్షణ అవసరమని కరోనా ప్రపంచానికి నేర్పించిందని, కరోనా ప్రజల జీవితాల్లో అనేక మార్పులు తీసుకువచ్చిందన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని పెద్దలు చెప్పిన మాట అక్షర సత్యమని, ఆహార క్రమశిక్షణ పాటించకుండా అనారోగ్యాల పాలై ఆసుపత్రుల్లో లక్షలు ఖర్చు చేసే కంటే ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు మంచి నడవడిక కలిగి ఉండాలన్నారు. యోగ మనిషి జీవన శైలిని సమూలంగా మారుస్తుందని, ఒత్తిడిని దూరం చేయడమే కాకుండా శరీరాన్ని రోగాల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండేందుకు ఉపకరిస్తుందన్నారు. జంక్ ఫుడ్ జోలికి వెళ్లకుండా మిత ఆహారాన్ని అలవర్చుకుంటే అమితమైన ఆరోగ్యం సొంతమవుతుందన్నారు. పిల్లలను గేమ్స్ వైపు దృష్టి సారించేలా చేయాలని, ఆరోగ్య సిద్దిపేటే అంతిమ లక్ష్యమని, అందుకోసం తన సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లు వేగంగా పూర్తి చేయాలి

- మెనూ ప్రకారమే భోజనం అందించాలి
- జిల్లా అదనపు కలెక్టర్ గరీమ అగ్రవాల్



**సిద్దిపేట అర్బన్, ఆగస్టు 02(మనం న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలని సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. శనివారం నాడు సిద్దిపేట పట్టణంలోని 9, 13 వార్డులలో పర్యటించి ఆయా వార్డుల్లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా వీలైనంత త్వరగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను నాణ్యతతో పూర్తి చేయాలని మున్సిపల్, హౌజింగ్ అధికారులకు ఆదేశించారు. అనంతరం కేసీఆర్ నగర్ లోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని, స్టోర్ రూమ్ లోని వంట సరుకులను పరిశీలించారు. విద్యార్థులకు తప్పనిసరిగా మెనూ ప్రకారమే ఆహారాన్ని అందించాలని, వంట గదిని పరిశుభ్రంగా ఉంచాలని ప్రిన్సిపల్ ను ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. అదేవిధంగా స్థానికంగా ఏర్పాటు చేసిన లైబ్రరీని విద్యార్థులు, యువకులు సద్వినియోగం చేసుకొని పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని, పోటీ పరీక్షలకు అవసరమైన అన్ని పుస్తకాలను అందుబాటులో ఉంచాలని లైబ్రరీ నిర

# మంత్రి కొండా సురేఖకు బిగ్ షాక్

- క్రిమినల్ కేసు నమోదుకు నాంపల్లి కోర్టు ఆదేశం



**హైదరాబాద్, మనం ప్రతినిధి:** మంత్రి కొండా సురేఖకు నాంపల్లి కోర్టు షాక్ ఇచ్చింది. మంత్రిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆదేశించింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు దాఖలు చేసిన పరువు నష్టం కేసులో కోర్టు ఆదేశాలు ఇచ్చింది. గత కొద్ది రోజుల క్రితం మంత్రి కొండా సురేఖ, ఫోన్ ట్యాపింగ్ కేసు, డ్రగ్స్ వ్యవహారం, నటి సమంత విడాకుల అంశంలో కేటీఆర్‌పై ఆరోపణలు చేశారు. ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో పెద్ద దుమారాన్నే లేపాయి. తనపై చేసిన ఆరోపణలు నిరాధారమైనవని, తన పరువుకు భంగం కలిగించేలా ఉన్నాయని భావించిన కేటీఆర్, కొండా సురేఖపై నాంపల్లి కోర్టులో పరువు నష్టం దావా దాఖలు చేస్తూ.. ఆయన కోర్టును ఆశ్రయించారు. సెక్షన్ 356 కింద పరిగణనలోకి తీసుకున్న నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టు, ప్రాథమిక సాక్ష్యాలను పరిశీలించిన నేపథ్యంలో కొండా సురేఖపై ఆగస్టు 21లోగా క్రిమినల్ కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించింది. ఈ తీర్పు తెలంగాణ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రాజకీయ నాయకులు పరువు నష్టం దావాలను ఎదుర్కోవడం కొత్తేమీ కానప్పటికీ.. క్రిమినల్ కేసు నమోదుకు ఆదేశించడం అరుదైన పరిణామమే అని చెప్తున్నారు.

### స్పందించిన కొండా సురేఖ

అయితే, తనపై కేసు, నోటీసులు విషయంలో మంత్రి కొండా సురేఖ స్పందించారు. కోర్టు ఆదేశాలపై తనకు ఇంకా ఎలాంటి సమాచారం అందలేదని.. నోటీసులు అందిన తర్వాత స్పందిస్తానని ఆమె వెల్లడించారు.

# గప్పాలే తప్పా?... తెలంగాణకు 50 పైసలు తేలేదు?

- తెలంగాణ ప్రజల జేబులు కొట్టి ఢిల్లీకి కప్పం కడుతుండ్రు?
- ఎక్కే ఫ్లైట్ దిగే ఫ్లైట్‌లో అర్ధశతకం పూర్తి అయిందని ఏద్దేవా
- కేసీఆర్ మల్లెపువ్వులా తిరిగి వస్తారు: జగదీష్ రెడ్డి



**హైదరాబాద్, మనం ప్రతినిధి:** తన గప్పాలతో నీతులు వల్లించే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ నుంచి రాష్ట్రానికి 50 పైసలు కూడా తేలేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి విమర్శించారు. ఇప్పటి వరకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం రూ.5 లక్షల కోట్లు ఖర్చు చేసింది. ఇందులో 2లక్షల కోట్ల అప్పు ఉందని ఆయన ఆరోపించారు. ఈ సందర్భంగా శనివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మీడియా మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ఎక్కే ఫ్లైట్ దిగే ఫ్లైట్‌లో అర్ధశతకం పూర్తి అయిందని ఏద్దేవా చేశారు. దాదాపు 50 వేల కోట్లు ఢిల్లీకి మూటలు సమర్పించారని మోదీ గతంలో అన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఏటీఎం అయిందన్నారు. కేసీఆర్ పదేళ్ల కాలంలో పదిసార్లు ఢిల్లీకివెళ్తే?... రేవంత్ రెడ్డి 20 నెలల కాలంలో నెలకు రెండు సార్లకు పైగా ఢిల్లీకి వెళ్లారని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి, మంత్రులు గప్పాలు కొట్టడంలో ఆరితేరారు. రైతుల మోటర్లు కాలిపోతున్నాయి. ఎక్కడా ఎరువుల కొరత లేదని మంత్రులు నిస్సిగ్గుగా చెప్తున్నారని మండిపడ్డారు. ఇందిరమ్మ రాజ్యం అంటే గొప్పగా ఉంటుందని జనం నమ్మి ఓట్లు వేశారు . ఎమర్జెన్సీ రోజుల్లో ఉన్న పరిస్థితులు మళ్లీ వచ్చాయి అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇష్టంవచ్చినట్లు సోషల్ మీడియాను వాడుకుని మా ప్రభుత్వంపై బురదచల్లారు. ఇప్పుడు మీడియాను చూస్తే భయపడుతున్నారు. గతంలో ఇష్టమైన ప్రాంతం అశోక్ నగర్ అని అన్నారు. ఇప్పుడు అశోక్ నగర్ అంటే రేవంత్ రెడ్డికి భయంపుడుతుందన్నారు. ప్రియాంక గాంధీ వచ్చి స్కూటీ ఇస్తుందని చెప్పారు. రేవంత్ రెడ్డి మూర్ఖత్వానికి పరాకాష్ట. నోటికి వచ్చినట్లు బూతులు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం గురించి జాగ్రత్తగా రాయాలని కోరుతున్నా. తెలంగాణ నుంచి ఎందుకు సడెన్‌గా పైసలు మాయమయ్యాయి? అని ప్రశ్నించారు. తెలంగాణలో ఉండాల్సిన రూ.50వేల కోట్లు ఢిల్లీకి వెళ్లాయని దుయ్యబట్టారు. తెలంగాణ ఆర్థిక, పారిశ్రామిక రంగం, రియల్ ఎస్టేట్ రంగం కోమాల్లోకి వెళ్లాయన్నారు. తెలంగాణ ప్రజల జేబులు కొట్టి ఢిల్లీకి కప్పం కడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు ఎంపీ లింగయ్య యాదవ్, ఎన్.భాస్కర్ రావు, రవీంద్ర కుమార్, బీఆర్ఎస్ నేతలు చింతల వెంకటేశ్వర్ రెడ్డి, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరు దైవ భక్తిని అలవర్చుకోవాలి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు




**సిద్దిపేట, ఆగస్టు 02(మనం ప్రతినిధి):** ప్రతి ఒక్కరు దైవ భక్తిని కలిగి ఉండాలని, అప్పుడే మనస్సు ప్రశాంతంగా ఉంటుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. శనివారంనాడు జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో నూతనంగా నిర్మిస్తున్న అన్నదాన భవనానికి అవసరమైన గ్రానైట్ ను విరాళంగా అందిస్తానన్నారు. శ్రావణ మాసం సందర్భంగా ఆలయంలో పూజలు నిర్వహించి నిర్మాణ పనులు పరిశీలించారు. అన్నదాన భవనానికి అవసరమైన గ్రానైట్ ను విరాళంగా అందిస్తానన్నారు.

### సంతోషి మాత ఆలయంలో పూజలు

సంతోషి మాత ఆలయ వార్షికోత్సవం సందర్భంగా హరీష్ రావు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆడపడుచులకు అత్యంత ప్రీతిపాత్రమైన శ్రావణమాసం సందర్భంగా సంతోషిమాత దేవాలయంలో వివిధ రకాలైన ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తుండడం సంతోషకరమన్నారు.

### అన్నపూర్ణ దేవాలయం పరిశీలన

పట్టణంలోని శ్రీ అన్నపూర్ణ దేవాలయ అన్నదాన భవన నిర్మాణ పనులను మాజీమంత్రి హరీష్ రావు పరిశీలించారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.15 లక్షలను కేటాయించామని, ఆలయాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందిచేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటానన్నారు.

# భద్రాద్రి జిల్లాకు రాష్ట్ర స్థాయి సంపూర్ణత అభియాన్ అవార్డ్

### గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న జిల్లా కలెక్టర్ కలెక్టర్ జితేష్ వి. పాటిల్



**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్ 02 (మనంప్రతినిధి):** వెనుకబడిన జిల్లాల ప్రగతికి కేంద్ర ప్రభుత్వం, నీతి ఆయోగ్ తీసుకొచ్చిన సంపూర్ణత అభియాన్ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభివృద్ధి సూచికలన్నింటినీ సమర్థంగా సాధిస్తూ రాష్ట్ర స్థాయిలో ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా రాజ్ భవన్లో నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవంలోరాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, రాష్ట్ర రవాణా శాఖ మరియు బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ కు అవార్డు ప్రధానం చేశారు. నీతి అయోగ్ ఆకాంక్షిత జిల్లాల అభివృద్ధిలో భాగంగా విద్య, ఆరోగ్యం, వైద్యం, వ్యవసాయం, మౌలిక వసతులు, సామాజిక సంక్షేమం వంటి ఆరు ముఖ్య సూచికలపై 100 శాతం అభివృద్ధి లక్ష్యంగా సంపూర్ణత అభియాన్ కార్యక్రమం చేపట్టబడింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఈ ఆరు సూచికలలో మూడు సూచికలపై శాతం సంపూర్ణత సాధించి రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందింది. అంతేకాక, గుండాల మండలం బ్లాక్ స్థాయిలో ఐదు సూచికలను విజయవంతంగా పూర్తి చేసి ఆకాంక్షిత బ్లాక్లలో అగ్రస్థానంలో నిలిచింది. నీతి ఆయోగ్ అధికారి బృందాలు చేసిన సమీక్షల ఆధారంగా జిల్లా స్థాయిలో భద్రాద్రి కొత్తగూడెం ను అవార్డు కోసం ఎంపిక చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ గారు మాట్లాడుతూ ఈ అవార్డు రావడం జిల్లాలోని అధికార యంత్రాంగం, మండల అధికారులు, గ్రామస్థాయి సిబ్బంది మరియు ప్రజల చొరవకు గుర్తింపుగా నిలిచిందని అన్నారు. ప్రతి గ్రామానికీ అభివృద్ధి కల్పించాలన్న సంకల్పంతో అన్ని శాఖలు సమన్వయంతో పని చేశాయని, ప్రతి సూచికపై కట్టుదిట్టమైన కార్యాచరణ ప్రణాళికతో ముందుకెళ్లడం వల్లే ఈ విజయం సాధ్యమైందని తెలిపారు. ఈ అవార్డు మాకు మరింత బాధ్యతను పెంచిందన్నారు. అభివృద్ధిలో స్థిరత్వం ఉండాలంటే ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకం. ముందుగానే ప్రణాళికలు రూపొందించి, సమర్థవంతంగా అమలు చేస్తే మరింత ప్రగతి సాధించవచ్చన్నారు. భవిష్యత్తులో జిల్లా మరిన్ని రంగాల్లో ఆదర్శంగా నిలబడేలా చర్యలు కొనసాగుతాయని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు.

# బాలల సదనం పిల్లలందరూ జీవితంలో గొప్ప స్థాయికి ఎదగాలి

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- చిన్నారులకు ఇస్రో ల్యాబ్ సందర్శనార్థం టూర్ కు ప్రణాళిక సిద్ధం చేయాలి
- బాల సదనంలోని పిల్లలకు ఆరోగ్య శ్రీ కార్డులు పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్



**ఖమ్మం, ఆగస్టు 2(మనం న్యూస్):** బాలల సదనంలో ఉన్న పిల్లలందరూ జీవితంలో గొప్ప స్థాయికి ఎదగాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శనివారం ఖమ్మం నగరంలోని బాల సదనాన్ని కలెక్టర్ సందర్శించారు. బాలల సదనంలో సుందరీకరించిన ప్రాంగణాన్ని, వాలీబాల్, షటీల్ కోర్టు వద్ద ఆడుకునే ప్రదేశంలో రాళ్లు లేకుండా చూడాలని, ఇంకా మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. శిశుగృహలోని పసిపాపలతో కలెక్టర్ కాసేపు సరదాగా గడిపారు. బాలల సదనంకు అర్హులు ఎవరైనా పిల్లల దత్తత కోసం దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ పిల్లలను దత్తత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. శిశు గృహలో సంవత్సరం నిండిన చిన్నారి బర్త్ డే సందర్భంగా చిన్నారితో కలిసి జిల్లా కలెక్టర్ కేక్ కట్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, సి.డబ్ల్యూ.సి చైర్ పర్సన్ భారతరాణి లతో కలిసి కలెక్టర్ బాలల సదనం పిల్లలకు ఆరోగ్య శ్రీ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ పిల్లలకు ఆరోగ్యశ్రీ కార్డులు అందించడం ద్వారా భవిష్యత్తులో ఏదైనా అనారోగ్య పరిస్థితులు వస్తే ఆసుపత్రిలో మంచి వైద్యం ఉచితంగా అందుబాటులో ఉంటుందని అన్నారు. ప్రభుత్వం 10 లక్షల వరకు వైద్యానికి చెల్లిస్తుందని, ఆరోగ్య శ్రీ కార్డు జీవితాంతం ఉపయోగపడుతుందని అన్నారు. బాల సదనంలో ఉన్న ప్రతి ఒక్క పిల్లవాడికి సంబంధించి డాక్యుమెంట్, ఇతర రికార్డులు జాగ్రత్తగా లాకర్ లో భద్రపర్చాలని అన్నారు. బాల సదనం నుంచి వెళ్ళే సమయంలో పిల్లలకు వారి డాక్యుమెంట్లు పూర్తిగా ఒక ఫోల్డర్ లో పెట్టీ అందించాలని అన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో కష్టాలు ఉంటాయని, వాటిని ధైర్యంగా ఎదుర్కొని పోరాడాలని, మనం భయపడితే కష్టం ఇంకా భయపెడు తుందని, ధైర్యంగా ఉంటే మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. చదువుతో మనకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అన్నారు. ప్రభుత్వం అందించే సదుపాయాలను సద్వినియోగం చేసుకుంటూ ప్రతి ఒక్కరూ ఉన్నత స్థాయికి ఎదగాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అవసరమైన వసతుల కోసం ప్రతిపాదనలు అందించాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం నగరంలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భవనాలను రెనోవేట్ చేస్తూ అక్కడ కౌన్సెలింగ్ చేసేలా ఏర్పాట్లు చేయాలని అన్నారు. బాలల సదనంలోని పిల్లలకు ఇస్రో ల్యాబ్ సందర్శనార్థం టూర్ వెళ్లేలా ప్రణాళిక తయారు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.సి.డబ్ల్యూ.సి. చైర్ పర్సన్ భారత రాణి మాట్లాడుతూ ఖమ్మం జిల్లాకు మంచి మనస్సు ఉన్న కలెక్టర్ లు రావడం మన అదృష్టం అని అన్నారు. యూ.పి.ఎస్.సి. పబ్లిక్ పరీక్షలో జిల్లా కలెక్టర్ ఆల్ ఇండియా మొదటి ర్యాంకు సాధించారని, కలెక్టర్ ను ఆదర్శంగా తీసుకొని పిల్లలు జీవితంలో గొప్ప స్థాయికి ఎదగాలని అన్నారు.పిల్లలు జీవితంలో గొప్ప స్థాయికి చేరుకోవాలంటే చదువు ఒక్కటే మార్గమని, బాలసదనంలో ఉన్న ప్రతి ఒక్కరూ బాగా చదువుకోవాలని ఆమె సూచించారు. ప్రతి ఒక్కరూ సమాజానికి మేలు చేసేలా తయారు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కె. రాంగోపాల్ రెడ్డి, సి.డి.పి.ఓ., డిసిపిఓ విష్ణువందన, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి పేదవాడికి దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు

- అంతర్గత సిసి రోడ్ల ప్రారంభోత్సవంలో పాల్గొన్న
- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**మణుగూరు, ఆగస్టు 2(మనం న్యూస్):** మణుగూరు మండలం సమితి సింగారం గ్రామపంచాయతీ పరిధిలో మంజూరైన 80 ఇళ్లకు గాను నాలుగు కోట్ల రూపాయల వ్యాయంతో నిర్మిస్తున్నటువంటి ఇందిరమ్మ ఇళ్ల భూమి పూజలో పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు .ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. అర్హులైన ప్రతి పేదవాడికి దశలవారీగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని తెలిపారు. మంజూరు అయిన ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులకు నాలుగు దఫాలుగా తమ ఖాతాలోకి డబ్బులు పడతాయని ఈ సందర్భంగా తెలిపారు. మంజూరైనటువంటి లబ్ధిదారులు ఇందిరమ్మ ప్రభుత్వానికి ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపారు.

**40 లక్షల రూపాయల విలువ గల సిసి రోడ్లు ప్రారంభం**

మణుగూరు మండలం సమితి సింగారం గ్రామపంచాయతీ పరిధిలో సుమారు 40లక్షల రూపాయల తో నిర్మించిన సీసీ రోడ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పినపాక ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ మీరు ఎన్నుకున్న ఈ ఇందిరమ్మ ప్రభుత్వం, పేదవాడి ప్రభుత్వం అహర్నిశలు అభివృద్ధి సంక్షేమం వైపే నడుస్తుందన్నారు. పదేళ్ల ఏలుబడిలో కొత్త రేషన్ కార్డులు ఊసే లేదని, రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్క అర్హుడికి ఆరు కేజీల సన్న బియ్యం పథకం దేశానికి ఆదర్శమని, 200 యూనిట్ల కరెంటు, మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, రైతుబంధు, రైతు బీమా, వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇలా ఎన్నో చెప్పుకోదగ్గ పథకాలను ప్రవేశపెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో ముందుకు వెళ్తుందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నరేష్ ,ఎంపీడీవో శ్రీనివాసరావు, ప్రభుత్వ అధికారులు, మండల అధ్యక్షులు పిరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, మహిళా మండల అధ్యక్షురాలు సౌజన్య, పినపాక నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తరుణ్ రెడ్డి, మండల నాయకులు సుబ్బారెడ్డి, గాండ్ల సురేష్ , గణేష్ రెడ్డి, కొమరం రామ్మూర్తి, సాంబశివరావు, తమ్మిశెట్టి సాంబ, మండల ముఖ్య నాయకులు కార్యకర్తలు స్థానికులు పాల్గొన్నారు

# పెండింగ్ భూ సమస్యల పరిష్కారానికి చర్యలు



- అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి

**ఎర్రుపాలెం, ఆగస్టు 02(మనం న్యూస్):** పెండింగ్ భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు. ఎర్రుపాలెం మండలం తహసిల్దార్ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్, శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి శ్రీనివాస్ రెడ్డి ములుగుమాడు రీ సర్వే ప్రక్రియ, రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన భూ సమస్యల దరఖాస్తుల స్థితిగతులు, భూ భారతి పోర్టల్ తదితర అంశాలపై చర్చించి పలు సూచనలు చేశారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన భూ సమస్యల దరఖాస్తులపై నోటీసులు జారీ చేసి భూ భారతి చట్టం నిబంధనల ప్రకారం వాటి పరిష్కారానికి కృషి చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎర్రుపాలెం మండల తహసీల్దార్ ఉషా శారద, అధికారులు, పాల్గొన్నారు.

# పోలీసు అధికారులతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సమీక్ష



**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్ 02 (మనం ప్రతినిధి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోర్టు ప్రాంగణంలోని సమావేశ మందిరంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్, శనివారం జిల్లా పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ మాట్లాడుతూ, జైలులో ఉన్న ముద్దాయిల కేసులను దశలవారీగా , రోజువారిగా సాక్ష్యాలు ప్రవేశపెట్టి అంతిమ తీర్పులకు సహకరించాలని, వారెంట్లు ఉన్న పెండింగ్ కేసులు వెంట వెంటనే అమలు పరచాలని తెలిపారు. పాత పెండింగ్ కేసులలో సాక్ష్యాలను తీసుకొని రావాలని, నూతనంగా నమోదైన కేసులలో వెంటనే ఛార్జ్ షీట్స్ దాఖలు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జి ఎస్. సరిత, ,ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కే. కిరణ్ కుమార్ , జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రెటరీ ఏం. రాజేందర్ ,అదనపు సీనియర్ సివిల్ జడ్జి కర్నాటి కవిత, రెండవ అదనపు జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ బి. రవి కుమార్, జిల్లా ఎస్పీ బిరుదు రాజు రోహిత్ రాజు , ఏ.ఎస్పీ .విక్రమ్ కుమార్ సింగ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్, ఏ పి పి లు,జిల్లాలోని డిఎస్పీలు, సర్కిల్ ఇన్స్పెక్టర్లు ,సబ్ ఇన్స్పెక్టర్లు ఫారెస్ట్ అధికారులు ,ఎక్సైజ్ అధికారులు, ఆర్ అండ్ బి అధికారులు, కోర్టు నోడల్ ఆఫీసర్, కోర్టు లైజాన్ ఆఫీసర్లు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థుల వైద్య సంరక్షణ కోసం వైద్యశాల సౌకర్యం



**ఖమ్మం, ఆగష్టు 2(మనం న్యూస్):** శ్రీ కృష్ణ ప్రసాద్ మెమోరియల్ పోలీస్ సంక్షేమ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల వైద్య సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన (ఇన్ఫర్మేరీ రూమ్) వైద్యాశాల గదిని పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌తో కలసి స్కూల్ చైర్ పర్సన్ నిష్టాశర్మ ప్రాభించారు. ఈ సందర్భంగా స్కూల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ పాఠశాలలో నాణ్యమైన విద్యకోసం అందిస్తున్న సదుపాయాలతో పాటు పాఠశాల సమయంలో చిన్న గాయాలు, ఆకస్మిక అనారోగ్య సమస్యలు, మెడికల్ అత్యవసర పరిస్థితులలో విద్యార్థులు ప్రాథమిక వైద్య సహాయం పొందే ముఖ్యమైన సౌకర్యాన్ని స్కూల్ అవరణలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డిసిపి కుమారస్వామి, ఏ ఆర్ ఏసీపీ నర్సయ్య, ఆర్ ఐ కామరాజు, యూనిట్ డాక్టర్ వేణుమాధవ్, స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రాజు పాల్గొన్నారు.

# ప్రతి కార్యాలయంలో 4(1)బి వివరాలు ప్రదర్శించాలి

- ఆర్టిఐ కమిషనర్ పి.వి. శ్రీనివాసరావు
- పారదర్శకంగా సమాచార హక్కు చట్టాన్ని అమలు చేయాలి
- సామాన్యుడు చేతిలో వజ్రాయుధం ఆర్టిఐ చట్టం
- డిఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆర్టిఐ కమిషనర్



**ఖమ్మం, ఆగస్టు 02(మనం బ్యూరో):** ప్రతి కార్యాలయంలో 4(1)బి వివరాలు ప్రదర్శించాలని ఆర్టిఐ కమిషనర్ పి.వి. శ్రీనివాసరావు అన్నారు. కలెక్టరేట్ లోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి కార్యాలయాన్ని సమాచార హక్కు చట్టం కమిషనర్ పీ.వీ. శ్రీనివాసరావు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలోని ఆర్టిఐ సంబంధిత రిజిస్టర్ లను, వచ్చిన దరఖాస్తులను, పంపిన సమాధానాలను పరిశీలించారు. అనంతరం జిల్లా పౌరసంబంధాల అధికారి కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో ఇంటరాక్ట్ అయ్యారు. ఈ సందర్భంగా ఆర్టిఐ కమీషనర్ పి.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంపై గత కొన్ని రోజులుగా నిర్లిప్తత ఏర్పడినట్లు భావం అందరిలో వచ్చిందని, 2 సంవత్సరాల పాటు ఆర్టిఐ కమీషనర్ నియామకం కాకపోవడంతో 17 వేల కేసులు పెండింగ్ ఉన్నాయని అన్నారు. పెండింగ్ కేసులను త్వరగా పరిష్కారం చేయడంతో పాటు అధికారులలో ఉన్న నిర్లిప్తత తొలగించాలనే ఉద్దేశ్యంతో జిల్లాల్లో పర్యటన చేపట్టామని అన్నారు. మెదక్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలో ఇప్పటి వరకు పర్యటించామని అన్నారు. ఆర్టిఐ చట్టంపై జిల్లా అధికారులకు అవగాహన కల్పించామని అన్నారు. నేడు ఖమ్మం జిల్లా వైద్య, ఆరోగ్య అధికారిణి కార్యాలయాన్ని పరిశీలించామని అన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ప్రజా సమాచార అధికారి, సహాయ ప్రజా సమాచార అధికారి, మొదటి అప్పిలేట్ అథారటి ల పేర్లు, ఫోన్ నెంబర్ లతో కూడిన బోర్డు ఏర్పాటు చేయాలని అన్నారు. 2005 పార్లమెంట్ ఆమోదించిన చట్టం ప్రకారం ప్రభుత్వ కార్యాలయంలో 4(1) బి చార్ట్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు అప్ డేట్ చేయాలని, అటువంటి అంశాలను అధికారుల దృష్టికి తీసుకొని వస్తున్నామని అన్నారు. అధికారులు పారదర్శకంగా విధులు నిర్వహించాలని, ఎవరికి భయపడాల్సిన అవసరం లేకుండా ప్రజలు కోరిన సమాచారం నిర్ణీత సమయంలో అందించాలని అన్నారు. ఆర్టిఐ చట్టం ప్రకారం అవగాహనతో అమలు చేస్తే అక్రమాలు తగ్గిపోతాయని అన్నారు. సంతాన సాఫల్య కేంద్రాలలో జరుగుతున్న అక్రమాల గురించి ఇటీవల వార్తలు వస్తున్నాయని, సమాచార హక్కు చట్టం ప్రకారం జిల్లాలో ఎన్ని సంతాన సాఫల్య కేంద్రాలు ఉన్నాయి, వాటి రిజిస్ట్రేషన్ ప్రక్రియ, నిబంధనలు పాటిస్తున్నాయా వంటి సమాచారం ప్రజలు తెలుసుకోవచ్చని అన్నారు. ప్రజలు సమాచారం అధికంగా తెలుసుకోవడం వల్ల జరిగే మోసాల నుంచి తప్పించుకోవచ్చని అన్నారు. సామాన్యుడు చేతిలో వజ్రాయుధం ఆర్టిఐ చట్టం అని అన్నారు. జిల్లా అధికారులు సమాచార హక్కు చట్టాన్ని తప్పనిసరిగా పాటిస్తూ పారదర్శకంగా అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మాకు తిండి పెట్టండి సారూ..

### ఆకలితో అలమటిస్తున్న గిరిజన పాఠశాల విద్యార్థులు



**దమ్మపేట, ఆగస్టు 2 (మనం న్యూస్):** దమ్మపేట మండలం చీపురుగూడెంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో నెల రోజులుగా సరైన తిండి లేక ఆకలితో అలమటిస్తున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుళ్ళిన అరటిపండ్లు ఇస్తున్నారని, భోజనం బాగాలేదని పడేస్తే తిడుతున్నారని ఆరోపించారు. మెనూ ప్రకారం కూడా భోజనం పెట్టడం లేదని, ఎన్నిసార్లు చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. **పిల్లలకు కడుపు నిండా భోజనం అందించాలి : మాజీ ఎమ్మెల్యే మెచ్చా** చీపురు గూడెంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో నెల రోజులుగా సరైన తిండి లేక ఆకలితో అలమటిస్తున్న విద్యార్థులు పెట్టిన వీడియో సోషల్ వీడియోలో వైరల్ కావడంతో మాజీ ఎంఎల్ఏ మెచ్చా నాగేశ్వరరావు స్పందించారు. ప్రభుత్వ బడుల్లో చదువుకునే పేద విద్యార్థులకు సరిగ్గా అన్నం పెట్టడం చేతకాదు కానీ కాంగ్రెస్ నాయకుల జల్సాల కోసం వాళ్ళు తినే ఒక్కో ప్లేటు భోజనానికి లక్షన్నర ఖర్చు చేస్తున్నారని ఆరోపించారు. విద్యా రంగాన్ని నెంబర్ వన్ గా మార్చడం అంటే విద్యార్థుల కడుపులు మాడ్చడనమేనా అంటూ ప్రశ్నించారు. ఈ చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వంలో మాటలే తప్ప మ్యాటర్ ఏమీ లేదన్నారు .పరిపాలన చేతకాకపోతే రాజీనామ చేయాలని డిమాండ్ చేశారు. ఇకనైనా ఆకాశంలో మెడలు కట్టడం మాని నేలపై ఆకలితో అలమటిస్తున్న విద్యార్థుల కడుపులు నింపాలని ఆయన అన్నారు.

# ముగ్గురు మావోయిస్టుల అరెస్ట్

**చర్ల, ఆగస్ట్ 2 (మనం న్యూస్) :** ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లా కేరళపాల్ అటవీప్రాంతంలో ఇద్దరు రివార్డు కలిగిన మావోయిస్టులతో పాటు మొత్తం ముగ్గురిని భద్రతా బలగాలు అరెస్ట్ చేశాయి. అరెస్టయిన వారిలో రెండు లక్షల రివార్డు కలిగిన మిలీషియా కమాండర్ పొడియం నంద, మిలీషియా సభ్యులు హేమ్లా జోగ, హేమ్లా గంగ ఉన్నారు. వీరి వద్ద నుండి మూడు కిలోల బరువున్న రెండు టిఫిన్ బాంబులు, మూడు డిటోనేటర్లు, రెండు మీటర్ల కార్డెక్స్ వైర్, రెండు జిలిటెన్ స్టిక్స్, 18 మీటర్ల విద్యుత్ వైర్, రెండు బ్యాటరీలను స్వాధీన పరుచుకున్నారు. అరెస్ట్ అయిన వారిని కోర్టులో రిమాండ్ చేసారు.

# బసవతారకంలో జర్నలిస్టులకు వైద్య సేవలు అందించండి

- నామాకు టీయుడబ్ల్యూజె (ఐజెయు) వినతి



**ఖమ్మం, ఆగష్టు 2(మనం న్యూస్):** బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలో జర్నలిస్టుల హెల్త్ కార్డు చెల్లుబాటు అయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు జర్నలిస్టులకు వీలైనంత మేర ఉచిత వైద్యం అందెలా చూడాలని టీయుడబ్ల్యూజె (ఐజెయు) ఆధ్వర్యంలో మాజీ ఎంపి బసవతారకం క్యాన్సర్ హాస్పటల్ ట్రస్టీ నామా నాగేశ్వరరావుకు వినతి పత్రం సమర్పించారు. ఇటీవల కాలంలో క్యాన్సర్ సంబంధిత వ్యాధుల బారీన జర్నలిస్టు కుటుంబాలు పడుతున్న నేపథ్యంలో వైద్య ఖర్చులు భరించడం ఇబ్బందికరంగా మారిందని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు. వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించేలా చూడాలని జర్నలిస్టుల హెల్త్ కార్డు చెల్లుబాటయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన నామ ఈ విషయమై క్యాన్సర్ ఆసుపత్రి నిర్వాహకులతో మాట్లాడి జర్నలిస్టులకు బసవతారకం ఆసుపత్రి ద్వారా వీలైనంత మేర జర్నలిస్టు కుటుంబాలకు ఉచితంగా వైద్య సాయం అందించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీయుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాటేటి వేణుగోపాల్, కౌన్సిల్ సభ్యులు సామినేని మురారి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏనుగు వెంకటేశ్వరరావు, మైసా పాపారావు, యూనియన్ నేతలు వనం వెంకటేశ్వర్లు, నలజాల వెంకటరావు, సొసైటీ అధ్యక్షులు కనకం సైదులు, వివిధ పత్రికలు , చానల్స్ బ్యూరోలు, యూనియన్ నేతలు మహేందర్, సత్యనారాయణ, మోహినుద్దీన్, నగర అధ్యక్షులు చెరుకుపల్లి శ్రీనివాస్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నామ పురుషోత్తం, నాయకులు కళ్యాణ్, ఏలూరి వేణుగోపాల్, మేడి రమేష్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఉదండాపూర్ నిర్వాసితులతో రేపు సహపంక్తి భోజనం చేస్తా

- నిర్వాసితులందరికీ ఆదివారం విందు భోజనం
- రాజకీయాలను పక్కన పెట్టి రండి.. కలిసి భోజనాలు చేద్దాం
- ఉదండాపూర్ నిర్వాసితులకు ప్రస్తుతం రూ.175 కోట్లు మంజూరు
- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి స్పష్టీకరణ



జడ్చర్ల, 02ఆగష్టు,(మనం న్యూస్): డిసెంబర్ 9 వ తేదీలోపుగా ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసితులకు సంబంధించిన ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ మొత్తాలను అన్ని కుటుంబాలకు చెల్లించడం జరుగుతుందని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి ప్రకటించారు. ఆదివారం ఉదండాపూర్ నిర్వాసితులందరికీ భోజనాలు పెట్టి ఈ విషయాన్ని చెబుతామని చెప్పారు. తమ హయాంలో ఉదండాపూర్ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద ఇప్పటి వరకు రూ.250 కోట్లు మంజూరు కావడం జరిగిందని వివరించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అనిరుధ్ రెడ్డి మాట్లాడారు. వల్లూరు గ్రామం, తాండాలకు చెందిన ప్రజలు అధికారులకు సహకరించడంతో వారి గ్రామాలకు అవార్డు పాసైయిందని, వారి ఖాతాల్లో ప్రభుత్వం డబ్బులను కూడా జమ చేసిందని చెప్పారు. అయితే ఉదండాపూర్ లో మాత్రం కొంత మంది రాజకీయాలు చేస్తూ ప్యాకేజీపై అభ్యంతరాలు పెడుతూ ఉన్న కారణంగా ఇప్పటి వరకూ అవార్డు కూడా పాస్ కాలేదన్నారు.ఉదండాపూర్ కు చెందిన నిర్వాసితులు అందరూ మంగళవారం కలెక్టరేట్ కు వెళ్లి తమ అభ్యంతరాలన్నింటినీ పరిష్కరించుకోవాలని, ఆ తర్వాత వారికి అవార్డు పాస్ కావడం జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగానే ఒక ప్రశ్నకు బదులిస్తూ, ఉదండాపూర్ ఆర్అండ్ఆర్ ప్యాకేజీ మొత్తాన్ని రూ.25 లక్షలకు పెంచే ప్రతిపాదన ఇంకా ప్రభుత్వ పరిశీలనలో ఉందని, ఇప్పటి వరకూ దాన్ని ప్రభుత్వం తిరస్కరించలేదని స్పష్టం చేసారు. ఈ వారంలోనే దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం ఆర్అండ్ఆర్ ప్యాకేజీ లో రూ.16.30 లక్షలు చెల్లించినా ఆ తర్వాత పరిహారం మొత్తాన్ని పెంచినప్పుడు ఆమేరకు వ్యత్యాస మొత్తాన్ని నిర్వాసితులు అందరికీ ఇవ్వడం జరుగుతుందని అనిరుధ్ రెడ్డి వివరించారు. గత ప్రభుత్వ హయాంలో రాజకీయాలకే ప్రాధాన్యత ఇచ్చిన కారణంగానే ఉదండాపూర్ నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అందడంలో ఆలస్యం జరిగిందని విమర్శించారు. తమ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ఏడాది సెప్టెంబర్ లో రూ.45 కోట్లు, ఈ ఏడాది జనవరిలో రూ.30 కోట్లు, జూలై లో రూ.175 కోట్లు చొప్పున మొత్తం రూ.250 కోట్లు మంజూరు చేయడం జరిగిందని వెల్లడించారు. ఈ మంగళవారం ఉదండాపూర్ నిర్వాసితులు అందరూ కలెక్టరేట్ కు వెళ్లి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ పై తమకు ఉన్న అభ్యంతరాలన్నింటినీ పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ అభ్యంతరాలన్నీ పరిష్కారమై ఉదండాపూర్ కు కూడా అవార్డు పాసైతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అడిగి మరో రూ.200 కోట్లు కూడా ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కోసం తీసుకువస్తానని హామీ ఇచ్చారు. ఉదండాపూర్ నిర్వాసితుల సమస్యపై సానుకూలంగా స్పందిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, డెప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలకు ఈ సందర్భంగానే ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వంలో నిధులు లేని కారణంగా ఉదండాపూర్ రిజర్వాయర్ పనులను పూర్తిగా నిలిపివేసి కర్వెన వరకే చేయాలనే ప్రతిపాదన గతంలో వచ్చినప్పుడు తాను వ్యతిరేకించానని, ఉదండాపూర్ రిజర్వాయర్ పనులు పూర్తి చేసి 8 లక్షల ఎకరాలకు కూడా సాగు నీరు అందించాల్సిందేనని సీఎం రేవంత్ ను కోరామని గుర్తు చేసారు.

**సీఎం కోరిక మేరకు నిర్వాసితులందరికీ భోజనం:**

ఉదండాపూర్ నిర్వాసితుల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా ఉన్నారని చెప్పారు. సీఎం ఈ విషయం గురించి తనకు ప్రత్యేకంగా ఫోన్ చేసారని, డిసెంబర్ 9 లోపుగా ఉదండాపూర్ ఆర్అండ్ఆర్ ప్యాకేజీ బకాయిలన్నింటినీ చెల్లిస్తామని హామీ ఇచ్చారని, ఈ విషయాన్ని ఉదండాపూర్ తో పాటుగా నిర్వాసితులందరికీ తన తరుపున భోజనం పెట్టి చెప్పాలని కోరారని అనిరుధ్ రెడ్డి వెల్లడించారు. సీఎం కోరిన ప్రకారంగానే ఆదివారం రోజున ఉదండాపూర్ నిర్వాసితులందరికీ ఆ గ్రామంలోనే భోజనాలు పెడతామని, తాను కూడా వారితో సహపంక్తి భోజనం చేస్తానని చెప్పారు. తాము పుట్టి పెరిగిన గ్రామాన్ని కోల్పోతున్న నిర్భాగ్యుల కోసం ఏర్పాటు చేస్తున్న ఈ భోజన కార్యక్రమాన్ని రాజకీయాలకు అతీతంగా అందరూ హాజరు కావాలని అనిరుధ్ రెడ్డి ఆహ్వానించారు. ఈ భోజనాల సందర్భంగా తాము ఎలాంటి రాజకీయాలను గురించి మాట్లాడబోనని స్పష్టం చేసారు.

**167వ నెంబర్ హైవేపై మరో సమావేశం**

కాగా జడ్చర్ల మీదుగా వెళ్తున్న జాతీయ రహదారి 167 లో జడ్చర్లలోని పాత బజారు పెద్ద వాహనాలు వెళ్లేందుకు వీలు లేకుండా డిజైన్ ఉందని, ఈ సమస్య పరిష్కరించడానికి జాతీయ రహదారుల శాఖ అధికారులతో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని, రహదారిలో ఉన్న విగ్రహాలను తరలించే విషయంలో ఉన్న సమస్యను కూడా అందరితో కలిసి చర్చించి పరిష్కరించాలని ఇప్పటికే తాను మున్సిపల్ ఛైర్మన్, కౌన్సిలర్లు, కమీషనర్ ను కోరామని మరో ప్రశ్నకు బదులుగా అనిరుధ్ రెడ్డి చెప్పారు. తాను చదువుకున్న వాడినని తన వద్ద దొంగ డిగ్రీలు లేవని, అందుకే ఈ విషయంలో ఎవరో చేసిన వాఖ్యలపై తాను స్పందించబోనని స్పష్టం చేసారు. జడ్చర్ల బైపాస్ రోడ్ విషయం గురించి కూడా అధికారిక డీపీఆర్ తర్వాత స్పష్టత వస్తుందని అనిరుధ్ రెడ్డి పేర్కొన్నారు.

# విద్య, వైద్య రంగాల బలోపేతానికి ప్రభుత్వం చర్యలు

## రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి గడ్డం వివేకానంద



మంచిర్యాల, ఆగస్టు 2 (మనంప్రతినిధి): రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలను బలోపేతం చేసి అన్ని ప్రభుత్వ పాఠశాలలలో సకల సదుపాయాలతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. శనివారం జిల్లాలోని మందమర్రి మండలం రామకృష్ణాపూర్లోని కాకతీయ కాలనీలో ఆధునీకరించిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య లతో కలిసి ప్రారంభించి విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు అందించిన అనంతరం పాఠశాల ఆవరణలో వన మహోత్సవం-2025 కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన రేషన్కార్డుల పంపిణీ కార్యక్రమంలో మండల తహశిల్దార్ సతీష్ కుమార్, క్యాతన్పల్లి మున్సిపల్ కమీషనర్ రాజు లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ మనిషి జీవితంలో విద్యకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, ప్రతి ఒక్కరు చదువుకోవాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలో త్రాగునీరు, విద్యుత్, మూత్రశాలలు ఇతర సదుపాయాలు కల్పించి నిష్ణాతులైన ఉపాధ్యాయులను నియమించి నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యా రంగ అభివృద్ధిలో భాగంగా రాష్ట్రంలోని ఒక్కొక్క నియోజకవర్గంలో 200 కోట్ల రూపాయలతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, చెన్నూర్ నియోజకవర్గ పరిధిలోని సోమనపల్లిలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ను ఏర్పాటు చేయం జరిగిందని తెలిపారు. అర్హులైన నిరుపేదలకు గూడు కల్పించాలని ఉద్దేశంతో ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని, సొంత స్థలం కలిగి ఉండి అర్హత గల వారికి ఇందిరమ్మ ఇండ్ల పథకం వర్తింపజేసి ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి 3 వేల 500 ఇండ్ల చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 4 లక్షల 50 వేల ఇండ్లు అందించడం జరుగుతుందని, ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి ప్రభుత్వం ఉచితంగా ఇసుకను అందిస్తుందని తెలిపారు. మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం జరిగిందని, ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని ఏ ప్రాంతానికైనా మహిళలు ఉచితంగా ప్రయాణించే సౌకర్యం కల్పించామని తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకంలో 5 లక్షల రూపాయల పరిమితిని 10 లక్షల రూపాయలకు పెంచడంతో మరిన్ని రకముల వైద్య సేవలను అందించడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన లబ్దిదారులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకే రాయితీ గ్యాస్ సిలిండర్, ప్రజా పంపిణీ వ్యవస్థలో చౌక ధరల దుకాణాల ద్వారా తెల్ల రేషన్ కార్డుదారులందరికీ 3 నెలలకు సరిపడా సన్నబియ్యం ను ఉచితంగా అందించడం జరిగిందని తెలిపారు. రైతు భరోసా పథకం ద్వారా రైతుల ఖాతాలలో 9 రోజులలో 9 వేల కోట్ల రూపాయలు జమచేసి పెట్టుబడి సాయం అందించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో వెనుకబడిన తరగతుల వసతి గృహం, పలు పాఠశాలలలో భోజనశాల, వంట శాల ఏర్పాటు కొరకు అందిన ప్రతిపాదనలు పరిశీలించి త్వరలోనే అనుమతించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని, జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో ప్రస్తుతం 70 శాతం మంది విద్యార్థులు తరగతులకు హాజరవుతున్నారని, విద్యార్థుల హాజరు శాతాన్ని 100 శాతానికి పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి సంవత్సరం 3 వేల నుండి 3 వేల 500 మంది విద్యార్థులు పాఠశాలలలో చేరుతుండగా, ఈ విద్యా సంవత్సరంలో 7 వేల మంది పిల్లలు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో చేరారని తెలిపారు. ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తూ విద్యార్థులకు అవసరమైన సకల సదుపాయాలను కల్పించిందని తెలిపారు.జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, సామాజిక, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచడం తో పాటు ఆసుపత్రులలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని తెలిపారు. రేషన్కార్డుల కొరకు అందిన 3 వేల 967 దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హత కలిగిన 3 వేల 220 దరఖాస్తులను ఆమోదించడం జరిగిందని తెలిపారు. అనంతరం అర్హత గల లబ్దిదారులకు రేషన్కార్డుల మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

# మార్కెట్ ఛైర్మెన్ పై మల్లురవి గుస్సా..

## జగదీశ్వర్ రావుకు కండువా కప్పని మంత్రి..?

## ఉప ముఖ్య మంత్రి సభలో విచిత్ర అనుభవాలు

## బయటపడ్డవి.. వర్గ విభేదాలేనా..?



నాగర్ కర్నూల్ / కొల్లాపూర్ రురల్, (మనం న్యూస్) : రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క పర్యటన సందర్భంగా కొల్లాపూర్ పట్టణంలో శనివారం నిర్వహించిన సభలో వర్గ విభేదాలు బయటపడ్డాయి. సభకు అధ్యక్షత వహించిన మంత్రి జూపల్లి కృష్ణారావు సభా వేదికపై ఉన్న ప్రజాప్రతినిధులందరికీ కండువా కప్పగా అక్కడే ఉన్న చింతలపల్లి జగదీశ్వర్ రావుకు కండువా కప్పలేదు. ఇది సభలో కార్యకర్తల మధ్య చర్చనీయాంశమయ్యింది. ముందు నుంచి కూడా జూపల్లి వర్గానికి, జగదీశ్వర్ రావు వర్గానికి పొసగడంలేదనే చర్చ ఉన్నది. అప్పుడప్పుడు సమావేశాలు, కార్యక్రమాల్లో ఇలాంటివి బయటపడుతున్నాయని పట్టణంలో చర్చించుకున్నారు. ఇది ఇలా ఉండగా మంత్రి జూపల్లి కృష్ణారావు అధ్యక్షతన నిర్వాహ్ణచిన సమావేశంలో అతిథులను ఆహ్వానించే బాధ్యతను మార్కెట్ కమిటీ ఛైర్మెన్ దండు నర్సింహాకు జూపల్లి అప్పజెప్పారు. దీంతో ఆయన సభలో ప్రసంగించేందుకు అందరినీ ఆహ్వానించారు. ఈ క్రమంలో ఎంపీ డాక్టర్ మల్లు రవిని కూడా ఆహ్వానించారు. ఐతే మల్లురవి ప్రసంగిస్తుండగా సమయాభావం కారణంగా ప్రసంగం తొందరగా ఆపివేయాలని చీటిపై రాసి మార్కెట్ కమిటీ ఛైర్మెన్ దండు నర్సింహా మల్లు రవికి ఇచ్చారు. దీంతో కాస్త అసహనానికి గురైన మల్లురవి ఆ చేతిని విసిరి కొట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈయన ఓ పెద్ద నాయకుడు ఎదో కాగితం మీద రాసుకొచ్చి.. నన్ను ప్రసంగం ఆపమని చెబుతున్నాడు.. అని మల్లురవి అనగానే అదంతా కామెడీ అనుకున్న సభ అంతా ఘొల్లున నవ్వారు. ఈయన వచ్చి నన్ను మాట్లాడవద్దని చెప్తున్నాడు.. కూచోపో అక్కడ.. నిన్ను ఎవడు పెట్టాడిక్కడా.? అని మల్లు రవి అన్నారు. అదంతా కామెడీగానే జరుగుతున్నదని అందరూ భావించగా ఎవరయ్యా ఈయనకు బాధ్యత ఇచ్చింది..? నేను మాట్లాడేది మీ గురించి, ప్రజల గురించి.. ఒక్క విషయం కూడా సొల్లు మాట్లాడలేదు. ఇటువంటి ప్రాక్టీస్ నావద్ద చేయొద్దు అని మల్లు రవి మండి పడ్డారు. ఢిల్లీలో తనకు సమావేశం ఉన్నా ప్రభుత్వ కార్యక్రమం కాబట్టి ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించేందుకు వచ్చానని మల్లురవి చెప్పుకొచ్చారు. ఇక్కడకు వచ్చింది కృష్ణారావు పెట్టిన చాపల కూర, చికెన్ తిని పోవడానికి కాదని రాష్ట్రంలో, ఢిల్లీలో ఏమి జరుగుతున్నదో ప్రజలకు చెప్పడానికి వచ్చానన్నారు. ఢిల్లీలో రాజీవ్ గాంధీ, మల్లికార్జున ఖర్గే ప్రోగ్రాం ఉంటె వెళ్లకుండా ఇక్కడ జూపల్లి ప్రోగ్రాంకు ప్రాధాన్యం ఇచ్చి వచ్చానన్నారు. సభలో వేదికపై చోటు చేసుకున్న ఈ హఠాత్పరిణామంతో అందరూ నిర్ఘాంత పోయారు. ఎంపీ స్థాయి వారిని ప్రసంగం ఆపమని చెప్పడం కాదని కొందరు అనుకుంటుంటే, బీసీ నాయకుడిని ఎంపీ అవమానించారని సోషల్ మీడియాలో ఆయా వర్గాల వారు పోస్టులు పెడుతున్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి





- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- ముత్తారం పి.హెచ్.సి ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

ముత్తారం, ఆగస్టు 02 (మనం న్యూస్): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ముత్తారం పి.హెచ్.సి ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ లో జరుగుతున్న వైద్య పరీక్షల వివరాలను, స్టాఫ్ అటెండెన్స్ పరిశీలించారు. ఫార్మసీ విభాగంలో అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయో లేదో అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఎంత మంది ఔట్ పేషెంట్ వస్తున్నారో ఆరా తీశారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఔట్ పేషంట్ లలో వ్యాధి లక్షణాలు ఉన్న ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా పరీక్షలు నిర్వహించాలని, ముందస్తుగా వ్యాధి నిర్ధారణ జరిగితే మెరుగైన చికిత్స అందించేందుకు అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఆసుపత్రి సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావాలని , సమయ పాలన పాటించాలని అన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ అమరేందర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజీలు, సిసి రోడ్లను మరమ్మత్తులు చేయాలి

- మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



కరీంనగర్, ఆగస్టు2(మనంప్రతినిధి): కరీంనగర్ నగరపాలక సంస్థ పరిదిలోని అలుగునూరు ప్రాంతంలో శనివారం మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ అధికారులతో కలిసి పర్యటించారు. నగరపాలక సంస్థ సంస్థ అభివృద్ధి లో భాగంగా అలుగునూరు చౌరస్తాతో పాటు ప్రాంతంలోని పలు కాలనీల్లో సందర్శించి శిథిలమైన డ్రైనేజీలు, సీసీ రోడ్లను తనిఖీ చేసి పరిశీలించారు. వాటి మరమ్మతు అభివృద్ధి పనుల పై ఎమ్మెల్యే సత్యనారాయణ కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ సూచించి ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సంధర్భంగా కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ కరీంనగర్ నగరానికి ముఖ ద్వారమైన అలుగునూరు జంక్షన్ ను సుంధరీకరించాలని కమీషనర్ ను కోరారు. అంతే కాకుండా సదాశివ్ పల్లి జంక్షన్ ను కూడ అభివృద్ధి చేయాలని సూచించారు. అలుగునూరు ప్రాంతంలోని శిథిలమైన పలు డ్రైనేజీలను, సీసీ రోడ్ల మరమ్మతు పనులు చేపట్టాలని కోరారు. అంతే కాకుండా ఓ కాలనీలో నూతనంగా సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని... వాటికి ప్రణాళిక సిద్ధం చేసి... అభివృద్ధి పనులు ప్రారంభించాలని కోరారు. ఈ సంధర్భంగా కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ 4 కోట్ల నిధులతో అలుగునూరు జంక్షన్ సుంధరీకరణకు సంబంధించి ప్రణాళిక సిద్దం చేసి ప్రపోజల్స్ ప్రభుత్వానికి పంపించడం జరిగిందని... సదాశివ్ పల్లి జంక్షన్ అభివృద్ధి కోసం 2.50 కోట్ల ప్రపోజల్స్ కూడ ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. శిథిలమైన డ్రైనేజీల నిర్మాణంకు ఇంజనీరింగ్ అధికారులు ప్రణాళికలు సిద్దం చేయాలని... అంతే కాకుండా ఎమ్మెల్యే గారి ఆదేశాల మెరకు సంబంధిత కాలనీలో నూతన సీసీ రోడ్డు నిర్మాణంకు కూడ ప్రణాళికలు సిద్దం చేయాలని కమీషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలోఈఈ సంజీవ్ కుమార్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలి

## వీక్లీ పరేడ్లో జిల్లా ఎస్పీ డి. జానకి



మహబూబ్ నగర్, ఆగస్ట్ 02 (మనం న్యూస్): పోలీసులు ప్రతి ఒక్కరు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని జిల్లా ఎస్పీ డి. జానకి అన్నారు. శనివారం జిల్లా పోలీసు కవాతు మైదానము నందు నిర్వహించిన వీక్లీ పరేడ్ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ డి. జానకి హాజరయ్యారు. పరేడ్ ముగిసిన అనంతరం సిబ్బందిని వ్యక్తిగతంగా కలుసుకొని వారి సమస్యలను అడిగి తెలుసుకొని, అవసరమైన సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 'పోలీసు విధుల్లో నిత్యం ఒత్తిడి, భౌతిక మరియు మానసిక శ్రమ ఎక్కువగా ఉంటుంది. అందుకే ప్రతి ఒక్కరు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలి. సమయం దొరికినప్పుడల్లా కుటుంబంతో గడిపి ఆత్మీయతను పెంపొందించుకోవాలి. అలాగే యోగా, మెడిటేషన్ అనునిత్యం చేయడం వల్ల శారీరకంగా, మానసికంగా బలంగా మారవచ్చు. మన ఆరోగ్యం బాగుంటేనే మన సేవలు ప్రభావవంతంగా ఉంటాయి' అని పేర్కొన్నారు. అదే విధంగా, విధుల్లో నిబద్ధతతో పాటు సేవా దృక్పథాన్ని ప్రదర్శిస్తూ, ప్రజల నమ్మకాన్ని గెలుచుకోవాలన్నారు. పోలీసు కుటుంబం అందరికి అధికారుల మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. ఈ పరేడ్ నందు అదనపు ఎస్పి ఎన్.బి.రత్నం, ఏ ఆర్ అదన పై ఎస్పీ సురేష్ కుమార్, ఏ ఆర్ డి ఎస్ పి శ్రీనివాసులు, ఆ రైలు కృష్ణయ్య రవి నాగేష్ మరియు ఇతర పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# సైన్ లాంగ్వేజీలో విన్నపాలు అర్థం చేసుకొని పరిష్కరించాలి



- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, ఆగస్టు 2(మనంప్రతినిధి): దివ్యాంగుల సమస్యల్ని, భావాన్ని సైన్ లాంగ్వేజి ద్వారా అర్థం చేసుకొని వారి సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల శిక్షణ కేంద్రం పరిధిలోని కలెక్టరేట్ లో గల ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో ప్రభుత్వ అధికారులకు 'బేసిక్ ఇండియన్ సైన్ లాంగ్వేజి' శిక్షణ ముగింపు కార్యక్రమానికి శనివారం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి హాజరయ్యారు. శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగుల సమస్యల్ని, వారి భావాన్ని సరిగ్గా అర్థం చేసుకునేందుకు అధికారులకు సైన్ లాంగ్వేజి ఇచ్చామని తెలిపారు. 7 రోజులపాటు సాగిన ఈ శిక్షణలో సైన్ లాంగ్వేజ్ బేసిక్స్ నేర్చుకున్నారని తెలిపారు. తదుపరి అన్ని పాఠశాలలు, భవిత కేంద్రాల సిబ్బందికి, ఆరోగ్యశాఖ అధికారులకు సైన్ లాంగ్వేజి శిక్షణ ఇస్తామని అన్నారు. దివ్యాంగులకు ప్రభుత్వం కల్పించిన అన్ని సౌకర్యాలు, ప్రయోజనాలను వారికి చెందేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులపై ఉందని అన్నారు. సైన్ లాంగ్వేజి ద్వారా వారి విన్నపాలను సరిగ్గా అర్థం చేసుకోవచ్చని, తద్వారా వారి సమస్యలను పరిష్కరించే అవకాశం ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయి, డిఆర్ఓ వెంకటేశ్వర్లు, ప్రాంతీయ శిక్షణ కేంద్రం కోఆర్డినేటర్ రాంబాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు

# పన్నెండేళ్ల అమ్మాయికి ప్రపంచ స్విమ్మింగ్ కాంస్యం

పన్నెండేళ్ల వయసుకే అంతర్జాతీయ స్థాయిలో అదరగొడుతున్న చైనా యువ స్విమ్మర్ యు జిడి.. ప్రపంచ స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్ లో బోణీ కొట్టింది. ఈ పోటీల్లో ఆమెకు కాంస్యం దక్కింది. 4స200 మీటర్ల ఫ్రీస్టైల్ రిలే రేసులో మూడో స్థానం సాధించిన చైనా బృందంలో జిడి సభ్యురాలు.



క్వాలిఫయింగ్ లో పోటీ పడ్డ జిడి.. ఫైనల్లో బరిలోకి దిగలేదు. కానీ ఆమె జట్టు కాంస్యం గెలవడంతో తనకూ పతకం దక్కింది. 200 మీ. బటర్ ఫ్లై, 200 మీ. వ్యక్తిగత మెడ్లీ రేసుల్లో జిడి త్రుటిలో పతకం చేజార్చుకుంది. ఈ రెండు రేసుల్లోనూ ఆమె నాలుగో స్థానంలో నిలిచింది. జిడి 400 మీ. వ్యక్తిగత మెడ్లీ రేసులో బరిలోకి దిగాల్సి ఉంది.

# శతక్కొట్టిన జైస్వాల్..

ఇంగ్లండ్ తో ఐదో టెస్టులో టీమిండియా ఓపెనర్ యశస్వి జైస్వాల్ శతక్కొట్టాడు. ఓవల్ మైదానంలో శనివారం నాటి మూడో రోజు ఆటలో భాగంగా వంద పరుగుల మార్కును అందుకున్నాడు. 127 బంతుల్లోసెంచరీ పూర్తి చేసుకున్నాడు. అతడి శతక ఇన్నింగ్స్ లో 11 ఫోర్లు 2 సిక్సర్లు ఉన్నాయి. ఇక ఈ సిరీస్ లో జైసూకు ఇది రెండో శతకం. అంతకు ముందు లీడ్స్ వేదికగా తొలి టెస్టులో జైస్వాల్ 101 పరుగులు చేశాడు. కాగా ఆండర్సన్- టెండుల్కర్ ట్రోఫీ లో భాగంగా ఐదు టెస్టుల సిరీస్ లో ఇంగ్లండ్ టీమిండియాపై 2-1తో ఆధిక్యంలో ఉంది. ఈ క్రమంలో సిరీస్ ఫలితాన్ని తేల్చే ఆఖరిదైన ఐదో మ్యాచ్ లండన్ లో గురువారం మొదలైంది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ కు దిగిన భారత్ మొదటి ఇన్నింగ్స్లో 224 పరుగులకు ఆలౌట్ అయింది. తొలి ఇన్నింగ్స్ లో జైస్వాల్ రెండు పరుగులు మాత్రమే చేసి అవుటయ్యాడు. ఇంగ్లండ్ పేసర్ గస్ అట్కిన్సన్ బౌలింగ్ లో ఎల్బీడబ్ల్యూ అయ్యాడు. అయితే, రెండో ఇన్నింగ్స్ కు వచ్చే సరికి జైస్వాల్ గేరు మార్చాడు. శుక్రవారం నాటి రెండో రోజు ఆటలోనే అర్ధ శతకం (52₹) పూర్తి చేసుకున్న ఈ ఎడమచేతి వాటం బ్యాటర్.. శనివారం దానిని సెంచరీగా మలిచాడు.

తద్వారా ఈ సిరీస్ లో రెండో శతకంతో పాటు.. తన టెస్టు కెరీర్ లో ఆరో సెంచరీని నమోదు చేశాడు. ఇందులో నాలుగు ఇంగ్లండ్ మీద బాదినవే కావడం మరో విశేషం. ఇదిలా ఉంటే.. 75/2 ఓవర్ నైట్ స్కోరుతో శనివారం ఆట మొదలుపెట్టిన టీమిండియా 51 ఓవర్ల ఆట పూర్తయ్యేసరికి నాలుగు వికెట్ల



నష్టానికి 216 పరుగులు చేసింది. నైట్ వాచ్ మన్ ఆకాశ్ దీప్ అర్ధ శతకం(66)తో చెలరేగగా.. కెప్టెన్ శుబ్ మన్ గిల్ (11) మాత్రం నిరాశపరిచాడు. జైసూతో కలిసి కరుణ్ నాయర్ (9₹) పరుగులతో క్రీజులో ఉన్నాడు. కాగా భారత్ ను తొలి ఇన్నింగ్స్ లో 224 పరుగులకు కట్టడి చేసిన ఇంగ్లండ్.. తమ మొదటి ఇన్నింగ్స్ లో 247 పరుగులకు ఆలౌట్ అయింది.

# భారత ఫుట్‌బాల్ కోచ్‌గా జమీల్

భారత పురుషుల ఫుట్ బాల్ జట్టుకు చీఫ్ కోచ్ గా ఖలీద్ జమీల్ ఎంపికయ్యాడు. చీఫ్ కోచ్ రేసులో స్టీఫెన్ కాన్ స్టంటైన్, స్టెఫాన్ టర్కోవిచ్ లను వెనక్కి నెట్టిన 48 ఏళ్ల జమీల్ ను అత్యున్నత పదవి వరించింది. దిగ్గజ ఆటగాడు విజయన్



సారథ్యంలోని ఏఐఎఫ్ఎఫ్ సాంకేతిక కమిటీ ముగ్గురి పేర్లతో జాబితాను తయారు చేయగా.. మాజీ అంతర్జాతీయ ఆటగాడు జమీల్ కు ఎగ్జిక్యూటివ్ కమిటీ పచ్చజెండా ఊపింది. కాన్ స్టంటైన్ భారత జట్టు మాజీ చీఫ్ కోచ్ కాగా.. స్లోవేకియా జాతీయ జట్టుకు టర్కోవిచ్ సేవలు అందించాడు. జాతీయ జట్టుకు భారతీయుడు చీఫ్ కోచ్ గా నియమితుడవటం 13 ఏళ్లలో ఇదే తొలిసారి. పురుషుల జట్టుకు ప్రధాన కోచ్ గా పనిచేసిన చివరి భారతీయుడు సావియో మెదీరా. 2011 నుంచి 2012 వరకు అతను చీఫ్ కోచ్ గా వ్యవహరించాడు. 2017 ఐ-లీగ్ లో ఐజ్వాల్ ఫుట్ బాల్ క్లబ్ ను జమీల్ విజేతగా నిలిపాడు. ప్రస్తుతం ఇండియన్ సూపర్ లీగ్ లో జంషెడ్ పుర్ ఎఫ్ సీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు.

# ఊహించని ట్విస్ట్ ఇచ్చిన సైనా నెహ్వాల్

భారత బ్యాడ్మింటన్ స్టార్ సైనా నెహ్వాల్ అభిమానులకు శుభవార్త చెప్పింది. భర్త పారుపల్లి కశ్యప్తో కలిసి దిగిన ఫొటోను పంచుకుంటూ.. ''దూరం దగ్గర చేసింది'' అని క్యాప్షన్ ఇచ్చింది. తద్వారా తాము తిరిగి కలిసిపోయామనే సంకేతాలు ఇచ్చింది.



కాగా భర్త పారుపల్లి కశ్యప్ తో తాను విడిపోతున్నట్లు సైనా నెహ్వాల్ గత నెలలో ప్రకటన విడుదల చేసిన విషయం తెలిసిందే. సుదీర్ఘంగా చర్చించిన తర్వాతే తాము ఈ నిర్ణయం తీసుకున్నట్లు జులై 13న సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది.

**ఆలోచించే విడాకుల నిర్ణయం**

''జీవితం మనల్ని ఒక్కోసారి వేర్వేరు దిశల్లో ప్రయాణించేలా చేస్తుంది. సుదీర్ఘ చర్చలు, ఆలోచనల అనంతరం నేను, కశ్యప్ విడిపోవాలని నిశ్చయించుకున్నాం. ఈ బంధంలో నాకెన్నో మధురానుభూతులు ఉన్నాయి. ఇకపై కూడా మేము స్నేహితుల్లా కొనసాగుతాం'' అని సైనా నోట్ విడుదల చేసింది.

**ఊహించని ట్విస్ట్**

అయితే, తాజాగా శనివారం పారుపల్లి కశ్యప్ తో కలిసి దిగిన ఫొటోలను సైనా నెహ్వాల్ ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేసింది. ''కొన్నిసార్లు దూరమే.. మన సన్నిహితులతో కలిసి ఉండటం ఎంత విలువైనదో నేర్పుతుంది. మేము కలిసి ఉండేందుకు మరో ప్రయత్నం చేస్తున్నాం'' అని రెండు హార్ట్ ఎమోజీలతో సైనా క్యాప్షన్ జతచేసింది.

కాగా భారత బ్యాడ్మింటన్ దిగ్గజం పుల్లెల గోపీచంద్ దగ్గర శిక్షణ తీసుకున్న సైనా, కశ్యప్ చాలా ఏళ్లపాటు ప్రేమించుకున్నారు. 2018లో పెళ్లి బంధంతో ఒక్కటైన వీరు అన్యోన్యంగా ఉండేవారు. కెరీర్ పరంగానూ ఒకరికొకరు అండగా ఉంటూ కపుల్ గోల్స్ సెట్ చేసేవాళ్లు. అయితే, సైనా విడాకుల ప్రకటన చేయగా.. కశ్యప్ మాత్రం అపుడు స్పందించలేదు.

ఇక ఇప్పుడు భార్యతో కలిసి పోస్ట్ షేర్ చేస్తూ తమ రీయూనియన్ ని మాత్రం తెలియజేశాడు. కాగా లండన్ ఒలింపిక్స్-2012లో మహిళల సింగిల్స్ విభాగంలో సైనా కాంస్యం గెలవగా.. అదే ఎడిషన్ లో కశ్యప్ పురుషుల సింగిల్స్ లో క్వార్టర్ ఫైనల్స్ కు చేరుకున్నాడు.

# స్టైల్ అండ్ స్వాగ్‌తో తలైవా విశ్వరూపం..

తమిళ ప్రేక్షకులతో పాటు యావత్ దేశవ్యాప్తంగా సూపర్ స్టార్ రజినీకాంత్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న కూలీ ట్రైలర్ వచ్చేసింది. దర్శకుడు లోకేష్ కనగరాజ్ నుంచి వస్తున్న ఈ సినిమా మరోసారి తమిళ సినీ రికార్డులను తిరగరాయడం ఖాయమని ఈ ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది. ప్యూర్ మాస్ అండ్ యాక్షన్




ఎలిమెంట్స్ తో ఈ ట్రైలర్ కట్ అదిరిపోయింది.

ఇక తలైవా రజినీకాంత్ తనదైన స్వాగ్ తో చేసే యాక్షన్ ఫ్యాన్స్ కు ఫుల్ మీల్స్ అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఈ ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది. లోకేష్ తనదైన మార్క్ కట్ చేసిన ఈ ట్రైలర్ ప్రేక్షకులకు కన్నులపండువగా అనిపిస్తుంది. భారీ క్యాస్టింగ్, అనిరుద్ ఎంగేజింగ్ మ్యూజిక్ తో ట్రైలర్ ఆద్యంతం పవర్ ప్యాక్డ్ గా కట్ చేశారు. రజినీకాంత్ ఎలివేషన్ పీక్స్ లో ఉండటంతో అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు.

మొత్తానికి రజినీకాంత్ ఈసారి ఇండియన్ బాక్సాఫీస్ రికార్డులను షేక్ చేసేందుకు చాలా గట్టిగానే వస్తున్నాడనేది ఈ ట్రైలర్ తో కన్ఫమ్ అయింది. ఈ సినిమాలో ఉపేంద్ర, నాగార్జున, శ్రుతి హాసన్, సత్యరాజ్, అమీర్ ఖాన్ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. సన్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్ తో ప్రొడ్యూస్ చేస్తుండగా ఆగస్టు 14న వరల్ వైడ్ గా గ్రాండ్ రిలీజ్ కానుంది.



# చెప్పు తెగుద్ది.. అంటూ అనసూయ మాస్ వార్నింగ్

టాలీవుడ్ బుల్లితెరపై తన హోస్టింగ్ ట్యాలెంట్ తో పాటు గ్లామర్ తో తనకంటూ ప్రత్యేక క్రేజ్ తెచ్చుకున్న భామ అనసూయ. ఆ తర్వాత ఆమె సినిమాల్లోనూ తన వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకుంది. అయితే, సోషల్ మీడియాలో నిత్యం యాక్టివ్ గా ఉండే అనసూయ చాలా వివాదాల్లోనూ హాట్ టాపిక్ గా మారింది.

కాగా ఇప్పుడు మరోసారి అనసూయ చేసిన కొన్ని కామెంట్స్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారాయి. ప్రకాశం జిల్లాలోని మార్కాపురంలో ఓ షాపింగ్ మాల్ ఓపెనింగ్ కు అనసూయ గెస్ట్ గా వచ్చింది. అక్కడ ఆమె స్టేజీపై మాట్లాడుతుంటే, కింద ఉన్న జనంలో కొందరు ఆకతాయిలు ఆమెపై కొన్ని కామెంట్స్ చేశారు. దీంతో అనసూయ కోపంతో రగిలిపోయింది.

వెంటనే చెప్పు తెగుద్ది.. పబ్లిక్ లో అందరి ముందు చెప్పుతో కొట్టడానికి కూడా తాను వెనకాడనని.. మీ ఇంట్లో ఉండే తల్లి, అక్క, చెల్లి లను కూడా ఇలాంటి కామెంట్స్ చేస్తారా.. అంటూ సదరు ఆకతాయిలపై ఫైర్ అయింది. ఆమె చేసిన కామెంట్స్ వీడియో రూపంలో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# ముందే వచ్చేసిన ఓజీ సాంగ్.. అన్ని లెక్కలు తేల్చనున్న పవర్ స్టార్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా ప్రియాంక అరుళ్ మోహన్ హీరోయిన్ గా దర్శకుడు సుజీత్ తెరకెక్కించిన భారీ చిత్రం ఓజీ. ఈ సినిమాపై ఉన్న అంచనాలు కోసం ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఆ రేంజ్ హైప్ దీనిపై ఉంది. మరి ఈ సినిమా నుంచి మోస్ట్ అవైటెడ్ గా ఉన్న ఫస్ట్ సాంగ్ ఫైర్ స్టాం ఈజ్ లిరికల్ వీడియోని మేకర్స్ నేడు సాయంత్రం విడుదల చేస్తున్నట్టుగా కన్ఫర్మ్ చేశారు.

కానీ ట్విస్ట్ ఇస్తూ మధ్యాహ్నమే రిలీజ్ విడుదల చేసేసారు. మరి ఈ సాంగ్ మాత్రం నెక్స్ట్ లెవెల్లో ఉందని చెప్పాలి. సుజీత్ టేకింగ్, పవన్ స్క్రీన్ ప్రెజెన్స్ సాంగ్ లో అదిరిపోయాయి. ఇక థమన్ కూడా అదే రీతిలో క్రేజీ డ్యూటీ చేసాడని చెప్పాలి. టాలీవుడ్ జాన్ విక్ స్టైల్ లో తన మార్క్ బీట్స్ తో థమన్ దుమ్ము లేపాడని చెప్పాలి.

ఇక వీటితో పాటుగా మధ్యలో జాపనీస్ ర్యాప్ ఇంకో హైలైట్ అని చెప్పాలి. అంతే కాకుండా సినిమా నుంచి వచ్చిన హంగ్రీ చీతాకి ఓ స్పెషల్ వెర్షన్ ని కూడా ప్లాన్ చేయడం మరింత కేజ్రీగా ఉందని చెప్పాల్సిందే. మొత్తానికి మాత్రానికి మాత్రం ఓజి తో పవన్ కళ్యాణ్ అన్ని లెక్కలూ తేల్చేలానే ఉన్నారని చెప్పి తీరాలి.



# ఎన్టీఆర్ అన్న కోసం మా మూవీ టైటిల్ మార్చుకున్నాం: విజయ్ దేవరకొండ



'కింగ్డమ్' మూవీకి తొలుత 'నాగ దేవర' అనే టైటిల్ అనుకున్నామని, ఎన్టీఆర్ 'దేవర' కోసం ఆ టైటిల్ వదులుకున్నామని కథానాయకుడు విజయ్ దేవరకొండ అన్నారు. ఆయన కీలక పాత్రలో గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో రూపొందిన చిత్రమిది. ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ మూవీ మంచి టాక్ ను సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా శనివారం విజయ్ దేవరకొండ విలేకరులతో మాట్లాడుతూ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.

● ''కింగ్డమ్' విషయంలో ఒత్తిడి ఉన్న మాట వాస్తవమే. ఇదే కాదు, ప్రతి సినిమాకు నాకు ఒత్తిడి ఉంటుంది. ఇంతకుముందు చేసిన సినిమా హిట్ అయిందని ప్రశాంతంగా కూర్చోలేం కదా. ఇది విజయం సాధిస్తే, తర్వాత సినిమాకు రిలాక్స్ అయిపోలేం కదా. 'కింగ్డమ్'కు తెలుగుతో పాటు, తమిళంలో మంచి ఆదరణ దక్కుతోంది''

● ''ఈ మూవీలో అనేక పార్శ్వాలు ఉన్నాయి. ఈ కథను నాకు చెప్పిన తర్వాత దీనిని మూడు గంటల్లో చెప్పటం కష్టమనిపించింది. మొదటి పార్ట్ లో సూరి జర్నీ మాత్రమే చూపించాం. ముఖ్యంగా అన్నను వెతుక్కుంటూ ఎలా వెళ్లాడన్నది మాత్రమే తీశాం. అయితే, చివరి 20 నిమిషాల్లో సూరి లక్ష్యం మారిపోతుంది. ఒక కానిస్టేబుల్ కథతో మొదలై రాజు అవడంతో ఈ భాగం ముగిసింది''

● ఈ కథ వినగానే రిఫరెన్స్ కోసం 'వైకింగ్స్', 'ది లాస్ట్ కింగ్డమ్' వంటి సిరీస్ లు వరుసగా చూశా. ఇక కానిస్టేబుల్ కనిపించే తొలి సన్నివేశాల్లో చాలా సన్నగా కనిపిస్తా. 'ఫ్యామిలీస్టార్' చేయడానికి ముందు కొన్ని రోజుల పాటు చేసిన షెడ్యూల్ అది. ఆ తర్వాత స్ట్రీగా, పోరాట యోధుడిగా కనిపించేందుకు ఆరు నెలలు ప్రత్యేక కసరత్తులు చేశా''

● ''కింగ్డమ్' పార్ట్2'లో కచ్చితంగా స్టార్ హీరో ఉంటారు. అయితే, సోషల్ మీడియాలో 'రానా' అంటూ జరుగుతున్న చర్చలో నిజం లేదు. ఎవరనేది దర్శకుడు గౌతమ్ చెబుతారు.

● ''నెగిటివిటీ గురించి నేను పెద్దగా ఆలోచించను. అది చాలా సాధారణమైంది. దాని గురించి నాకు ఎలాంటి కంప్లయింట్స్ లేవు. 10ఏళ్ల కిందట నేను ఎవరికీ తెలియదు. ఇంత మంది మనల్ని చూడటానికి వస్తున్నారంటే అది నా అదృష్టం. అభిమానులు, ప్రేక్షకులు పంచే ప్రేమ అది''

● ''అర్జున్ రెడ్డి'కి బెస్ట్ యాక్టర్ అవార్డు తీసుకున్నప్పుడు గర్వంగా అనిపించింది. ఆ మూవీ ఆడియో ఫంక్షన్ కు వందల మంది వచ్చారు. మనకోసం వస్తున్న వారి కోసం ఏదైనా చేయాలనిపించింది. నాకు వచ్చిన అవార్డును వేలం వేస్తే రూ.25లక్షలు వచ్చాయి. వాటిని మంచి పనులకు ఉపయోగించా. అసలు 'అర్జున్ రెడ్డి'కి నేను తీసుకున్న పారితోషికం రూ.5లక్షలు. అప్పట్లో అంత పెద్ద అమౌంట్ నేను చూడలేదు.

● 'కింగ్డమ్'లో పాట తీసేయాలన్న నిర్ణయం దర్శకుడు గౌతమ్, ఎడిటర్ నవీన్ నూలిదే. పాటను ముందుగానే విడుదల చేశాం. అందులో స్పై ఏజెంట్గా సమాచారాన్ని ఎలా సేకరిస్తానన్నది చూపించాం. అది అందరికీ తెలిసింది. దాని గురించి మళ్లీ 3 నిమిషాలు సినిమాలో ఎందుకనిపించింది. ఇప్పుడు తీయడంతో అందరూ అడుగుతున్నారు (నవ్వులు)

● ''షిప్ లాగే సీన్ ను మే నెలలో మండుటెండల్లో తీశాం. అది తీసేటప్పుడు ఓ మంచి సన్నివేశం చేస్తున్నామన్న సంతృప్తి ఉంది. 'జెర్సీ'లో ఉన్న మూమెంట్ అనే ఆలోచనతో చేయలేదు. ఇప్పుడు



ప్రేక్షకులు ఆ సీన్ గురించి గొప్పగా మాట్లాడటం చాలా సంతోషంగా ఉంది.

● ''నేను ఏ డైలాగ్ చెప్పినా యాసలో ఉందని అంటున్నారు. 'కల్కి'లో నాగ్ అశ్విన్ రాసిన డైలాగ్ని చెప్పాను. ఏం చేస్తాం. దేవుడు నాకిచ్చిన గొంతు అది. అసలు అర్జునుడు మాతృభాష ఏంటి?ఎలా మాట్లాడతాడు? ఏమైనా రిఫరెన్స్ లు ఉంటాయా? ప్రతి విషయంలోనూ యాస గురించి మాట్లాడితే నేనేం చెప్పను''

● ప్రస్తుతం రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో ఓ మూవీ చేస్తున్నా. రాయలసీమ నేపథ్యంలో సాగే కథ అది. అలాగే రవి కిరణ్ కోలాతో చేసే కథ కూడా చాలా వైవిధ్యమైనది. వాళ్లు సినిమా కోసం చేసే వర్క్ నాకు చాలా కష్టం. ప్రతిది డీటెలింగ్ గా చెప్పాలనుకుంటారు.

# పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం

**కార్పొరేట్ కు దీటుగా కోదాడ ప్రభుత్వ వైద్యశాలను తీర్చిదిద్దుతా**

**3 కోట్ల 66 లక్షల రూపాయలతో త్వరలోనే సిటి స్కాన్ ప్రారంభం**

**10 లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ప్రారంభం**

**కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి**



**కోదాడ, ఆగస్టు 02 (మనం న్యూస్):** కోదాడ ప్రభుత్వ ఆసుపత్రిని కార్పొరేట్ కు దీటుగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో 10 లక్షల రూపాయలతో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో 26 కోట్ల రూపాయలతో వంద పడకల ఆసుపత్రిని నిర్మిస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే 3కోట్ల 66 లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన సిటీ స్కాన్ యంత్రం అందుబాటులోకి వస్తుందన్నారు. ఉమ్మడి జిల్లాలోనే మొట్టమొదటిసారిగా కోదాడ ప్రభుత్వ ఆసుపత్రిలో ఒక డాక్టర్ ముగ్గురు స్టాప్ నర్సులతో కలిపి జాతీయ రాబిస్ కంట్రోల్ ప్రోగ్రాం ఏర్పాటు చేయడంతో పాటు పుట్టుకతో బరువు తక్కువ ఉన్న పిల్లలందరికీ రిహాబిటేషన్ సెంటర్ ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆసుపత్రిలో జరుగుతున్న పనుల్లో వేగం పెంచాలని సిబ్బందికి సూచించారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు.ఈ కార్యక్రమంలో పిసిసి డెలిగేట్ చింతకుంట లక్ష్మీనారాయణ రెడ్డి, జిల్లా గ్రంధాలయ చైర్మన్ వంగవీటి రామారావు, ఆర్డీవో సూర్యనారాయణ, డిసిహెచ్ఎస్ వెంకటేశ్వర్లు, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దశరథ, కమిషనర్ రమాదేవి,వైద్యులు అభిరామ్, వైష్ణవి, నరసింహ, నాయకులు కేఎల్ఎన్ ప్రసాద్, సామినేని ప్రమీల, కందుల కోటేశ్వరరావు, కమదన చందర్ రావు, మధు, ఈదుల కృష్ణయ్య, రామినేని శ్రీనివాసరావు, డాక్టర్ బ్రహ్మం, బాగ్దాద్, భాజాన్ ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.



## ముత్యాలమ్మ తల్లి దయతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి

- బోనాల పండుగను ఘనంగా జరుపుకోవాలి
- కోదాడ ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు
- ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి

**కోదాడ, ఆగస్టు 02 (మనం న్యూస్):** ముత్యాలమ్మ తల్లి దయతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి అన్నారు. శనివారం కోదాడ ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఉన్న ముత్యాలమ్మ తల్లి అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోదాడ ప్రజలందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలందరూ అమ్మవారి పండుగను ఘనంగా జరుపుకోవాలని అమ్మవారి కరుణా కటాక్షంతో పట్టణం అన్ని రంగాల్లో దినదినాభివృద్ధి చెందుతుందని అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో పైడిమర్రి వెంకటనారాయణ, రామినేని శ్రీనివాసరావు, ఈదుల కృష్ణయ్య, కేఎల్ఎన్ ప్రసాద్, డాక్టర్ బ్రహ్మం, హాస్పిటల్ సూపరింటెండెంట్ దశరథ, కమిషనర్ రమాదేవి, సుశీల రాజు తదితరులు పాల్గొన్నారు.

## తల్లి పాల వారోత్సవాలు



**తిరుమలగిరి, ఆగస్టు 02 (మనం న్యూస్):** తిరుమలగిరి మండలం తాటిపాముల గ్రామంలో తల్లిపాల వారోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ కందుకూరి మంగమ్మ మాట్లాడుతూ పుట్టిన ప్రతి బిడ్డకు గంటలోపు ము'రుపాలు పట్టించాలని అన్నారు. బిడ్డకు గంటలోపు ము'రుపాలు పట్టిస్తే ఆ తల్లి నుంచి వచ్చే పాలలో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని, పుట్టిన బిడ్డ ఆరోగ్యం గా ఉంటారని తెలిపారు. ఆరు నెలల వరకు తల్లిపాలు బిడ్డకు ఇవ్వాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐసీపి ఎస్ శోభ, మండల అంగన్వాడి టీచర్లు భూషణమ్మ, సునీత, పుష్పలత, తల్లులు పాల్గొన్నారు.

## గానుగుబండ అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు

- తల్లిపాలే బిడ్డకు అమృతం
- అంగన్వాడి టీచర్ గుండగాని శోభ



**తుంగతుర్తి , ఆగస్టు 2( మనం న్యూస్) :** తుంగతుర్తి మండల కేంద్రంలోని గానుగుబండ అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడి టీచర్ జి శోభ ఆధ్వర్యంలో శనివారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏఎన్ఎం నాగలక్ష్మి విచ్చేసి తల్లిపాల వారోత్సవాల గురించి బాలింతలకు, గర్భిణీలకు సలహాలు సూచనలు ఇచ్చారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డ ఆరోగ్యానికి అమూల్యమైన వరం అని అన్నారు. అలాగే మొదటి ఆరు నెలలు నిండే వరకు తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ ఆహారమన్నారు. తల్లిపాలు బిడ్డ మేధాశక్తికి మెదడును మెరుగుపరచడానికి తోడ్పడతాయన్నారు. అలాగే విరోచనాలు నిమోనియా వంటి వ్యాధులు నుండి తల్లిపాలు రక్షిస్తాయన్నారు. భవిష్యత్తులో రక్త పోటు మధుమేహం, ఉబకాయం వంటి జబ్బులు రాకుండా నిరోధిస్తాయన్నారు. అనంతరం మన ఇంటి చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటి చుట్టుపక్కలో నీరు నిల్వ ఉన్న ప్రదేశాలలో కిరోసిన్ పిచికారి చేయాలన్నారు దాని వలన దోమలు చనిపోతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త రమ, బాలింతలు, గర్భిణీలు పాల్గొన్నారు.

## చెట్టును ఢీకొట్టిన లారీ

**క్యాబిన్లో ఇరుక్కుపోయి**

**తీవ్ర గాయాలతో డ్రైవర్ మృతి..**



**ఆత్మకూర్ ఎస్, ఆగస్టు 2 మనం న్యూస్:** మండల పరిధిలోని నెమ్మికల్ గ్రామంలో అతి వేగంగా వచ్చిన బొగ్గు లోడు లారీ రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొనడంతో క్యాబిన్లో ఇరుక్కుపోయి డ్రైవర్ తీవ్ర గాయాలతో హాస్పిటల్ తీసుకెళ్లగా మృతి చెందిన సంఘటన శనివారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మండలం,ఈస్గావున్ గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ జాబోరే సుగుణాకర్ 26. బొగ్గు లోడు తో ఆసిఫాబాద్ నుండి మాచర్ల కు వెళుతూ శనివారం తెల్లవారు జామున సుమారు 4.20 నిమిషాల కు డ్రైవర్ కు నిద్ర రావడం తో అదుపు తప్పి నెమ్మికల్ గ్రామం లో నీ రోడ్డు పక్కన వేప చెట్టుకు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సుగుణాకర్ లారీ క్యాబిన్ లో ఇరుక్క పోయాడు.క్లీనర్ వెంకటేశ్ బయటికి దూకి ప్రాణాలు కాపాడుకున్నాడు.స్థానికులు పోలీసుల కు సమాచారం ఇవ్వడం తో జెసిబి సహాయం తో గంట సేపటికీ డ్రైవర్ ను బయటికి తీసి 108 లో చికిత్స నిమిత్తం సూర్యాపేట కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.రోడ్డు వెంట ఉన్న పెద్ద వేపచెట్టు లారీ వేగంగా డీ కొనడం వలన వేర్ల తో కూలిపోయింది. చెట్టు లేకపోతే ఇళ్లలోకి దూసుకు పోయి బారి ప్రాణ నష్టం జరిగే ప్రమాదం తప్పిపోయిందనీ తెలిపారు. పోలీసులు లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం

- జిమ్ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- గేయిల్ ఇండియా లిమిటెడ్ సీనియర్ మేనేజర్ బాలాజీ



**తుంగతుర్తి, ఆగస్టు 2,(మనం న్యూస్):** ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని ఉద్దేశంతో గేయిల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో పల్లెల్లో జిమ్ లను ఏర్పాటు చేయడం జరిగిందని ఆ సంస్థ సీనియర్ మేనేజర్ బాలాజీ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలలో ఆ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జిమ్ ను వ్యాయామ ఉపాధ్యాయుడు కొండగడుపుల యాకయ్య తో కలిసి సందర్శించి మాట్లాడారు. ప్రజలు నిత్యం వ్యాయామంతో పాటు జిమ్ ను చేయాలన్నారు. మారుమూల ప్రాంతంలోని ప్రజలను ఆరోగ్యంగా ఉంచేందుకు గేల్ సంస్థ ఆధ్వర్యంలో ఓపెన్ జిమ్ లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మరికొన్ని గ్రామాల్లో జిమ్ లను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పాఠశాల విద్యార్థులు వారిని శాలువ తో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కరుణాకర్, మధు తదితరులు పాల్గొన్నారు.

## కోడికి శస్త్ర చికిత్స



**కోదాడ, ఆగస్టు 02(మనం న్యూస్):** కోదాడ పట్టణంలో పందెం జాతి కోళ్లను సాకే పెద్దోజు శశిధర్ ఇంట్లో ని ఒక కోడి గుడ్లు పెట్టకుండా పొట్ట భాగం లో గడ్డ లా తయారై ఉండడాన్ని గమనించి ప్రాంతీయ పశువైద్యశాలకు తీసుకువెళ్లగా కోడి ని పరీక్షించిన అసిస్టెంట్ డైరెక్టర్ డా పి పెంటయ్య కడుపు కండరాలకు జరిగిన గాయం వల్ల లేదా కండరాల బలహీనతల వలన పొట్ట భాగాలు కండరాల నుండి బైటకు వచ్చి కండరాలకి చర్మం కింద నిలిచి బుద్ధ. దిగి బైటకు గడ్డలాగా తయారైందని అన్నారు. దానికి శస్త్రచికిత్స నిర్వహించి బైటకు వచ్చిన పొట్ట భాగాల్ని యధా స్థితికి చేర్చి కుట్లు వేయడం జరిగింది. ఆపరేషన్ తరువాత కోడి చలాకీగా తిరుగుతూ యజమానికి ఆనందం కలిగించింది. ఈ శస్త్ర చికిత్సలో సిబ్బంది చంద్రకళ, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## తేజ పాఠశాలలో స్నేహితుల దినోత్సవ వేడుకలు



**కోదాడ, ఆగస్టు 02 (మనం న్యూస్):** ఆగస్టు మూడో తేదీన జరుపుకునే స్నేహితుల దినోత్సవంను స్థానిక తేజ టాలెంట్ స్కూల్ విద్యార్థులు అత్యంత ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు చిన్న వయస్సు నుండి స్నేహితుల ద్వారా మంచి లక్షణాలు పెంపొందించుకోవాలని ప్రిన్సిపల్ అప్పారావు తెలిపారు. శనివారం పాఠశాలలో అన్ని క్లాసులో విద్యార్థులు అత్యంత ప్రేమ, అనురాగాలతో ఇతర విద్యార్థులను స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఒకరికొకరు అభినందించు కుంటూ, ఫ్రెండ్షిప్ బ్యాండ్స్ కట్టుకున్నారు. పాఠశాలలో పండుగ వాతావరణంలో ఈ స్నేహితుల దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సోమనాయక్, సెక్రటరీ సంతోష్ కుమార్, ఇన్చార్జులు రామ్మూర్తి, నవ్య , రేణుక, వెంకటేశ్వర్లు, రమేష్, రాంబాబు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉస్మానియా యూనివర్సిటీలో డాక్టరేట్ సాధించిన కొత్త గోల్ తండా గిరిజన వాసి

- డాక్టర్. బానోత్ బాల సుబ్రమణ్యం



**అనంతగిరి, ఆగస్టు 02(మనంన్యూస్):** మండల పరిధిలోని కొత్త గోల్ తండా గ్రామానికి చెందిన బానోతు కోట, లక్ష్మి (లేటు) వారికీ జన్మించిన డాక్టర్. బానోతు బాలసుబ్రహ్మణ్యం ,యూనివర్సిటీ కాలేజ్ అఫ్ ఇంజనీరింగ్ ఉస్మానియా యూనివర్సిటీ ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ లో 'ఇంటర్ హార్మోనిక్ కరెంట్ కంపెన్సేషన్ యూజింగ్ బ్యాక్ స్టెప్పింగ్ కంట్రోల్ స్ట్రైటజీ ఫర్ గ్రిడ్ కనెక్టెడ్ డీజీ యూనిట్' టాపిక్ మీద పరిశోధన( రీసెర్చ్ ) చేయటం జరిగింది,సూపర్వైజర్ ప్రొఫెసర్ ఎం. బాలసుబ్బారెడ్డి, కో సూపర్వైజర్ జి మల్లేశం సహాయం తో పరిశోధన పూర్తి చేయటం జరిగింది. ఇంత మంచి యూనివర్సిటీ లో డాక్టరేట్ వచ్చినందుకు నాకు చాలా ఆనందం గా ఉందని అదేవిధంగా పిహెచ్డీ అడ్మిషన్ తీసుకున్న రోజే అమ్మను(లక్ష్మి) కోల్పోయాను అని, మాది చాలా నిరుపేద కుటుంభం, అమ్మ కూలి పనులకు పోయి ఎంతో కష్ట పడి నా చదువుకు కావలిసిన బుక్స్ సమాకూర్చేది.గవర్నమెంట్ స్కూల్ నుండి పి హెచ్ డి వరకు ప్రోత్సహించినందుకు అమ్మ కి జీవితాతం రుణపడి ఉంటానని, ఈ గౌరవప్రదమైన డాక్టరేట్ ను అమ్మకే అంకితం చేస్తున్నాని, అదేవిధంగా ప్రొఫెసర్ మంగు నాయక్ వైస్ ప్రిన్సిపాల్, పరిశోధనలో సలహాలు, సూచనలు ఇచ్చినందుకు వారికీ, నా కుటుంభం తరుపున నాకు సపోర్ట్ గా ఉన్నా అక్క,బావ, దారవత్ సుశీల రాము, అన్న, వదిన,బానోవత్ రవి నాయక్ సుచిత్ర, అదేవిధంగా నాతో తోడుగా పరిశోధన సమయంలో సపోర్ట్ గా నిలిచినా నా భార్య బానోతు జ్యోతికి, పిల్లలు, అరుష్ నాయక్, రుద్రభవేష్ అందరికి పేరు పేరు నా నాయొక్క హృదయ పూర్యక నమస్కారాలు అని డాక్టర్ బానోతు బాలసుబ్రహ్మణ్యం తెలిపారు.

## వర్షాకాలంలో మూగజీవాలకు తప్పనిసరి టీకాలు వేయించాలి



**తుంగతుర్తి, ఆగస్టు 2,( మనం న్యూస్):** మూగజీవాలకు వర్షాకాలంలో నీలి నాలుక వ్యాధి రాకుండా టీకాలు వేయించుకోవాలని జిల్లా పశు వైద్య మరియు పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ శ్రీనివాస్ రావు అన్నారు. శనివారం తుంగతుర్తి ప్రాంతీయ పశు వైద్యశాలను ఆకస్మికంగా ఆయన తనిఖీ చేసి టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా గొర్రె జవాలకు నీలి నాలిక వ్యాధి రాకుండా ఇచ్చే టీకాలను గొర్రెల పెంపకం దారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో స్థానిక పశు వైద్య సహాయక సంచాలకులు డాక్టర్ రవి ప్రసాద్. బుచ్చిబాబు ,గణేష్, గొర్రెల కాపర్లు లింగయ్య, అవిలయ్య, నాగయ్య యాదయ్య తదితరుల పాల్గొన్నారు.

## ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం అంగన్వాడీ ఉద్యోగులకు వేతనాలు పెంచాలి

- అంగన్వాడీ ఉద్యోగులను పెర్మినెంట్ చేయాలి
- ట్రాన్స్ఫర్, ప్రమోషన్లు వెంటనే పూర్తి చేయాలి
- కార్మిక ,గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామికి సీఐటీయూ వినతి



**మంచిర్యాల, ఆగస్ట్ 2 ( మనం న్యూస్):** ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం అంగన్వాడీ ఉద్యోగులకు వేతనాలు పెంచాలని, ఆన్లైన్ యాప్ లను రద్దు చేయాలని, ట్రాన్స్ఫర్లు, ప్రమోషన్లు వెంటనే పూర్తి చేయాలని తెలంగాణ రాష్ట్ర కార్మిక ,గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి కి సీఐటీయూ నాయకులు విజ్ఞప్తి చేశారు . తెలంగాణ అంగన్వాడీ టీచర్స్అండ్ హెల్పర్స్ యూనియ న్ (సీఐటీయు) ఆధ్వర్యంలో శనివారం అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని మంత్రి వినతిపత్రం ఇచ్చారు . ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు 2 యాప్ ల పేర్లతో అంగన్వాడీలను పని ఒత్తిడికి గురిచేస్తుందని, ఇతర పనులు, సర్వేలు చేపిస్తూ అంగన్వాడీలను ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు . ఐసీడిఎస్ జిల్లా పిడి రాష్ట్రంలో ఎక్కడ లేని విదంగా జి.పి ఎస్ యాప్ ను జిల్లాలో పెట్టి ప్రతి రోజు ఉదయం మధ్యాహ్నం, సాయంత్రం దీని ద్వారా ఫోటోలు పెట్టాలని అంగన్వాడిలను ఇబ్బందులకు మానసిక ఒత్తిడికి గురిచేయడం మానుకోవాలని ఈ యాప్ ను తొలగించాలన్నారు . పేస్ మాక్చర్ యాప్ ను రద్దు చేయాలని, ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని, అంగన్వాడీ కేంద్రాలకు పక్క భవనాలు నిర్మించి, కనీస సౌకర్యాలు కల్పించాలని, ట్రాన్స్ఫర్, ప్రమోషన్లకు దరఖాస్తు పెట్టుకున్న అర్హులైన అభ్యర్థులకు న్యాయం చేయాలన్నారు . పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు, ఇంటి అద్దెలు పెంచాలని, ఐసీడిఎస్ అధికారుల వేధింపులు ఆపాలని, వేతనాలు పెంచకుండ, సమస్యలు పరిష్కరించకుండా పని చెయ్యాలని ఒత్తిడి చేయడం సరైంది కాదన్నారు . కావున రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని అంగన్వాడీ యూనియన్ సీఐటీయూ గా మంత్రికి వినతి చేస్తాన్మన్నారు . ఈ కార్యక్రమంలో శారదా, ప్రవీణ అంగన్వాడీ యూనియన్ సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మండల మహిళా సమాఖ్యలు ప్రభుత్వ పథకాల పట్ల అవగాహన కలిగి ఉండాలి



**జగిత్యాల, ఆగస్టు 02 (మనం ప్రతినిధి):** మహిళ సంఘాల సభ్యులకు ప్రభుత్వ పథకాల పట్ల అవగాహన కల్పించాల్సిన బాధ్యత మండల సమాఖ్య ప్రతినిధులపై ఉందని జిల్లా గ్రామీణభివృద్ధి శాఖ అధికారి రఘువరణ్ అన్నారు., జిల్లా సమాఖ్య కార్యాలయ సమావేశ మందిరం లో జిల్లా సమాఖ్య సమావేశం లో అయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని అట్టి సంక్షేమ పథకాలు పేద మహిళలకు అందేలా కృషి చేయాలనీ, ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాల ద్వారా లభిస్తున్న వివిధ ఆదాయభివృద్ధి కార్యక్రమాలు ఏర్పాటు చేయించి వారి ఆర్థిక స్థితి గతులను మెరుగు పరిచేలా కృషి చేయాల్సిన బాధ్యత మండల సమాఖ్య లదని, అట్టి బాధ్యతలు అమలు పరిచేలా పర్యవేక్షణ జిల్లా సమాఖ్య కృషి చేయాలనీ, అలాగే ప్రభుత్వ హాస్టల్స్ కి కాస్మోటిక్స్ సరఫరా మహిళా సంఘాల వారు సప్లయ్ చేయడానికి సెర్ప్ నుండి ఆదేశాలు వచ్చాయని, కాబట్టి సంబంధిత మండలాల నుండి ప్రపోజల్స్ లాగిన్ లో ఎంట్రీ చేయాలనీ, రాబోవు సీజన్ లో ఐకేపీ కొనుగోలు కేంద్రాలు పెంచేలా చేయడం జరుగుతుందని, జిల్లా సమాఖ్య క్యాంటిన్ ని ఇంకా ఆధునిక హంగులు చేసేలా చూడాలని, ఉల్లాస్ సర్వే పూర్తి చేయాలనీ, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులు రెండో జత త్వరిత గతిన కుట్టి ఇవ్వాలని అన్నారు., జిల్లా సెర్ప్ ఎపిడీ సునీత మాట్లాడుతు మండల, గ్రామ సమాఖ్య లు,స్వశక్తి సంఘాల పుస్తకాల నిర్వహణ, ఆర్థిక లావాదేవీల పట్ల పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలని, బ్యాంకు లింకేజి, స్త్రీనిధి రుణాలు టార్గెట్ ప్రకారం సిబ్బంది తో పూర్తి చేయించాలని, మండల సమాఖ్య ఓబీ సభ్యుల గ్రామ సమాఖ్యలు, స్వశక్తి సంఘాల నిర్వహణ పూర్తి స్థాయిలో సక్రమంగా నిర్వహించేలా ఉండాలని, ఖచ్చితంగా సమావేశం లో తీర్మానం చేసి ఉండాలని అన్నారు., ఇంకా ఫామ్, నాన్ ఫామ్, సంస్థగత నిర్మాణం, మార్కెటింగ్, డ్రెస్ లు కుట్టుట ఇంకా పలు సెర్ప్ కార్యక్రమాల గూర్చి సభ్యులకు తెలియజేయడం జరిగింది.జిల్లా డి.పి.యం.లు విజయ భారతి,నారాయణ, రమేష్, నాగేశ్వర్ రావు, స్త్రీనిధి ఆర్. యం. రాం నారాయణ,జిల్లా ఎపియంలు కే.చక్రవర్తి,ఆర్. త్రివేణి,వి. గంగాధర్, ఏ. శ్రీనివాస్, యం. డి. అహ్మద్ హుస్సేన్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు డి. సరోజన, ప్రధాన కార్యదర్శి ఎన్. ఆమనీ, కోశాధికారి సి. హెచ్. హరిత, జెడ్ ఎస్ అసిస్టెంట్ భాగ్య లక్ష్మి, 18 మండలాల మండల సమాఖ్యల అధ్యక్షురాళ్లు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం 55వ స్నాతకోత్సవం

**హైదరాబాద్, ఆగస్టు 2వ(మనంన్యూస్):** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం 55వ స్నాతకోత్సవం శనివారం రాజేంద్రనగర్ లోని విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. 2021-2022 మధ్య ఉత్తీర్ణులైన 844 మంది యూజీ,పీజీ, పి హెచ్ డి విద్యార్థులకి విశ్వవిద్యాలయ కులపతి, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అధ్యక్షతన జరిగిన ఈ స్నాతకోత్సవంలో పట్టాలు ప్రధానం చేశారు. తొలుత పీజేటీఏయు ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య వార్షిక నివేదికను సమర్పించారు. విశ్వవిద్యాలయం వివిధ పంటల్లో విడుదల చేసిన వంగడాలు జాతీయస్థాయిలో ఆదరణ పొందుతున్నాయని అల్దాస్ జానయ్య తెలిపారు. బోధన, పరిశోధన, విస్తరణల్లో విశ్వవిద్యాలయం బహుముఖ ప్రతిభ కనబరుస్తుందన్నారు. దేశ, విదేశాలకు చెందిన అనేక ప్రముఖ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకున్నామని జానయ్య తెలిపారు. అగ్రి హబ్, ఇతర ల్యాబ్ లను విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేశామని తెలిపారు. ఐసీఏఆర్ విశ్వవిద్యాలయ కులపతి జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రిఎనుముల రేవంత్ రెడ్డి ల తోడ్పాటుతో విశ్వవిద్యాలయాన్ని అత్యున్నత స్థాయికి తీసుకెళ్లడానికి కృషి చేస్తున్నామని జానయ్య వివరించారు.ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసీఏఆర్) డైరెక్టర్ జనరల్, డిపార్ట్మెంట్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ కార్యదర్శి డాక్టర్ మంగీలాల్ జాట్ స్నాతకోత్సవ ప్రసంగం చేశారు. ఈ విశ్వవిద్యాలయంలో చదివిన ఎందరో వ్యక్తులు నేడు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ స్థానాల్లో ఉండి దేశానికి, రైతాంగానికి సేవలు అందిస్తున్నారన్నారు. ఒకనాడు ఆహార కొరత ఎదుర్కొన్న దేశం నేడు ఆహార ధాన్యాల మిగులు స్థాయికి చేరుకుందని జాట్ అన్నారు. దీనికి శాస్త్ర విజ్ఞానం, ప్రభుత్వాల విధానాలు, రైతుల నిరంతర శ్రమలే దోహదం చేశాయన్నారు. నేడు తెలంగాణ, ఇతర రాష్ట్రాల కారణంగా దేశం వరి ఉత్పత్తిలో ప్రథమ స్థానంలో నిల్చిందన్నారు. భూగర్భజలాల క్షీణత, భూసార క్షీణత, పర్యావరణ విధ్వంసం, పర్యావరణ మార్పులు వంటి సవాళ్లను నేడు మనం ఎదుర్కొంటున్నామని జాట్ అన్నారు. ఈ సవాళ్లను సమర్థంగా ఎదుర్కొని 2047 నాటికి 'వికసిత్ భారత్' గా రూపాంతరం చెందటానికి అందరూ కృషి చేయాలన్నారు. స్థానిక పంటలను, తృణధాన్యాల పంటలను విరివిగా ప్రోత్సహించాలన్నారు. కొత్త కొత్త అంశాల్లో పరిశోధనలు చేపట్టాలని వ్యవసాయ రంగంలో డేటాని సమర్థంగా వినియోగించుకోవాలని, సహజ సేంద్రియ వ్యవసాయ, అంతర పంటల సాగులపై దృష్టి పెట్టాలని జాట్ సూచించారు. నూతన నైపుణ్యాలను ఉపయోగించుకోవాలని పరిశోధనలను రైతుల ముంగిటకు సాధ్యమైనంత త్వరగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో అధునాతన నైపుణ్యాలు, బోధనలకి పెద్దపీట వేయాలని, మానవ వనరుల యాజమాన్యాన్ని సమర్థవంతంగా చేపట్టాలని జాట్ అభిప్రాయపడ్డారు. అదేవిధంగా సంస్థల్లో అవసరమైన సంస్కరణలు చేపట్టి సంస్థలన్ని పూర్తి సమన్వయంతో పనిచేయాలన్నారు. వ్యవసాయ పరిశోధనల్లో పెట్టుబడులు మరింత పెరగాల్సిన అవసరం ఉందని జాట్ అభిప్రాయపడ్డారు. 1965లో నాటి ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి జాతికి అంకితం చేసిన ఈ వ్యవసాయ విశ్వవిద్యాలయం బహుముఖాలుగా విస్తరించడం చాలా గర్వకారణమని రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయ కులపతి జిష్ణుదేవ్ వర్మ అభినందించారు. వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లకు దీటుగా పనిచేస్తూ వ్యవసాయ విశ్వవిద్యాలయం తన ప్రయాణాన్ని సాగిస్తుందన్నారు. దేశంలోనే తొలిసారిగా ఈ మధ్యనే పీజేటీఏయు, సెంటర్ ఫర్ డిజిటల్ అగ్రికల్చర్ ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. అదేవిధంగా స్మార్ట్, డిజిటల్ వ్యవసాయాల పరిశోధనలకు పెద్దపీట వేస్తూ ఎస్ బి ఐ ఫౌండేషన్ సహకారంతో అరిసా ల్యాబ్ ని పీజేటీఏయుఏర్పాటు చేస్తుందన్నారు. భవిష్యత్తులో విశ్వవిద్యాలయం దేశంలో తొలి పది స్థానాల్లో నిలవనుందని గవర్నర్ ఆశాభావం వ్యక్తం చేశారు. పీజేటీఏయు ఈ మధ్య నిర్వహించిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం, 'ప్రతి గ్రామానికి నాణ్యమైన విత్తనాలు' కార్యక్రమాల వల్ల రైతాంగానికి చాలా మేలు జరిగిందని వివరించారు. వాతావరణమార్పులు, మార్కెటింగ్ తదితర సవాళ్లకు అనుగుణంగా శాస్త్రవేత్తలు కొత్త పరిష్కారాలు చూపించాలన్నారు. యువతకి, మహిళలకి ఉపాధి కల్పించడంతోపాటు పేదరికం రూపుమాపి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో వ్యవసాయానిది ప్రధాన పాత్ర అని.. యువ పట్టభద్రులు రైతులకు నిరంతర సేవలందిస్తూ వారి సాగుని లాభసాటిగా చేసేందుకు కృషి చేయాలని గవర్నర్, విశ్వవిద్యాలయ కులపతి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పీజీ పి హెచ్ డి విద్యార్థులకు పట్టాలు ప్రధానం చేశారు. అదేవిధంగా అత్యుత్తమ ప్రతిభగల కనపరిచిన 20 మంది విద్యార్థులకు 30 బంగారు పతకాలు అందజేశారు. కంది అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఎ. భార్గవి బి.టెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) లో అత్యధిక ఓ జి పి ఏ సాధించినందుకు 6 బంగారు పతకాలు, వరంగల్ వ్యవసాయ కళాశాలకు చెందిన అర్షియా తబస్యుమ్ బిఎస్సీ (ఆనర్స్), అగ్రికల్చర్ లో అత్యధిక ఓ జి పి ఏ సాధించినందుకు నాలుగు బంగారు పతకాలు పొందింది. ఈ స్నాతకోత్సవంలో రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్, విశ్వవిద్యాలయ పాలక మండలి సభ్యులు, విశ్వవిద్యాలయ అధికారులు, పూర్వ ఉపకులపతులు, రిజిస్ట్రార్ లు, ఐసీఏఆర్ సంస్థల ప్రతినిధులు,అధికారులు వివిధ బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## మీ సేవ కేంద్రాల్లో అధిక రుసుము వసూలు చేస్తే కఠిన చర్యలు



- ఈ డి ఎం శ్రీకాంత్

**జయశంకర్ భూపాలపల్లి, ఆగస్టు 02 (మనం ప్రతినిధి ):** మీ సేవా ద్వారా అందించే పౌర సేవలకు ప్రభుత్వం నిర్దేశించిన రుసుము కంటే అదనంగా తీసుకుంటే చర్యలు తప్పవని ఈడీఎం శ్రీకాంత్ స్పష్టం చేశారు.శనివారం కాటారం మండల కేంద్రంలోని మీ సేవా కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సేవల అందుబాటు, ప్రజలకు అందిస్తున్న సౌకర్యాలు తదితర అంశాలను పరిశీలించారు. ప్రజలు ఏవైనా సమస్యలు ఎదుర్కొంటున్నట్లయితే సంబంధిత అధికారులను సంప్రదించాలని, ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలని నిర్వాహకులకు సూచించారు. ప్రజలకు అంతరాయం లేకుండా సేవలు అందించాలని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలందించడమే మీ సేవా కేంద్రాల కర్తవ్యం తెలిపారు. మీ సేవా కేంద్రాల ద్వారా అందించు సేవలకు సంబంధించి ధరల పట్టిక ఏర్పాటు చేయాలని నిర్వహకులను ఆదేశించారు.

## దర్పల్లి, ఇందల్వాయిల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**నిజామాబాద్, ఆగస్టు 02 ( మనం బ్యూరో ):** ధర్పల్లి, ఇందల్వాయి మండలాల్లో కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి శనివారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ధర్పల్లి మండలం ఒన్నాజిపేట్‌లోని జిల్లా పరిషత్ హైస్కూల్, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్, ఎరువుల గోడౌన్లను కలెక్టర్ సందర్శించారు. ఇందల్వాయి మండలంలోని ఎల్లారెడ్డిపల్లిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను, సహకార సంఘం ఎరువుల గిడ్డంగిని తనిఖీ చేశారు. పాఠశాలల్లో బోధన, బోధనేతర సిబ్బంది హాజరును పేస్ రికగ్నేషన్ విధానం ద్వారా చేపడుతున్నారా అని ఆరా తీశారు. విద్యార్థుల ప్రవేశాలు, హాజరవుతున్న వారి సంఖ్యను కలెక్టర్ ప్రధానోపాధ్యాయుడిని అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. ఎరువుల గిడ్డంగుల్లో అందుబాటులో ఉన్న నిల్వలు స్టాక్ రిజిస్టర్‌లోని వివరాలకు అనుగుణంగా ఉన్నాయా అని పరిశీలించారు. రైతుల అవసరాలకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎరువుల వివరాలతో కూడిన స్టాక్‌బోర్డులను ప్రతిచోటా తప్పనిసరిగా ప్రదర్శించాలని, శాశ్వత ప్రాతిపదికన బోర్డులను ఏర్పాటు చేయించాలని సూచించారు. జిల్లా అవసరాలకు సరిపడా ఎరువులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నందున, ఎక్కడ కూడా ఎరువుల కోసం రైతులు ఇబ్బందులు పడకుండా ప్రణాళికాబద్ధంగా పంపిణీ జరిగేలా కృషి చేయాలని చెప్పారు. ఎల్లారెడ్డిపల్లిలో ఒకే ప్రాంగణంలో మూడు అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతుండడాన్ని గమనించిన కలెక్టర్ ఎందుకు ఒకేచోట నిర్వహిస్తున్నారని అధికారులను ప్రశ్నించారు. గదులు ఒకేచోట అందుబాటులో ఉన్నందున ఒకే ప్రాంగణంలో నిర్వహిస్తున్నామని స్థానిక అధికారులు తెలిపారు. చిన్నారులను కేంద్రాలకు పంపేందుకు ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కలెక్టర్ సూచించారు. పిల్లలకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందిస్తూ, ఆటపాటల ద్వారా పూర్వ ప్రాథమిక విద్యా కార్యక్రమాలను నిర్వహించాలని అంగన్‌వాడీ టీచర్ రజితను ఆదేశించారు. ఎల్లారెడ్డిపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల ప్రగతి గురించి పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులందరూ ఇంటి నిర్మాణం చేపట్టేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ జరపాలని సూచించారు. కలెక్టర్ వెంట స్థానిక అధికారులు ఉన్నారు.

## శ్రీ మహాత్మా హైస్కూల్లో ఘనంగా బోనాల ఉత్సవాలు



**రాయపర్తి ఆగస్టు 2 (మనం న్యూస్):** మండల కేంద్రంలోని శ్రీ మహాత్మా హైస్కూల్లో శనివారం ముందస్తు బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి, మట్టి కుండలో బోనం వండి వేపాకు పసుపు కుంకుమలతో అలరించిన తలపై పెట్టుకొని పోతరాజులు శివసత్తులు వెంటరాగా నృత్యాలు చేస్తూ విద్యార్థులు ఆటపాటలతో మారెమ్మ వరకు బోనాలు ఎత్తుకొని పోయి దైవ దర్శనం చేసుకున్నారు. విద్యార్థులు వివిధ వేషాధారణాలు ధరించి పలువురిని ఆకట్టుకున్నారు.అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులు డాన్సులతో పాటలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సరికొండ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మన సంస్కృతి సాంప్రదాయాల పట్ల అవగాహన కోసం ఇలాంటి కార్యక్రమాలు పాఠశాలలోఏర్పాటు చేస్తున్నామని, తెలంగాణ పండుగలు వాటి ప్రాధాన్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కుంట రమేష్, పాఠశాల ఇన్చార్జి కిరణ్, ఉపాధ్యాయులు దయాకర్, పండరినాథ్, మహేందర్, కపిల్, స్మిజా, అనిత, షమ్మీ, రజిత, మాధవి తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య కేంద్రానికె...అనారోగ్యం



- శిథిలావస్థలో వంగర పిహెచ్ సి
- చినుకు పడితే చిత్తడే..
- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రోగులు

**భీమదేవరపల్లి,ఆగస్టు 02 ( మనం న్యూస్ ):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర ప్రభుత్వ ఆసుపత్రి భవనం శిథిలావస్థకు చేరింది. భవనం లోపల పైకప్పు పెచ్చులూడి పడుతుండడంతో ఆసుపత్రిలో రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షం వస్తే పైకప్పు నుండి నీరు పడటంతో పాటు మందుల గదిలో నీళ్ళు చేరుతున్నాయి. ఆస్పత్రి భవనం చుట్టూ ముళ్ళ పొదలు పెరిగి చిట్టడవిని తలపిస్తోంది. దీంతో ఆసుపత్రిలోకి పాములు వస్తుండడంతో రాత్రిపూట రోగులు, విధులకు వచ్చే సిబ్బంది జంకుతున్నారు. వంగర ప్రభుత్వాసుపత్రిలో సరిపడా వైద్యులను కేటాయించి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న మౌలిక సదుపాయాలు లేకపోవడం ఇబ్బందులకు గురి చేస్తోందని వంగర గ్రామస్తులు తెలుపుతున్నారు. భవనం శిథిలావస్థకు చేరడంతో ఇబ్బందులకు గురవుతున్నమన్నారు. వంగర చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రే దిక్కని, ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లే స్తోమత లేదని తెలిపారు. తక్షణమే ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణాన్ని శుభ్రం చేయించి, కొత్త భవనాన్ని నిర్మించాలని కోరుతున్నారు.

## పశు సంవర్ధక శాఖలో మందుల కొరత




- గత నాలుగు ఐదు నెలల నుండి మందుల కొరత
- ప్రైవేట్ మెడికల్ కి మందులు రాసిస్తున్నవైనం.

**కామారెడ్డి, జులై 02 ( మనం న్యూస్ ):** కామారెడ్డి జిల్లాలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులను రక్షించడానికి, పశువులకు ఎలాంటి ప్రాణనాష్టం జరగకుండా గత ప్రభుత్వం ప్రత్యేకించి పశువుల కోసం అంబులెన్స్ ను ఏర్పాటు చేశారు. అయితే కామారెడ్డి జిల్లాలో కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ ప్రతి నియోజకవర్గానికి 1962 టోల్ ఫ్రీ ద్వారా అంబులెన్స్ కు సమాచారం అందించవచ్చు అని గత ప్రభుత్వం ప్రారంభించింది. అయితే గత ఐదు ఆరు నెలల నుండి పశుసంవర్ధక శాఖ అంబులెన్స్ లో మందుల కొరత తీవ్రంగా ఏర్పడుతుంది. అంబులెన్స్ సక్రమంగా సమయానికి చేరుకున్న పశువుల కావలసిన మందులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బంది ఏర్పడుతుంది. మందులు లేకపోవడంతో ప్రైవేట్ మెడికల్ నుండి మందులు తీసుకురావలసి పని ఏర్పడుతుంది. దీనివలన పశువులు పెంచే వారికి తీవ్ర ఇబ్బంది అవుతుంది. కొన్ని మారుమూల ప్రాంతాలలో పశువులకు మందులు దొరకకపోవడంతో దూరం ప్రయాణించవలసి వస్తుంది. జుక్కల్, ఎల్లారెడ్డి ప్రజలకు చాలా ఇబ్బంది పరిస్థితి ఏర్పడుతుంది. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులు స్పందించి అంబులెన్స్ లో మందుల కొరత లేకుండా చూసుకోవాలని జిల్లా ప్రజలు కోరుకుంటున్నారు.

## గడువు ముగిసిన మందులను రోగులకు ఇవ్వరాదు

- వైద్య అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్



**కామారెడ్డి, ఆగస్టు 02 ( మనం జిల్లా ప్రతినిధి ):** గడువు ముగిసిన మందులను రోగులకు ఇవ్వరాదని కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ వైద్య అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ కామారెడ్డి మండలంలోని దేవన్ పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో గల క్యాసంపల్లి ఆయుష్మన్ ఆరోగ్య కేంద్రన్ని (ఉప ఆరోగ్య కేంద్రాన్ని) ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయుష్మన్ ఆరోగ్య కేంద్రలో (ఉప ఆరోగ్య కేంద్రాన్ని) అందుతున్నటువంటి సేవల గురించి ఆరా తీశారు. రక్త పరీక్షల గదిని పరిశీలించి అవసరమైన వారికి ప్రాథమికంగా వైద్య పరీక్షలు కచ్చితంగా చేయాలని అన్నారు. అదేవిధంగా డ్రగ్ స్టోర్ ను పరిశీలించి వర్షాకాలంలో అధికంగా ఉపయోగపడే జ్వరం, విరేచనాలు, దగ్గు,జలుబు తదితర వ్యాధుల మందులను ఎప్పుడూ అందుబాటులో ఉంచాలని, కాలం చెల్లిన మందులను ఉపయోగించారని ఆదేశించారు. వ్యాక్సినేషన్ గదిని పరిశీలించి గర్భిణీలకు, చిన్నారులకు నిర్ణీత సమయాలలో వ్యాక్సినేషన్ వేయాలని సూచించారు. రోజు ఎంతమంది అవుట్ పేషంట్లు ఈ ఆస్పత్రికి వస్తున్నారని అడిగి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున వైద్యులు, వైద్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదేశించినారు.. ఆసుపత్రిలో వివిధ విభాగాలలో అందుచున్నటువంటి సేవల గురించి తెలుసుకుని సంతృప్తి చెందారు. విధుల పట్ల అలసత్వం గానీ అశ్రద్ధ వహించినటువంటి సిబ్బంది పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ పి చంద్రశేఖర్ ను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటుచేసిన వాన నీటి ఇంకుడు గుంతను పరిశీలించారు. గ్రామంలో అపరిశుభ్ర వాతావరణం ఏర్పడకుండా క్రమం తప్పకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించాలని ఇంచార్జి పంచాయతీ సెక్రెటరీని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రభు కిరణ్, దేవన్పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ జోహా ముజీబి, క్యాసంపల్లి ఉప ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ మీనాక్షి దేవి ఉన్నారు.

## కెనాల్ కాల్వ పూడికతిత పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే



**రాయపర్తి, ఆగస్టు 2 (మనం న్యూస్):** మండలంలోని తిరుమలాయపల్లి గ్రామ సమీపంలోని మంచినీళ్ల చెరువులోకి వచ్చే ఎస్సారెస్పీ ఫీడర్ కాలువ పూర్తిగా కూడిపోయి పిచ్చి మొక్కలతో ముళ్ళపొదలతో కూరుకుపోగా, నీటిపారకంతో ఇబ్బందులు వస్తున్నాయని రైతులు ఎమ్మెల్యే కు విన్నవించుకోగా స్పందించి శనివారం పూడికతీత పనులను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ నాయకులు రైతులకు ఏదో మేలు చేసినట్టుగా ఉన్నారే తప్ప, రైతులను ఏనాడు పట్టించుకోలేదని పట్టించుకున్నట్లయితే కాలువలు ఈ విధంగా ఉండేవి కావని , ఎప్పటికప్పుడు ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి, కూడిపోయిన కాలువలను పునరుద్ధరించడానికి బడ్జెట్ అంచనాలు వేశామని, భాగంగానే ఒక రాయపర్తి మండలానికి కోటి రూపాయలు మంజూరు అయ్యాయని, కొన్నిచోట్ల మా సొంత ఖర్చులతో కూడికతీత పనులు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హామ్య నాయక్, మాజీ టీపీసీసీ కార్యదర్శి బిల్లా సుధీర్ రెడ్డి, వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి, కృష్ణమాచార్యులు, ఉల్లెంగుల నరసయ్య, ఆకుల సురేందర్రావు, కాంచనపల్లి వనజారాణి, ముద్రబోయిన వెంకటేశ్వర్లు, చెవ్వు కాశీనాథం, మచ్చ రమేష్, అప్రోజ్ ఖాన్, పిరని ప్రవీణ్ ఇరిగేషన్ అధికారులు కిరణ్, బాలదాసు తదితరులు పాల్గొన్నారు.

## మేము నిర్మించిన ప్రాజెక్టులు ఇప్పటికీ చెక్కుచెదరలేదు

- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



**భిక్కనూరు, ఆగస్టు 02 ( మనం న్యూస్ ):** తమ ప్రభుత్వ హయాంలో 70 సంవత్సరాల క్రితం నిర్మించిన ఒక్క ప్రాజెక్టు కూడా ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. కానీ అప్పటి సీఎం కేసీఆర్ ప్రభుత్వంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మాత్రం, కట్టిన రెండేళ్లకే పగుళ్లు ఏర్పడ్డాయని తీవ్రస్థాయిలో ఫైరయ్యారు. శనివారం నాడు ఆయన భిక్కనూరు గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కథ స్క్రీన్ ప్లే... డైరెక్షన్ లో ఆయన హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు పరిస్థితి ఆందోళనకరంగా మారిందన్నారు. ప్రాజెక్టు నిర్మించిన కొద్ది రోజులకే అధికారం కోల్పోయి కేసీఆర్ ఫామ్ హౌస్ లో పడుకుంటున్నాడని విమర్శించారు. అంతర్గతంగా తమకు అందిన సమాచారం మేరకు క్యాబినెట్ ఆమోదం లేకుండా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారన్నారు. ఈ విషయమై ప్రభుత్వ నివేదిక కోసం ఎదురుచూస్తున్నామని, ఈనెల 14న జరిగే కేబినెట్ భేటీలో అధికారులు ఇచ్చే రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు చెప్పారు. చట్టానికి విరుద్ధంగా లక్షా 20 వేల కోట్లతో నిర్మించిన ప్రాజెక్టు నిర్మాణ విషయమై, అప్పటి కేసీఆర్ ప్రభుత్వానికి సీరియస్ గా శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ విధంగా అస్తవ్యస్త పనులు చేపట్టి గరీబోళ్ల పైసలతోపాటు, అన్ని వర్గాల ప్రజల పైసలతో ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి ఖజానాను లూటీ చేశాడని ధ్వజమెత్తారు. గత పదేళ్ల బీ ఆర్ఎస్ పాలనలో ఒక్క కొత్త రేషన్ కార్డు ఇచ్చిన పాపాన పోలేదని, కానీ తమ ప్రభుత్వం రేషన్ కార్డు లేని వారికి కొత్త రేషన్ కార్డులు ఇస్తున్నామన్నారు. ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వమని, పేదల పక్షాన నిలబడే మీ ప్రభుత్వమని మీకేం కావాలన్న పనులు చేసి పెట్టేందుకు తాను సిద్ధంగా ఉన్నానని షబ్బీర్ అలీ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బద్ధం ఇంద్రకరణ్ రెడ్డి, తహసిల్దార్ సునీత దేవి, ఎంపీడీఓ రాజ్ కిరణ్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుపరి భీమ్ రెడ్డి, మండల విద్యాధికారి రాజ్ గంగారెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి మహేష్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, సొసైటీ చైర్మన్ గంగల భూమయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బల్యాల సుదర్శన్, మాజీ ఎంపీపీ అధ్యక్షురాలు రేఖ సుదర్శన్, జిల్లా కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కుంట లింగారెడ్డి, తాటిపాముల లింబాద్రి, దుంపల మోహన్ రెడ్డి, తాటిపాముల విజయ్ కుమార్ గౌడ్, అందె దయాకర్ రెడ్డి, నీల ఆంజనేయులు, శ్రీరామ్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ జనహిత పాదయాత్ర

నిజామాబాద్ జిల్లా | 3వ రోజు





## ఆర్మూర్‌లో అడుగడుగునా జన నీరాజనం

- శ్రమదానంతో ప్రజల్లో సేవా భావం పెంపొందించాలి
- పేదోళ్ల సమస్యలకు చెక్ పెట్టడానికే యాత్ర
- ప్రజల కంటే పెద్ద దేవుళ్ళు ఎవ్వరూ లేరు
- మీ అందరి ఆశీర్వాదాలతో వచ్చిందే కాంగ్రెస్ ప్రభుత్వం
- హామీల అమలుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది
- పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్
- పాదయాత్రలో పాల్గొన్న ఉమ్మడి నిజామాబాద్ కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు, ప్రజలు





**నిజామాబాద్, ఆగష్టు 02(మనం బ్యూరో):** కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ తలపెట్టిన జనహిత పాదయాత్ర శనివారం నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌కు చేరుకుంది. 5 రోజుల పాటు జరగనున్న ఈ పాదయాత్రలో భాగంగా రంగారెడ్డి జిల్లా పరిగిలో మొదలైన జనహిత పాదయాత్ర రెండవ రోజు సంగారెడ్డి జిల్లా ఆందోల్ నియోజకవర్గంలో కొనసాగింది. అనంతరం, మూడో రోజు శనివారం సాయంత్రం నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజకవర్గానికి చేరుకుంది. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పాల్గొంటున్న జనహిత పాదయాత్ర తొలుత నిజామాబాద్ జిల్లా ఆలూరు మండల కేంద్రం నుంచి ఆర్మూర్ పట్టణం వరకు కొనసాగింది. పట్టణంలోని గురుకుల పాఠశాలలో శనివారం శ్రమదాన కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉంది. అయితే, షెడ్యూల్లో స్వల్ప మార్పుల అనంతరం, ఆలూరు బైపాస్ నుంచి ప్రారంభమైన పాదయాత్ర పాత బస్టాండ్, అంబేద్కర్ చౌరస్తా, మామిడిపల్లి మీదుగా పెర్కిట్ చౌరస్తాకు చేరింది. ముందుగా ఆలూరు బైపాస్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేసి పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌తో కలిసి పాదయాత్రను రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ ప్రారంభించారు. విజయవంతంగా కొనసాగుతున్న జనహిత పాదయాత్రకు వందలాదిగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు శ్రేణులు, ఎన్ఎస్‌యూఐ నాయకులు, సోషల్ మీడియా ఇన్చార్జిలు తరలి రావడంతో ఆర్మూర్ పట్టణం జన సంద్రమైంది. దారి పొడవునా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఆమెకు ఘన స్వాగతం పలికి, అడుగడుగునా నీరాజనాలు అందించారు. ''జై కాంగ్రెస్.. జై జై కాంగ్రెస్...'' అంటూ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఆమెకు మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా మీనాక్షి నటరాజన్ ప్రజల నుంచి వినతలు స్వీకరిస్తూ, సమస్యలు వింటూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.., ప్రజా సంక్షేమమే లక్ష్యంగా జనహిత పాదయాత్ర కొనసాగుతుందని తెలిపారు. పేదోడి సమస్యలకు చెక్ పెట్టడానికి జనహిత పాదయాత్ర జరుగుతుందని తెలిపారు. శ్రమదానం ద్వారా ప్రజల్లో సేవాభావం పెంపొందించాలన్నదే ప్రధాన లక్ష్యమని తెలిపారు. దేశాన్ని సమూలంగా అర్థం చేసుకునేందుకే ఈ పాదయాత్ర ద్వారా జనాల్లోకి వెళ్తున్నట్లు పేర్కొన్నారు. పాదయాత్ర చేయడం వల్ల మన లోపాలను మనం చూసుకునే వీలుంటుందని తెలిపారు. దేవుళ్ళ దగ్గరికి వెళ్లాలంటే నడుచుకుంటూనే వెళ్తామని, ప్రజా క్షేత్రంలో ప్రజల కంటే పెద్ద దేవుళ్ళు ఎవరూ లేరని, ప్రజల దగ్గరికి వెళ్లడానికి పాదయాత్ర సరైందని పేర్కొన్నారు. గతంలో 3,500 కిలోమీటర్ల పాదయాత్రను రాహుల్ గాంధీ చేపట్టి ఒక కొత్త అధ్యాయానికి తెర లేపారని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ మార్గాన్ని ఆదర్శంగా తీసుకొని అదే విధంగా ప్రజా క్షేత్రంలోకి జనహిత పాదయాత్ర ద్వారా వచ్చినట్లు తెలిపారు. ప్రజలందరి ఆశీర్వాదాలతో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని వివరించారు.

### నేడు తొమ్మిది గంటల వరకు...

రాత్రి సీ కన్వెన్షన్ హాల్లో బస చేసిన అనంతరం, ఆదివారం ఉదయం ఏడు గంటల నుంచి 9 గంటల వరకు ఆలూరు మండల కేంద్రంలో సమాధానం కార్యక్రమంలో పాల్గొననున్నారు. అనంతరం, 10:30 గంటలకు అంకాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించి, 11 గంటలకు పీవీఆర్ యమునా ఫంక్షన్ హాల్‌లో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించనున్నట్లు ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వినయ్ కుమార్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు భూపతిరెడ్డి, మదన్ మోహన్ రావు, లక్ష్మీ కాంతారావు, కార్పొరేషన్ చైర్మన్లు మానాల మోహన్ రెడ్డి కాసుల బాలరాజ్, ఆర్మూర్ నియోజకవర్గ ఇన్చార్జి వినయ్ కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఆదివారం కొనసాగనున్న పాదయాత్రలో కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్ రావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, కామారెడ్డి మున్సిపల్ మాజీ చైర్మన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్ రెడ్డి, ఉమ్మడి జిల్లాలకు సంబంధించిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొననున్నారు.

## కేసీఆర్, హరీశ్ రావు ఒప్పందాల కారణంగానే బనకచర్ల

- పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

**మెదక్, ఆగస్టు 2 :** బీఆర్ఎస్ నాయకులు కేసీఆర్, హరీశ్ రావు గత ప్రభుత్వంలో ఏపీతో చేసుకున్న ఒప్పందాల కారణంగానే బనకచర్ల ప్రాజెక్టు తెరపైకి వచ్చిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. సంగారెడ్డి జిల్లాలో మూడో రోజు జనహిత పాదయాత్ర కొనసాగుతోంది. శనివారం ఉదయం జోగిపేట డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో కలిసి ఏఐసీసీ ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి దామోదర రాజనర్సింహ శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, తెలంగాణకు రావాల్సిన నీటి వాటాను కాపాడటమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. 42 శాతం బీసీల రిజర్వేషన్‌తో ఎమ్మెల్సీ కవితకు ఎలాంటి సంబంధం లేదని, కామారెడ్డి డిక్లరేషన్ ద్వారా ప్రవేశపెట్టి, దాన్ని అవలంబించిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందని చెప్పారు. దేశ చరిత్రలోనే మొట్ట మొదటిసారిగా కుల సర్వే జరిగింది.. తెలంగాణలో మాత్రమేనన్నారు. పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ కారణంగానే అది సాధ్యమైందన్నారు.

**'కేసీఆర్ దోషి' అని కాళేశ్వరం కమిషన్ తేల్చింది**

మాజీ సీఎం కేసీఆర్ దోషి అని కాళేశ్వరం కమిషన్ తేల్చిందని తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ప్రాజెక్టుల పేరుతో రూ.లక్షల కోట్లు వృథా చేశారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో ఇంజినీర్లు చెప్పింది కేసీఆర్ వినలేదని, సొంత లాభం మాత్రమే చూసుకున్నారని పేర్కొన్నారు. తనకు ఇష్టం ఉన్న చోట ప్రాజెక్టు కట్టాలని కేసీఆర్ ఇంజినీర్లకు చెప్పారన్నారు. రెండే పిల్లర్లు కూలాయని అంటున్నారు. ఇది చిన్న విషయమా? అని ప్రశ్నించారు. ఈ-కార్ రేసు వ్యవహారంలో ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అవినీతికి పాల్పడలేదా? అని ప్రశ్నించారు. ప్రజల సొమ్ము తిన్నవాళ్లు కక్కక తప్పదని ఆయన హెచ్చరించారు.







కాంగ్రెస్ జనహిత పాదయాత్రపై **మనం దినపత్రిక** ప్రచురించిన ప్రత్యేక పేజీని ఆసక్తిగా చదువుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ్మా, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ కార్యకర్తలు..

## అభివృద్ధి, సంక్షేమ పథకాలే లక్ష్యంగా కృషి చేద్దాం

- ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్
- ప్రజలకు చేరువయ్యేందుకు జనహిత పాదయాత్ర : పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

**సంగారెడ్డి/ జోగిపేట: ఆగస్టు 2(మనం న్యూస్) :** ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని కాంగ్రెస్ పార్టీ నేతలు, నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకువెళ్లి, వాటిపై ప్రజలకు మరింత అవగాహన కల్పించి, తగిన విధంగా కృషి చేయాలని జనహిత పాదయాత్రలో ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ అన్నారు. మూడో రోజులో భాగంగా సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తలతో సంగుపేటలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో జరిగిన సమావేశంలో శనివారం మీనాక్షి నటరాజన్ మాట్లాడారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వ తీరు తెన్నులు ఎండగట్టి, లోపాలను ఎత్తిచూపారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రతి నేత, నాయకుడు, కార్యకర్తలు జరుగుతున్న అభివృద్ధిపై ప్రజలకు వివరించి చెప్పాలన్నారు. గత పాలకుల చేసిన దుశ్చర్యలను ప్రజల మధ్యకు తీసుకెళ్లాలన్నారు. టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆధ్వర్యంలో ముఖ్య కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ప్రసంగించారు. మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికలలో ప్రజలతో ఎక్కువ ప్రాధాన్యత ఉన్న వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు దృష్టికి తీసుకు వెళ్తున్న పార్టీ కార్యకర్తలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి ప్రజల వద్దకు వెళ్లి లబ్ధి పొందే విధంగా సూచించాలన్నారు. కాంగ్రెస్ కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్న కార్యకర్తలకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. నియోజకవర్గంలోని ముఖ్య నాయకుల అభిప్రాయాలను ఈ సందర్భంగా అడిగి తెలుకున్నారు. తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ, 42 శాతం బీసీ రిజర్వేషన్లను అమలు కు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తున్నామని అన్నారు. బీజేపీ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే బీసీ రిజర్వేషన్ కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు.

వచ్చే నెలలో బీసీ రిజర్వేషన్ అమలుకై ఢిల్లీలో చేపట్టే ధర్నాకు బిజెపి ఎంపీలు చిత్తశుద్ధి ఉంటే బీసీ రిజర్వేషన్ చేయడానికి కేంద్రంపై వర్సిటీ తేవాలన్నారు. రైతు రుణ మాఫీ, రైతు భరోసా, గృహజ్యోతి, గ్యాస్ సబ్సిడీ, ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు వడ్డీ లేని రుణాలు, సీఎంఆర్ఎఫ్, ఎల్ఓసీల ద్వారా లబ్ధిపొందిన వారి వివరాలు ఇందిరమ్మ కమిటీ, గ్రామా కమిటీలు నిరంతరం లబ్ధిదారులతో సంబంధాలు పెంచుకోవాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు సమన్వయము చేసుకోని మంచి ఫలితాలు సాధించాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, నారాయణ ఖేడ్ శాసన సభ్యులు డా.సంజీవ రెడ్డి, మాజీ మంత్రి చంద్రశేఖర్, శాసనసభ్యులు జగ్గారెడ్డి, కాటా శ్రీనివాస్ గౌడ్, త్రిష రాజనర్సింహా, చైర్మన్ గిరిధర్ రెడ్డి, ఉజ్వల్ రెడ్డి, ఆవుల రాజిరెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్‌లు అంజయ్య, సుహాసిని రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షులు సంగమేశ్వర్, సురేందర్ గౌడ్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.








Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.